www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 | సంచిక : 261 | మంగళవారం 13-03-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

కార్చిచ్చు కమ్మేసింది

- తొమ్మిది మంది ట్రెక్కర్ల ఆహుతి
- వేడి, దట్టమైన పొగతో సహాయక చర్యలకు ఆటంకం
- బాధితుల హాహాకారాలతో భయభ్రాంతం



థేని : కురంగణి పర్వతాల్లోని రిజర్వు ఫారెస్టులో సంభవించిన కార్చిచ్చులో చిక్కుకున్న 9 మంది పర్వతారోహకులు మృతి చెందారు. మొత్తం 39 మంది ట్రెక్కర్లు అక్కడకు చేరుకోగా వారిలో 9 మంది మృతిచెందగా,8 మంది తీవ్రంగా గాయపడ్డారు. మరో 10 మందికి స్వల్ప గాయాలైయ్యాయి. తమిళనాడులోని థేనేలో ఆదివారం ఈ దుర్ఘటన జరిగింది. చెన్నైలోని ట్రెక్కింగ్ క్లబ్ పశ్చిమకనుమల్లోని బోడి సమీపంలోని కురంగణి అడవిలో 25 మంది మహిళలు, 3 చిన్నారులతో ట్రెక్కింగ్ సాహసానికి పూనుకొంది. వారు తిరిగివస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. 39 మందిలో 15 మందిని రక్షించారు. శుక్రవారం రాత్రి - మిగతా 2 లో

కుప్పకూలిన విమానం

50 మంది మృతి

- నేపాల్ త్రిభువన్ ఎయిర్‌పోర్టులో ప్రమాదం
- ల్యాండవుతుండగా ఫెన్సింగ్‌ను ఢీకొన్న బంగ్లా విమానం



ఖాట్మండు : నేపాల్ రాజధాని ఖాట్మండులో సోమవారం జరిగిన విమాన ప్రమాదంలో దాదాపు 50 మంది దుర్మరణంచెందారు. ప్రమాద సమయంలో విమానంలో 71 మంది ప్రయాణీకులు, సిబ్బంది ఉన్నారు. ఢాకా నుంచి ప్రయాణీకులతో వస్తున్న యూఎస్ బంగ్లా ఎయిర్‌లైన్స్‌కు - మిగతా 2 లో

తప్పిన మరో ప్రమాదం

- విమాన ఇంజన్‌లో సాంకేతిక లోపం
- అహ్మదాబాద్‌లో అత్యవసర ల్యాండింగ్

నదిలో కూలిన హెలికాప్టర్

ఐదుగురు దుర్మరణం 2 లో

మిజోరాం విమానాశ్రయంలో అగ్నిప్రమాదం

9 లో



ఎర్ర సునామీ...!

ముంబై వీధులు అరుణార్ణవం

- అక్కున చేర్చుకున్న జనం • తల్లడిల్లిన 'మహా' సర్కారు
- విధాన సభ ముట్టడికి ముందే చర్చలు
- నూరు శాతం డిమాండ్లకు ఓకే

వడలు వడిగి... నడుములు కుంగినా... పంటి బిగువున సత్తువ కూడగట్టి ఒకచేత్తో ఎర్ర జెండా.. మరో చేత్తో ముల్లుగర్ర పట్టి వృద్ధరైతులు చకచకా నడుస్తుంటే... నారీమణులు కొంగుబిగించి కదం తొక్కుతుంటే...యువరక్తం ఉత్తేజంతో ఉరకలు వేసిన వేళ... మహారాష్ట్ర రైతన్న లాంగ్ మార్చ్ ముంబైకి చేరింది. నడివీధుల్లో ఎర్ర సముద్రం కెరటాల్లా ఎగసిపడింది. రైతన్న సృష్టించిన ఈ సునామీకి మహారాష్ట్ర ప్రభుత్వం తల్లడిల్లిపోయింది. విలవిల్లాడింది. అన్నదాతల ఆగ్రహాన్ని తట్టుకోలేక... అన్ని డిమాండులను నెరవేర్చుతామని, చర్చలకు సిద్ధమని సీఎం ఫడ్నవీస్ శాసనసభ సాక్షిగా హామీ ఇవ్వగా... ఇక విధాన సభను ముట్టడించాల్సిన పని లేదని అధికారులు రైతుల చేతులు పట్టుకున్నారు. వారం రోజుల పాటు అకుంఠిత దీక్షతో... మహాపాదయాత్ర నిర్వహించిన అన్నదాతలను ముంబై వాసులు అక్కున చేర్చుకున్నారు. దారి పొడవునా అన్నపానీయాలు అందించి తమ రుణం తీర్చుకున్నారు. 12లో

పవన్ సొంతింటికి శంకుస్థాపన



విశాలాంధ్రబ్యూరో - గుంటూరు : గుంటూరు జిల్లా కాజా వద్ద సినీహీరో, జనసేనపార్టీ అధినేత పవన్‌కల్యాణ్ సొంతింటి నిర్మాణాలకు సోమవారం శంకుస్థాపన చేశారు. కాజా వద్ద రెండుఎకరాల స్థలంలో పవన్‌కల్యాణ్ సొంత ఇళ్లు నిర్మించుకుంటున్నారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు పవన్‌కల్యాణ్, ఆయన భార్య అన్నాలెజినోవాతో కలిసి భూమిపూజ చేశారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ సంప్రదాయబద్ధంగా భూమిపూజ జరిగింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల నడుమ శంకుస్థాపన వేడుకగా సాగింది. జనసేన పార్టీ కార్యాలయాన్ని కూడా ఇక్కడ నిర్మించే యోచనలో ఆయన ఉన్నారు. జనసేన పార్టీ ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లో ఒకటి ఉంది. అయితే ఆంధ్రప్రదేశ్ ప్రజలకు చేరువలో ఉండాలనే లక్ష్యంతో కాజా వద్ద ఇళ్లుతోపాటు కార్యాలయాన్ని కూడా నిర్మించే ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఆరునెలల్లో అత్యంత వేగంగా ఇక్కడ గృహనిర్మాణాలు పూర్తి అవుతాయని జనసేన వర్గాలు చెబుతున్నాయి. ఏపీ రాజధాని అమరావతికి అతిసమీపంలో పవన్‌కల్యాణ్ గృహాన్ని నిర్మాణం జరుగుతుంది. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ - మిగతా 2 లో

రైల్వే జోనూ హుళక్కే

ఏపీకి కేంద్రం మరో షాక్!



న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం మరో షాక్ ఇచ్చింది. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛ అయిన రైల్వేజోన్ ఆశలపై నీళ్లు చల్లింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో విశాఖపట్నం కేంద్రంగా రైల్వేజోన్ ఇవ్వడం సాధ్యం కాదని కేంద్ర హోంశాఖ కార్యదర్శి రాజీవ్ గాబా తేల్చి చెప్పారు. సోమవారం తెలుగు రాష్ట్రాల అధికారులతో సమావేశమైన ఆయన ఈ విషయాన్ని స్పష్టం చేసినట్టు సమాచారం. రాష్ట్ర విభజన అంశాలు, షెడ్యూల్ 13లో పేర్కొన్న అంశాలైన ఇరు రాష్ట్రాల్లో ఏర్పాటు చేయాలనుకున్న విద్యా సంస్థలు, కేంద్ర సంస్థల ఏర్పాటు, పురోగతిపై జరిగిన సమీక్షలో భాగంగా రైల్వేజోన్ అంశం తెరపైకి వచ్చింది. దుగరాజపట్నం పోర్టు, ఐఐటీ, ఐఐఎం నిర్మాణం, విజయవాడలో జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ కార్యాలయం ఏర్పాటు, తదితర అంశాలపై రెండు గంటలపాటు జరిగిన చర్చలో ఈ అంశంపై ప్రవీణ్‌ప్రకాశ్ ప్రత్యేకంగా అడిగారు. గతంలో రైల్వేజోన్‌కు గ్రీన్ సిగ్నల్ పడినట్టు వచ్చిన సమాచారం నేపథ్యంలో రైల్వేజోన్ ఏర్పాటుకు సంబంధించి తదుపరి ఎలాంటి ఎలాంటి చర్యలు తీసుకోవాలని ఆయన అడిగిన ప్రశ్నకు సమాధానంగా జోన్ ఏర్పాటు సాధ్యం కాకపోవచ్చని, నివేదికలు వ్యతిరేకంగా ఉన్నాయని ఆయన చెప్పినట్టు తెలుస్తోంది. పెట్రోలియం కాంప్లెక్స్ ఏర్పాటు నివేదికలను వ్యయ విభాగానికి అందించి నిర్ణయం - మిగతా 2 లో

హోదాపై వెనక్కు తగ్గం..!

- ఇస్తామన్నవే అడుగుతున్నాం
- కౌన్సిల్‌లో చంద్రబాబు



విశాలాంధ్ర -అమరావతి : విభజన చట్టాన్ని అమలుచేయాల్సిన బాధ్యత బీజేపీదేనని, ప్రత్యేక హోదాను ఇచ్చి తీరాల్సిందేనని.. దాన్ని ఇచ్చే వరకూ పోరాడతామని, వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టంచేశారు. సోమవారం ఆయన శాసనమండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ ప్రసంగించారు. ప్రత్యేక హోదా ఇవ్వవద్దని 14వ ఫైనాన్స్ కమిషన్ ఎక్కడా చెప్పలేదని, విభజన హామీలు నెరవేర్చాలని, రాష్ట్ర అభివృద్ధికి చేయూతనివ్వాలంటూ సీఎం కేంద్రాన్ని డిమాండు చేశారు. రాష్ట్రానికి న్యాయం చేయకుండా ఎదురుదాడికి దిగడం సబబు కాదన్నారు. కేంద్రం సహాయం చేయాల్సింది పోయి విమర్శించడం, హాస్యాస్పదంగా మాట్లాడటం ఎంత వరకూ సబబని ప్రశ్నించారు. కేంద్రంలో పదవులు, పనులు, పైరవీలు ఆశించలేదన్నారు. కేంద్రాన్ని ఏదీ అతిగా అడగలేదని, న్యాయంగానే అడుగుతున్నామన్నారు. ఒకసారి హామీలను సమీక్ష చేసుకోవాలని, జాతీయ పార్టీలు రాష్ట్ర ప్రజల మనోభావాలతో ఆడుకోవడం మంచిది కాదని సీఎం అన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులు పూర్తిగా ఖర్చు చేస్తామని, యూసీలు, డీపీఆర్‌లు పంపించామని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడటానికి స్వంత నిర్ణయాలు తీసుకుంటామన్నారు. తెలుగువారి కోసం మంచి రాజధాని నిర్మిస్తాం..తెలుగువారి శక్తి చూపిస్తామని అన్నారు. అసెంబ్లీ సీట్లు పెంచినా, తగ్గించినా ప్రజలు తమతో ఉన్నంత వరకు ఏ ఇబ్బంది ఉండదన్నారు. ఆనాడు తాను చేసిన శ్రమ, కృషివల్ల హైదరాబాద్ ఆర్థిక నగరంగా అభివృద్ధి చెందిందని, దానికంటే మిన్నగా అమరావతిని అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటామని సీఎం పేర్కొన్నారు. భవిష్యత్తులో విద్యుత్ ఛార్జీలు - మిగతా 2 లో

ఇదీ లోకం!



త్వరలో 11వ వేతన కమిటీ

10వ పీఆర్సీ బకాయిలు విడుదలకు హామీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : త్వరలో 11వ వేతన కమిటీ నియమించడంతోపాటు, 10 పీఆర్సీ బకాయిల విడుదలకు చర్యలు తీసకుంటానని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ఉద్యోగ సంఘాల జెఏసీ రాష్ట్ర అధ్యక్షులు పి.అశోక్‌బాబు నేతృత్వంలో సంఘ నాయకులు సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని కలసి చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులలో నెలకొన్న ఆందోళలను దృష్టిలో ఉంచుకుని 10వ పిఆర్‌సికి సంబంధించిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని, 2018 జులై నుండి నూతన వేతనాలను అమలు చేయవలసి ఉన్నందున తక్షణమే నియమించాలని అశోక్‌బాబు ముఖ్యమంత్రిని కోరారు. ఉద్యోగుల పదవి విరమణ వయోపరిమితిని రెండు సంవత్సరాలకు పెంచిన మాదిరిగానే,నాలుగవ తరగతి ఉద్యోగుల పదవీ విరమణ వయోపరిమితిని - మిగతా 2 లో

జూన్‌లో సాగునీటి ఎన్నికలు

- ఒకే గొడుగు కిందకు అన్ని కమిటీలు
- ఏడాది చివరకు ఎత్తిపోతల పనులు పూర్తి
- శాసనమండలిలో మంత్రి దేవినేని ఉమా



విశాలాంధ్ర - అమరావతి : ఈ ఏడాది జూన్‌లో సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరుపుతామని అందుకు ఓటర్ల లిస్టు ప్రక్రియ, ఇతర ఏర్పాట్లు జరుగుతున్నాయని ఇరిగేషన్ శాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు చెప్పారు. సోమవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యుడు జి.తిప్పేస్వామి రాష్ట్రంలో చెరువుల కోసం ఆయకట్టు సంఘాలను ఎప్పటిలోగా ఏర్పాటు చేస్తారని, ఎన్నికల ప్రక్రియ వివరాల గురించి అడిగిన ప్రశ్నకు మంత్రి పై విధంగా సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో 6138 నీటి సంఘాలు ఉన్నాయని, 245 డిస్ట్రిబ్యూటరీ సంఘాలు, 49 ప్రాజెక్ట్ కమిటీలు పనిచేశాయన్నారు. వీటన్నింటినీ ఒకే గూటి కిందకు చేర్చి ఎన్నికలు నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. అలాగే రాష్ట్రంలో గడిచిన నాలుగు సంవత్సరాలలో మొత్తం 10 ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేశామని మరో ప్రశ్నకు సమాధానమిచ్చారు. వాటిలో పట్టిసీమ, శారద నదిపై ఆనకట్ట, కండలేరు ఎడమకాల్వ ఎత్తిపోతల పథకం, ఇతర సాగునీటి పథకాలు పూర్తయ్యాయన్నారు. మిగిలిన ప్రాజెక్టులను ఈ ఏడాది చివరినాటికి పూర్తి చేస్తామని మంత్రి వివరించారు. రాష్ట్రంలో ఉన్న వాహనాల్లో 1/3 వంతు రోడ్డు పన్నును చెల్లించలేదన్న విషయం వాస్తవమేనా, బకాయిల వసూలుకు తీసుకున్న చర్యలపై సభ్యుడు వీవీవీ చౌదరి అడిగిన ప్రశ్నకు రవాణా శాఖా మంత్రి కె.అచ్చెన్నాయుడు సమాధానమిస్తూ, 2017 నాటికి 139.23 కోట్లు త్రైమాసిక పన్ను వసూలు చేయాల్సి ఉందని, 125.99 కోట్లు వసూలు అయిందని, 13.24 కోట్లు వసూలు కావాల్సి ఉందన్నారు. పన్ను చెల్లించిన యజమానులకు నోటీసులు ఇచ్చామని - మిగతా 2 లో

ప్రపంచం

స్కాట్లాండ్‌లోనూ వామపక్ష నాయకత్వం



లండన్: బ్రిటన్ లేబర్‌పార్టీ నాయకుడిగా వామపక్ష భావాలు కలిగిన జెరిమి కార్బిన్‌ను ఎన్నుకున్న రెండున్నరేళ్ల తర్వాత స్కాట్లాండ్‌లోనూ లేబర్ నాయకుడిగా రిచర్ట్ లియోనార్డ్‌ను ఎన్నుకున్నారు. లియోనార్డ్ కూడా దాదాపు కార్బిన్‌వలే వామపక్ష విధానాలను అవలంబిస్తారు. దండిలో జరిగిన లేబర్‌పార్టీ సదస్సులో ప్రతినిధులు లియోనార్డ్‌ను తమ నాయకుడిగా ఎన్నుకున్నారు. బ్రిటన్‌లో గత సంవత్సరం జరిగిన ఎన్నికల్లో లేబర్‌పార్టీ ఊహించినదానికంటే ఎక్కువశాతం ఓట్లు, సీట్లు గెలుచుకోవడంతో ఆ పార్టీ ప్రభావం స్కాట్లాండ్‌పైన కూడా ఏర్పడింది. స్కాట్లాండ్‌లో ప్రస్తుతం లేబర్‌పార్టీకి 30శాతం ఓట్లు ఉన్నాయి. ఎస్‌ఎన్‌పి పార్టీకంటే 4శాతం తక్కువగా టోరీస్ కంటే 6శాతం ఎక్కువగా ఓట్లు ఉన్నాయి. కార్బిన్ లేబర్ పార్టీ ప్రజాస్వామ్యానికి కట్టుబడిఉంటుందని ప్రకటించడమే కాక యూరోపియన్ యూనియన్‌నుండి వైదొలిగేందుకు జరిపిన రెఫరెండంలో వచ్చిన ఫలితాన్ని అంగీకరించారు. బ్రిటన్‌లో అనుసరించిన అనేక లేబర్ పార్టీ విధానాల ప్రభావం స్కాట్లాండ్‌పై ఎక్కువగా ఉంది.

టర్కీ చర్యలపై గ్రీకు ఆగ్రహం



ఏథెన్స్: సరిహద్దు దళాలకు చెందిన ఇరువురు సైనికులను టర్కీ బందీలుగా పట్టుకోవడంపై గ్రీకు ఆగ్రహం వ్యక్తం చేసింది. రక్షణమంత్రి పనోజ్ కమ్మెనోస్ మాట్లాడుతూ , 11 రోజుల క్రితం తమ సైనికులు ఇద్దరినీ గ్రీకు అదుపులోకి తీసుకుని నిర్బంధించిందని అన్నారు. టర్కీలో అంతర్భాగమైన ఫోర్బిడెన్ మిలిటరీ జోన్‌లో సైనికులు కనిపించడంవల్ల వారిని నిర్బంధించినట్లు టర్కీ చెబుతున్నదని అది వాస్తవంకాదని పనోజ్ అన్నారు. వాతావరణం సరిగా లేకపోవడంవల్ల సరిహద్దు అవలికి వెళ్లవలసివచ్చిందని గ్రీకు సైనికులు తెలిపారు. నిర్బంధం నుంచి విడుదల చేయాలని కోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌ను న్యాయమూర్తి తిరస్కరించి మరింతలోతైన దర్యాప్తుకు ఆదేశించారు. తమ సహచరులను విడుదల చేయాలని కోరుతూ సరిహద్దుల్లోగల పట్టణాల్లో నిరసన ప్రదర్శనలు జరపాలని నిర్ణయించారు. శాంతియుత వాతావరణంలో జీవిస్తున్న తమ మధ్య సామరస్యతను భగ్నం చేయవద్దని గ్రీకు టర్కీని కోరింది.

అమెరికాలో టీచర్లకు తుపాకీ శిక్షణ



వాషింగ్టన్: విద్యాలయాల్లో, వీధుల్లోనూ పిల్లలు సైతం కాల్పులు జరిపి అమాయకులను ఒకవైపు చంపేస్తున్నప్పటికీ, తుపాకులకు లైసెన్స్ నిరాకరించడానికి బదులుగా టీచర్లకు తుపాకీ కాల్చడంలో శిక్షణ ఇస్తామని వైట్‌హౌస్ వాగ్దానం చేసింది. అంతక్రితం పిల్లలకు తుపాకులు విక్రయించేందుకు వారి వయోపరిమితిని పెంచాలని భావించారు. అయితే అధ్యక్షుడు ట్రంప్ మళ్లీ తన వైఖరిని మార్చుకున్నారు. ఆయుధాలను వినియోగించడంలో సహజమైన నైపుణ్యంఉన్నవారికి తుపాకీ పేల్చడంలో శిక్షణ ఇవ్వాలని భావిస్తున్నట్లుగా ట్రంప్ చెప్పారు. కొంతమంది స్కూలు టీచర్లకు తుపాకులు పేల్చడంలో ముమ్మరశిక్షణ ఇవ్వడం ద్వారా పిల్లలపై తుపాకితో కాల్చేవారిని నివారించేందుకు వీలు కలుగుతుందని ఇందుకు సంబంధించిన బిల్లును కూడా కాంగ్రెస్‌లో లాంఛనంగా ఆమోదిస్తామని చెప్పారు. తుపాకులు కొనుగోలు చేయడానికి గతంలోఉన్న 19ఏళ్ల వయోపరిమితిని 21ఏళ్లకు పెంచాలని ట్రంప్ భావించారు. ఫ్లోరిడా హైస్కూలులో మాజీ విద్యార్థి వచ్చి క్లాసురూములో విచ్చలవిడిగా కాల్పులుజరిపి 15మందిని చంపివేసిన తర్వాత దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఆ తర్వాతనే ట్రంప్ కాస్త మేలుకున్నట్లు తెలుస్తోంది. టీచర్లకు శిక్షణ ఇవ్వాలన్న తాజా నిర్ణయంపైకూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నేషనల్ ఎడ్యుకేషనల్ అసోసియేషన్ ఈ నిర్ణయాన్ని గట్టిగా వ్యతిరేకిస్తోంది. అంతేకాదు, తుపాకుల కొనుగోలుపై గట్టి ఆంక్షలు విధించాలని అనేకమంది విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.టీచర్లకు శిక్షణపై జాతీయ రైఫిల్ అసోసియేషన్ కూడా ట్రంప్ నిర్ణయాన్ని వ్యతిరేకించింది. స్కూలులో భద్రతపై ఫెడరల్ కమిషన్ ఏర్పాటు చేయాలని దానికి విద్యామంత్రి నాయకత్వం వహించి తుపాకుల కొనుగోలు వయోపరిమితి తదితర అంశాలను సిఫారసు చేస్తారని అధ్యక్షుడు తెలిపారు. ఈ విషయంలో కాలహరణ చేయకుండా త్వరగా ఆచరణాత్మకమైన ప్రణాళికను రూపొందించి అమలు చేస్తామని చెప్పారు. స్కూళ్లలో సామూహికంగా విద్యార్థులను చంపివేస్తున్న ఘటనలను విద్యామంత్రి సమీక్షిం చారు. ఫ్లోరిడా హైస్కూలు కాల్పుల ఘటన తనను కలచివేసిందని అందువల్లనే దీనిపై తీవ్రంగా యోచిస్తున్నామని ట్రంప్ చెప్పారు.

గ్రీసులో సమ్మెతో స్తంభించిన రవాణా



ఏథెన్స్: గ్రీసులో కార్మికుల సమ్మెతో రవాణా స్తంభించింది. ఆసుపత్రులలో రోగులకుచికిత్స జాప్యమైంది. నౌకారవాణాకూడా ఆలస్యమైంది. దేశానికి రుణాలిచ్చిన సంస్థలు డిమాండ్ చేసినట్లుగా 36ఏళ్లనాటి పారిశ్రామిక కార్యాచరణ చట్టాన్ని సవరించడం ద్వారా కార్మికుల హక్కులను ప్రభుత్వం హరించేందుకు పూనుకుందని, దాన్ని అనుమతించబోమని సమ్మెలో పాల్గొన్న కార్మికులు హెచ్చరించారు. సోమవారం జరిగిన సమ్మె సందర్భంగా ఏథెన్స్‌నగరంలో 9,000 మందికిపైగా కార్మికులు ప్రదర్శన జరిపారు. ప్రభుత్వం తలపెట్టిన చట్ట సవరణ తీర్మానాన్ని పార్లమెంటలో ప్రతిపాదించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రదర్శన ముగిసేదశలో పార్లమెంటులోపలికి ప్రవేశంచడానికి కార్మికులు ప్రయత్నించిన సందర్భంల పోలీసులు భాష్పవాయువుగోళాలు ప్రయోగించారు. నావికులు, ఆసుపత్రిలో డాక్టర్లు ఇతరసిబ్బంది ఈ సమ్మెలో పాల్గొన్నారు. అలాగే ఇతర పరిశ్రమలలో పనిచేసే కార్మికులుకూడా పాల్గొన్నారు. ఏథెన్స్‌లో మెట్రో రైళ్ల రవాణా అనేకమార్లు ఆగిపోయింది. ప్రభుత్వం తలపెట్టిన చట్ట సవరణ కార్మికులకు, పెన్షనర్లకు, నిరుద్యోగులకు మరణశాసనమేనని కార్మిక యూనియన్ జిఎస్‌ఈఈ పేర్కొంది. రాజ్యాంగం కల్పించిన హక్కులనుసైతం ఈ ప్రభుత్వం హరించేందుకు పూనుకుందని యూనియన్ విమర్శించింది. భవిష్యత్తులోనూ జరిగే సమ్మెలో మరింత కఠినంగా ఉంటాయని యూనియన్ పేర్కొంది. 2010లో గ్రీకు ఆర్థికవ్యవస్థ సంక్షోభంలో పడిననాటినుండీ దాదాపు 50సార్లు సార్వత్రిక సమ్మెలు జరిగాయి. అయినప్పటికీ ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోలేదు.

చిలీ అధ్యక్షుడిగా పినెరా

శాంటియోగా: చిలీ అధ్యక్షుడిగా సెబాస్టియన్ పినెరా ప్రమాణస్వీకారం చేసారు. ఆయన ఈ పదవికి ఎన్నికకావడం రెండోసారి. వాణిజ్యవేత్త అయిన పినెరా రాజకీయాలలోకి 2006లోనే రాజకీయాల్లో ప్రవేశించారు. వల్పరాయి సో నగరంలో కొద్దిమంది పార్లమెంటు సభ్యులు హాజరైన సమావేశంలో ఆయన పదవీ ప్రమాణ స్వీకారంచేసారు. పదవినుండి వైదొలుగుతున్న మైఖేల్ మిచెల్లీ బ్యాచ్‌లెట్ నుండి ఆయన అధికారాన్ని స్వీకరించారు. గత నవంబరులో జరిగిన ఎన్నికల్లో పినెరా గెలుపొందారు. ఆయన పదవీకాలం 2022వరకు ఉంటుంది. పన్నులుతగ్గిస్తానని, పెట్టుబడులను ఎక్కువగా ఆహ్వానిస్తానని పినెరా వాగ్దానం చేసారు. చిలీలోని సంపన్నులలో పినెరా నాలుగోవ్యక్తిగా ఉంటారని ఫోర్బ్స్ పత్రిక తెలిపింది. ఆయన ఆస్తుల విలువ దాదాపు 2.8 బిలియన్ డాలర్లు ఉండవచ్చునని అంచనా.

కొలంబియాలో డీసీపీ ముందంజ



బగోటా : కొలంబియాలో తాజాగా జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో మాజీ అధ్యక్షుడు అల్వరో ఉరిబి నాయకత్వంలోని మితవాద పార్టీ ముందంజలోఉంది. 90శాతం ఓట్లు లెక్కించేసమయానికి ఆ పార్టీకి అత్యధిక సీట్లు లభించాయి. అల్వరో నాయకత్వంలోని డెమొక్రటిక్ సెంట్రల్ పార్టీ (డీసీపీ) కి మొత్తంమీద మెజారిటీ సీట్లు తగ్గవచ్చునని పరిశీలకులు భావిస్తున్నారు. సాయుధ పోరాటంలో విరమించుకుని శాంతి ఒప్పందం కుదుర్చుకున్న విప్లవగ్రూపు ఈ ఎన్నికల్లో పోటీ చేసింది. అయితే ఆ పార్టీకి 0.4శాతం ఓట్లు మాత్రమే లభించాయి. శాంతి ఒప్పందంమేరకు పార్లమెంటు ఉభయసభల్లో 5సీట్ల చొప్పున విప్లవగ్రూపుకి కేటాయించవలసిఉంటుంది. తుది ఫలితాలు ఇంకా ప్రకటించవలసిఉంది. సాయుధగ్రూపుకే సంఘర్షణాత్మక కాలంలో దేశ ప్రజల్లో మంచి పలుకుబడిఉన్నప్పటికీ శాంతి ఒప్పందం తరువాత అది ఓట్ల రూపంలో మారలేదు. ఎన్నికల అనంతరం అధ్యక్షుడు జాన్ మాన్యూల్ శాంతోస్ మాట్లాడుతూ, శాంతి ఒప్పందం కుదుర్చుకున్నప్పుడు తన మీద తీవ్ర విమర్శలు వచ్చాయనీ అయితే ఈ సారి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయనీ తాము తీసుకున్న నిర్ణయం సరైనదేనని అన్నారు. డీసీపీకి సెనేట్‌లో 19సీట్లు, దిగువసభలో 33సీట్లు ఇంతవరకు లభించాయి. అయితే ఏ పార్టీకి 16శాతానికి మించి ఓట్లు పోలుకాలేదు. మూడుమితవాద పార్టీలకు కలిపి సెనేట్‌ల 102 సీట్లు ఉండగా, 50సీట్లు గెలుచుకున్నాయి. ఈ పార్టీలన్నింటిలో డీసీపీ ఎక్కువస్థానాలు పొందింది.

న్యూయార్క్‌లో కూలిన హెలికాప్టర్

న్యూయార్క్: న్యూయార్క్ తూర్పు నదిలో హెలికాప్టర్ కూలిపోయి 5గురు మరణించారు. హెలికాప్టర్ కిందకూ, పైకి తిరుగుతూనీళ్లలో కూలిపోయింది. ఈ దృశ్యాన్ని వీడియోగా చిత్రించి ట్విట్టర్‌లో పోస్టు చేసారు. న్యూయార్క్ మేయర్ నివాస గృహానికి కొద్దిదూరంలోనే ఈ హెలికాప్టర్ కూలిపోయింది. కూలిపోయిన ప్రాంతం రూజ్‌వెల్ట్ దీవిగా అన్నారు. పైలెట్ మాత్రం నీళ్లలో దూకడంతో అయనను రక్షించినట్లు అధికారులు తెలిపారు. కోస్టుగార్డు సిబ్బంది బోట్ల ద్వారా వెళ్లి హెలికాప్టర్‌లోఉన్నవారిని రక్షించేందుకు ప్రయత్నించారు. అధికారులు, పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకొనేప్పటికే హెలికాప్టర్ నీళ్లలో మునిగిపోయిందని కూలిపోవడాన్ని గమనించినవారు చెప్పారు.

అణుచర్చలలో చైనా పాత్ర ప్రశంసనీయం

సియోల్: ఉత్తరకొరియా అణురహిత దేశంగా మార్చుచెందే దిశగా ఆ దేశంతో చర్చలు జరపడంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పాత్ర పశంసనీయమైందని దక్షిణకొరియా జాతీయ భద్రతా డైరెక్టర్ ఛుంగ్ ఈ యాంగ్ తెలిపారు. జిన్‌పింగ్ కృషి వలన అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉత్తర కొరియా నేత కిమ్‌జాంగ్ ఉన్ మధ్య చర్చలు జరిగే అవకాశాలు ఏర్పడ్డాయని ఆయన అన్నారు. ఇటీవల ఛుంగ్ నాయకత్వంలో ఉత్తరకొరియాను సందర్శించి కిమ్, ఇతర ఉన్నత స్థాయి నాయకులతో చర్చలు జరిపి తిరిగి స్వదేశానికి చేరుకున్నారు. అక్కడ జరిగిన చర్చల వివరాలను దక్షిణ కొరియా విదేశాంగ వ్యవహార సలహాదారు యాంగ్‌కు వివరించారు. కొరియా ద్వీపకల్పంలో శాంతిని నెలకొల్పే లక్ష్య సాధనకు తమఅధ్యక్షుడు మూన్ జాయ్‌ఇన్ అనేక చొరవలు తీసుకున్నారని ఛుంగ్ తెలిపారు. చర్చల ద్వారా మాత్రమే సమస్య పరిష్కారం చేసుకోవాలని తొలినుంచి జిన్‌పింగ్ గట్టిగా చెబుతూ వస్తున్నారు. కొరియా ద్వీపకల్పంలో శాంతి నెలకొలదన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేసారు. ఉత్తరకొరియా ముమ్ముందు అణు లేదా క్షిపణి పరీక్షలను నిర్వహించకుండా సంయమనం పాటించగలదన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేసారు.

దక్షిణకొరియా భద్రతా డైరెక్టర్ ఛుంగ్ ప్రకటన

50 మంది మృతి

(మొదటిపేజీ తరువాయి)

చెందిన విమానం ఖాట్మండులోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయంలోనే కుప్పకూలిపోయింది. విమానం ల్యాండ్ అవుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు విమానాశ్రయం జనరల్ మేనేజర్ రాజ్‌కుమార్ చెట్టిరి చెప్పారు. విమానం ల్యాండ్ అవుతున్న సమయంలో విమానాశ్రయ ఫెన్సింగ్‌ని ఢీకొన్నదని తెలిపారు. సాంకేతిక కారణాల వల్లే విమానం కూలిపోయి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం నేపథ్యంలో ఎయిర్‌పోర్టులో విమానాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. విమానాశ్రయాన్ని మూసేశారు.

'ఢాకా నుంచి బయలుదేరిన ఆ విమానం స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2.20గంటలకు ల్యాండ్ అవ్వాల్సి ఉంది. విమానం రన్‌వేపై దిగుతున్న సమయంలో ఒక్కసారిగా కూలిపోయి పక్కనే ఉన్న ఫుట్‌బాల్ మైదానంలో పడిపోయింది. ప్రమాదం కారణంగా విమానంలో మంటలు చెలరేగి.. దట్టమైన పొగలు అలముకున్నాయి. ప్రమాదంలో విమానం పూర్తిగా దగ్ధమైంది. నేపాల్ ఆర్మీ సిబ్బంది ఎయిర్‌పోర్టుకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. విమానంలో 67 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది ఉన్నారు" అని చెట్టిరి తెలిపారు.

"ఇప్పటి వరకు మేము 50 మృతదేహాలను స్వాధీనం చేసుకున్నాం" అని సైనిక ప్రతినిధి గోకుల్ భండారి తెలిపారు. బాంబురైడర్ క్యూ400 సీరీస్ విమాన పేలుడు శకలాల నుంచి కొంత మందిని రక్షించామని చెప్పారు. అయితే, ఇంకా తొమ్మిది మంది జాడ తెలియాల్సి వుందన్నారు. త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగుతుండగా విమానం పేలి మంటలు లేచాయి. విమాన శకలాలు సమీపంలోని పొలాల్లో పడిపోయాయి. మంటలు చెలరేగి ఆ ప్రాంతమంతా దట్టమైన పొగలు అలుముకున్నాయని చెప్పారు. ప్రమాదానికి గురైన విమానం 24 సంవత్సరాలదిగా ఫ్లైట్‌రైడర్24.కామ్ వెబ్‌సైట్ తెలిపింది. నేపాల్‌లో ఇటీవల కాలంలో విమాన ప్రమాదాలు ఎక్కువగా నమోదయ్యాయి.

రైల్వే జోనూ హుళక్కే

(మొదటిపేజీ తరువాయి)

తీసుకోవాలని పెట్రోలియం శాఖను ఆదేశించారు. దుగరాజపట్నం పోర్టుకు ప్రత్యామ్నాయం కూడా పోర్టుల విభాగమే చూపాలని కేంద్ర హోంశాఖ సూచించింది. ఐఐటీ, ఐఐఎంల నిర్మాణ కార్యకలాపాలు వెంటనే ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థల నిర్మాణ వ్యవహారాన్ని ఎన్‌బీసీసీకి అప్పగించాలని ఆదేశించింది. గిరిజన, కేంద్రీయ వర్సిటీల బిల్లులను ఈ సమావేశాల్లోనే ఆమోదించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించింది. విజయవాడ, గుంటూరులో డ్రైనేజీ పనులకు ఇచ్చిన రూ.1000 కోట్లను రాజధాని నిధులతో కలపవద్దంది. అలాగే రాజధానికి విడుదల చేసిన నిధులు రూ.1500కోట్లేనని, మరో రూ.వెయ్యి కోట్లు విడుదల చేసే అంశాన్ని పరిశీలించాలని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖను ఆదేశించింది. రూ.1500 కోట్లకే ఏపీ ప్రభుత్వం ఖర్చుల వివరాలు అందించిందని హోంశాఖ కార్యదర్శి రాజీవ్ గాబా తెలిపారు.

రాష్ట్రానికి ఇవ్వాల్సినవన్నీ ఇస్తామని బీజేపీ నేతలు కూడా చెప్పుకొచ్చిన నేపథ్యంలో ఈ ప్రకటన సంచలనంగా మారింది. విభజన చట్టంలో ఉన్న అన్ని అంశాలనూ నెరవేర్చి తీరుతామని స్పష్టం చేస్తూ వస్తోన్న కేంద్ర ప్రభుత్వం రైల్వేజోన్‌కు లైన్ క్లియర్ అయిందని, ఒడిశాతోనూ చర్చలు జరిపామని, తప్పకుండా రైల్వేజోన్ ఇస్తామని ఇటీవల ప్రకటన చేసిన సంగతి తెలిసిందే.

రాజీలేని పోరాటం చేస్తాం: అవంతి

దీనిపై ఎంపీ అవంతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. "నాకింకా సమాచారం లేదు. ఒకవేళ ఆ ప్రకటనే నిజమైతే.. అది దుర్మార్గమైన చర్య. రైల్వేజోన్ ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛ. గతంలో ఎంతోమంది నేతలు రైల్వేజోన్ వస్తుందని చెప్పారు. బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో కూడా పెట్టింది. కానీ, ఇప్పుడు ఈ రకంగా చేయడం దుర్మార్గమైన చర్య. రైల్వేజోన్ వచ్చే వరకూ మా ఎంపీలమంతా రాజీలేని పోరాటం చేస్తాం. ఎలాంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉన్నాం. విశాఖ కేంద్రంగా గుంతకల్లు, గుంటూరు, విజయవాడ కలిపి రైల్వేజోన్ ఇవ్వాల్సిందే. రైల్వేజోన్ ఇవ్వడానికి వచ్చిన నష్టమేమిటి? ఇది కూడా ఇవ్వకపోతే ప్రజలు హర్షించరు. ఇచ్చే వరకు మేమంతా వదిలిపెట్టే సమస్యేలేదు. రైల్వేజోన్ ఇస్తామని హరిబాబు చెప్పారు. రైల్వేజోన్ ఇవ్వాలా? లేదా అనేది రాజకీయ నిర్ణయం. ప్రధాని తప్పకుండా ఇస్తారని నేను భావిస్తున్నా" అని అన్నారు.

తప్పిన మరో ప్రమాదం

అహ్మదాబాద్ : ఇంజన్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం అహ్మదాబాద్‌లో అత్యవసర ల్యాండింగ్ అయ్యింది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు లక్నో వెళుతున్న ఇండిగో నియోన్ విమానం ఇంజన్‌లో సాంకేతిక లోపం ఏర్పడింది. మార్గ మధ్యలో ఉండగా సమస్య ఏర్పడటంతో అత్యవసర పరిస్థితి ప్రకటించారు. దీంతో అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టులో సురక్షితంగా ల్యాండ్ అయ్యింది. ఆ సమయంలో విమానంలో 186మంది ప్రయాణికులున్నారు. ఉదయం 9.21 గంటలకు బయలుదేరిన విమానం గంట తరువాత అంటే.. 10.04 నిమిషాలకు అత్యవసరంగా అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ అయ్యింది. ఎయిర్‌పోర్టులో అత్యవసర పరిస్థితి ప్రకటించే సరికి. విమానాశ్రయానికి రావాల్సిన ఐదు విమానాలు ఆలస్యంగా నడిచాయి.

కమ్మేసింది



(మొదటిపేజీ తరువాయి)

ఈ బృందం కేరళ నుంచి అడవిలోకి చేరుకొని అక్కడి నుంచి కొండలపైకి ఎక్కి ఆదివారం ఉదయానికి తమిళనాడు సరిహద్దుకు చేరుకున్నారు. సాయంత్రానికి బోడి చేరుకోవాలని మళ్లీ వెనక్కు ప్రయాణిస్తూ చెన్నై నుంచి థేనికు ప్రయాణిస్తుండగా మధ్యాహ్న ప్రాంతానికి వారంతా మంటల్లో చిక్కుకు పోయారు. ట్రెక్కర్లంతా చెన్నై, తిరుపతి, ఇరోడ్‌లకు చెందిన వారు. సహాయక చర్యల్లో ఎయిర్ ఫోర్సు కూడా పాల్గొంది. అటవీ ప్రాంతంలో టవర్లు లేనందువల్ల సమాచారం చేరవేయడం సమస్యగా మారింది. ఆ ప్రాంతంలోని గిరిజనులు అధికారులతోపాటు సహాయక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. స్థానికులు అగ్నికీలకాలను మొబైల్ ఫోన్లలో వీడియోలు తీసారు. మంటల్లో చిక్కుకొన్న వారు చాలా మటుకు మహిళలే. వారి వస్త్రాలతోపాటు చర్మం కాలిపోయి రోధన పెడుతూ మంచినీటికోసం ఆక్రందనలు చేస్తున్న దృశ్యాలను వారు చిత్రీకరించి పంపారు. గతకొద్దిరోజులుగా ఈ అడవిలో మంటలు చెలరేగుతుండగా వారిని లోపలికి పంపడం అటవీశాఖ నిర్లక్ష్యంగా సహాయక చర్యల్లో పాల్గొన్న అధికారులు చెబుతున్నారు. చెలరేగిన మంటలతో వేడిగా ఉండటం, దట్టంగా కమ్ముకున్న పొగతో చూపు కానరాక సహాయక కార్యక్రమాలు నిర్వహించడానికి ఆటంకం ఏర్పడుతోందన్నారు. రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ యుద్ధ విమానాలను పంపడం, ముఖ్యమంత్రి పళనీస్వామి సత్వర చర్యలు చేపట్టడంతో 15 మందిని కాపాడగలిగామని అధికారులు వెల్లడించారు. గాయపడిన వారికి చికిత్స అందించేందుకు బోడినయ్యకనూర్ ఆసుపత్రికి ప్రత్యేక వైద్య బృందాలను పంపామని వైద్యారోగ్య శాఖ మంత్రి సి. విజయభాస్కర్ అధికారిక ట్విటర్‌లో వివరించారు. విషయాన్ని ట్విటర్ ద్వారా తెలుసుకున్న రక్షణమంత్రి ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి హెలికాప్టర్లను రంగంలోకి దింపారన్నారు. పర్వతారోహకుల నుంచి రాష్ట్ర అగ్నిమాపకదళం ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు సమాచారాన్ని తెలుసుకుని అత్యవసర సహాయాన్ని అందించింది. ప్రమాదం సంభవించిన ప్రాంతాల్లో మొబైల్ నెట్ వర్క్ సరిగా లేదని, దీంతో అధికారులకు, మీడియాకు వెల్లడించడం కష్టమైందని జిల్లా సీనియర్ అటవీ అధికారి ఒకరు తెలిపారు. పర్వతం కింద వైద్యసిబ్బంది సిద్ధంగా ఉన్నారని, వారికి ప్రథమ చికిత్స అందించి వారిని ఆసుపత్రికి తరలిస్తున్నామన్నారు. థేని కలెక్టర్ మారియం పల్లవి బాల్దేవ్ క్షతగాత్రులను ఆసుపత్రిలో సందర్శించి సహాయం కొనసాగిస్తామని భరోసా ఇచ్చారు. డీఎస్పీ వి. భాస్కరన్, రెవెన్యూ, అటవీ అధికారులు సహాయ కార్యక్రమాలను అందిస్తున్నారు. ఎయిర్‌ఫోర్స్‌తో సహా సహా మిగతా శాఖల సహకారంతో సహాయక చర్యలను వేగవంతం చేయాలని రక్షణ శాఖ వెల్లడించిందని అధికారులు తెలిపారు. పశ్చిమకనుల్లోని థేని, పళని పర్వతాల్లో ఎండాకాలం అటవీ అధికారులు ట్రెక్కింగ్‌కు అనుమతించరాదని అధికార వర్గాలు వెల్లడించాయి.

సొంతింటికి శంకుస్థాపన

(మొదటిపేజీ తరువాయి)

విలేకర్లతో మాట్లాడుతూ, ఈనెల 14న నాగార్జున విశ్వవిద్యా లయం సమీపంలో జరుగుతున్న పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో జనసేన పార్టీ భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. జనసేనపార్టీలో సీనియర్ కార్యకర్తలకు మంచి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఒక క్రమ శిక్షణ గల పార్టీగా జనసేన రాష్ట్రంలో నిలుస్తుందన్నారు. ప్రజాసమ స్యలను పరిష్కరించేందుకు జనసేన నిత్యం పోరాటాలు చేస్తుందన్నారు. తన తండ్రి మంగళగిరిలో కానిస్టేబుల్‌గా పనిచేశారని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. అలాంటి ప్రాంతంలో కొత్త ఇంటిని నిర్మించు కోవడం సంతోషంగా ఉందన్నారు. అభిమానులు ముందుకు వచ్చి మంచిస్థలం చూపించారని ఇక్కడ ఇంటితోపాటు పార్టీ కార్యాలయాన్ని కూడా నిర్మించే ఆలోచన ఉన్నట్లు తెలిపారు. ఏపీ ప్రజలకు మరింత చేరువ అయ్యే లక్ష్యంతో ఇక్కడ గృహాన్ని నిర్మిస్తున్నామన్నారు. సమస్యల నుంచి తానెప్పుడూ దూరంగా పారిపోయేవాడిని కాదన్నారు. జనసేన పార్టీ ఒక లక్ష్యంతో ఏర్పాటు అయ్యిందన్నారు. తనకు ఇతర పార్టీలతో ఎలాంటి విభేదాలు లేవన్నారు. ప్రజాసమస్యలను పరిష్కరించే లక్ష్యంతోనే తన పార్టీ పనిచేస్తుందన్నారు. అనంతరం పవన్‌కల్యాణ్ దంపతులు విజయవాడ చేరుకున్నారు. కార్యక్రమంలో జనసేనపార్టీ నాయకులు చింతల పార్థసారథి, కేకే, మారిశెట్టి రాఘవయ్య, బేతంచర్ల శ్రీనివాసనాయుడు, ఏవీ రావు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుల చేతిలో

ఇంటర్ విద్యార్థి దారుణ హత్య



విశాలాంధ్ర బ్యూరో- **హైదరాబాద్ :** నిర్ణీత కాలవ్యవధిలో పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఆత్రుతతో వెళుతుండగా నలుగురు యువకులు మృత్యు రూపంలో వచ్చి దారుణంగా హతమార్చారు. కొద్దిసేపట్లో పరీక్షా కేంద్రానికి వెళ్లి పరీక్ష రాయాల్సిన విద్యార్థి క్షణాల్లోనే అసువులు బాసాడు. కొన్ని నిమిషాల క్రితం తమ కళ్లముందు కదలాడిన తనయుడు దారుణ హత్యకు గురికావడంతో ఆ కుటుంబంలో వేదన, రోధన ఇంతా...అంతా కాదు.స్నేహితుడని కూడా చూడకుండా వేట కొడవళ్లతో వెంటపడి మరీ నరికారు. కూకట్‌పల్లిలో జరిగిన ఘటన స్థానికంగా కలకలంరేపింది. కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మూసాపేట జనతానగర్లో నివసించే రాజు పాల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అతడికి నలుగురు సంతానం. వారిలో చిన్నవాడైన సుధీర్ కూకట్‌పల్లిలోని ప్రగతి జూనియర్ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇంటర్ పరీక్షలు జరుగుతున్నందున సోమవారం ఉదయం పరీక్ష రాసేందుకు తన స్నేహితులతో కలిసి బైక్‌పై బయల్దేరాడు. కూకట్‌పల్లి హోండా షోరూం దగ్గరకు చేరుకోగానే, అప్పటికే కాపుకాసిన దుండగులు సుధీర్‌ను అడ్డగించి వేటకొడవళ్ళతో దాడి చేశారు. సుధీర్ ప్రాణభయంతో వారి నుంచి తప్పించుకుని పారిపోతుండగా వెంటాడి మరీ దారుణంగా నరికి చంపేశారు. దుండగుల్ని పట్టుకునేందుకు ప్రయత్నించిన సుధీర్ స్నేహితులు మేఘనాథ్, సాయిలపై కూడా దాడి చేసేందుకు ప్రయత్నించారు. వీరిని గమనించిన ట్రాఫిక్ హోంగార్డ్ పరమేష్ దుండగులను పట్టుకోవడానికి ప్రయత్నించారు. వారిలో ఒకరు దొరికిపోగా, ముగ్గురు పరారయ్యారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించటంతో వారు హుటాహుటిన అక్కడికి చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

వెనక్కు తగ్గం..!

(మొదటిపేజీ తరువాయి)

పెంచమని, తగ్గిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పుకొచ్చారు. ఉగాది నుండి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు పెళ్లి కానుకను అందించనున్నట్లు చెప్పారు. ఎన్నికలలోగా రూ.50 వేల కోట్లతో 19 లక్షల మంది పేదలకు ఇళ్ల నిర్మాణం పూర్తిచేస్తామని, ఇంటి స్థలం లేని ప్రతి కుటుంబానికి ఇంటి స్థలం ఇస్తామని చెప్పారు. ఇప్పటివరకు చేపట్టిన ఇరిగేషన్ ప్రాజెక్టులన్నీ ఈ ఏడాది మే, జూన్ నాటికి పూర్తి చేస్తామని, ప్రాజెక్టుల నిర్మాణానికి 38,391 కోట్లు అవసరం కాగా ఇప్పటివరకు 13,332 కోట్లు ఖర్చుచేసినట్లు వెల్లడించారు. అమరావతి రీజియన్‌లో 14 మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసి మెడికల్ హబ్‌గా చేస్తామన్నారు. జూన్ నెలలో 200 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. రోజుకు లక్ష మందికి ఈ క్యాంటీన్ల ద్వారా కేవలం రూ.5లకే అల్పాహారం, లంచ్, డిన్నర్ అందిస్తామని చంద్రబాబు చెప్పారు. ఎన్టీఆర్. భరోసా కింద 50 లక్షల మందికి పెన్షన్ ఇస్తున్నట్టు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కి జాతీయ విద్యాసంస్థలు ఎందుకు ఇవ్వరు..ఏపీ ఈ దేశంలో భాగంకాదా ఎక్కువ భాగం ఉత్తర భారత దేశానికి ఎందుకు ఇస్తున్నారని చంద్రబాబు ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో తమ పార్టీ వెనక్కు తగ్గదని చంద్రబాబు చెప్పారు.

సాగునీటి ఎన్నికలు

(మొదటిపేజీ తరువాయి)

వివరిస్తూ 2016-17లో 38405, 2017-18లో 39,530 కేసులు నమోదు చేశామని, దానికి గాను 35 కోట్ల పన్ను, అపరాధ రుసుంతో సహా వసూలు చేసినట్లు మంత్రి వివరించారు. ఏపీఎస్‌ఆర్టీసీలో ఏర్పాటు చేసిన లాజిస్టిక్ ద్వారా ఈ ఏడాది నుండి సరుకులు డోర్ డెలివరీ చేసే ఏర్పాటు చేయనున్నట్లు గాదె శ్రీనివాసులు నాయుడు అడిగిన ప్రశ్నకు రవాణాశాఖ మంత్రి అచ్చెన్నాయుడు సమాధానం చెప్పారు. రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలకు చెందిన 555 మదర్సాలు ఉన్నాయని, వాటిలో 56,635 మంది విద్యార్థులు ఉన్నారని, వీటిలో 255మదర్సాలలో మతానికి చెందిన విద్యాబోధనతో పాటు ఆంగ్లం, గణితశాస్త్రం, పర్యావరణ శాస్త్రాలను బోధించేందుకు 631 మంది విద్యా వాలంటీర్లను నియమించినట్లు విద్యాశాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు చెప్పారు. సభ్యులు బొడ్డు నాగేశ్వరరావు, వితపు బాలసుబ్రహ్మణ్యం, రాము సూర్యారావు అడిగిన ప్రశ్నకు మంత్రి గంటా పై విధంగా సమాధానమిచ్చారు. రాష్ట్రంలో మరిన్ని మదర్సాలు పెంచాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి కోరారు. మదర్సాలలో రెగ్యులర్ ప్రాతిపదికన అధ్యాపకులను నియమించాలన్నారు. అలాగే చంద్రన్న బీమా పథకం ద్వారా మరణించిన కార్మికుల కుటుంబాలను ఆదుకుంటున్నామని కార్మికశాఖ మంత్రి పితాని సత్యనారాయణ సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. ఈ పథకాన్ని విద్యార్థులకు కూడా వర్తింపజేయాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి కోరారు.

11వ వేతన కమిటీ

(మొదటిపేజీ తరువాయి)

పెంచాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎస్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని ఉద్యోగులు చేస్తున్న ఆందోళలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఒక నిర్ణయాన్ని తీసుకుని కేంద్ర ప్రభుత్వానికి తెలియజేసి దానిని రద్దు చేసేలా కృషి చేయాలని కోరారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా 10వ పీఆర్సీకి సంబంధించిన బకాయిల విడుదలలో జాప్యం జరిగిందని, ఈ విషయంపై కేంద్ర మంత్రుల బృందం ఉన్నతాధికారులతో చర్చించి నివేదికను సమర్పించిన వెంటనే బకాయిలను విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిని కలసిన వారిలో అశోక్‌బాబుతో పాటు జేఏసీ సెక్రటరీ జనరల్ జోసఫ్ సుధీర్, బాబూరెడ్డి, బాజ్జీ, రఘురామరెడ్డి, హృదయరాజు, కృష్ణయ్య, ఎన్జీవో అసోసియేషన్ నాయకులు చంద్రశేఖరరెడ్డి, వీరేంద్రబాబు, ఎ.విద్యాసాగర్ తదితరులు ఉన్నారు.

ఇంటర్ పరీక్షలకు 14,886 మంది గైర్హాజరు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలకు 14,886 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.పది మంది విద్యార్థులపై మాల్‌ప్రాక్టీస్ కేసులను నమోదు చేశారు. ఫిజిక్స్-2, ఎకనామిక్స్-2, క్లాసికల్ లాంగ్వేజీ పేపర్-2 పరీక్షలకు మొత్తంగా 1423 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించారు. 4,75,619 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, వారిలో 4,60,733 మంది పరీక్ష రాశారు. ఫిబ్రవరి 28న ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు ఈ నెల 19వ తేదీతో ముగియనున్నాయి.

లాయర్ అయినందునే టికెట్

విశాలాంధ్ర అమరావతి : టీడీపీకి సంబంధించి అన్ని కేసులను విచారిస్తున్నందువల్లే కనకమేడల రవీంద్రకుమార్‌కు రాజ్యసభ అభ్యర్థిగా ఖరారు చేశామని చంద్రబాబు తెలిపారు. పార్లమెంట్‌లో అన్ని పార్టీలకూ అడ్వకేట్లు ఎంపీలుగా ఉన్నా, టీడీపీకి మాత్రమే ఇంతవరకు లేరని కనకమేడల అభ్యర్థిత్వంతో ఆలోటును తీర్చాలనుకుంటున్నా మని టీడీపీ రాజ్యసభ అభ్యర్థుల పేర్లపై ఆ పార్టీ చీఫ్ చంద్రబాబు వివరణ ఇచ్చారు. పలువురు ఆశావాహులతో వరుస భేటీలు నిర్వహించి, చివరి క్షణంలో కనకమేడల రవీంద్ర కుమార్, సీఎం రమేశ్‌ల పేర్లనే ఎందుకు ఖరారు చేశారో వివరించారు. సోమవారం అసెంబ్లీలో సీఎం మీడియాతో చిట్‌చాట్ చేశారు. గడిచిన 20 ఏళ్లుగా ఆయన పార్టీలో కొనసాగుతున్నారు. ఆయన చేసిన సేవలను దృష్టిలో ఉంచుకుని ఇప్పుడు టికెట్ ఇచ్చామని గతంలో ఎమ్మెల్సీ ఇద్దామని ప్రయత్నించినా అనివార్యకారణాలతో సాధ్యపడలేదని అని చంద్రబాబు వెల్లడించారు.



9 ఓల్వో బస్సులు ప్రారంభం


విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్‌ఆర్టీసీ) కొనుగోలు చేసిన 9 ఓల్వో బస్సులను రవాణాశాఖమంత్రి కె అచ్చెన్నాయుడు సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. పండిట్‌నెహ్రూ బస్టేషన్ ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రయాణీకులకు అత్యాధుని సదుపాయాలతో కూడిన సేవలను అందించేందుకు 'అమరావతి' పేరుతో నడుపుతున్న ఏసీ బస్సులకు మంచి ఆదరణ లభిస్తోందన్నారు. మరిన్ని మార్గాల్లో వీటిని నడిపేందుకు సంస్థ 9 బస్సులను కొనుగోలు చేసిందన్నారు. ఒక్కో బస్సును రూ. 1.25 కోట్లను వెచ్చించి కొనుగోలు చేసినట్లు తెలిపారు. వీటిలో 7 బస్సులను కృష్ణా రీజియన్‌కు, 2 బస్సులను విశాఖ రీజియన్‌కు కేటాయించినట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్టీసీ సేవలను విస్తరించే చర్యల్లో భాగంగా సంస్థ కొత్త పల్లెవెలుగు బస్సులను సమకూర్చుకునేందుకు ప్రభుత్వం బడ్జెట్‌లో రూ. 200 కోట్లను కేటాయించిందన్నారు. ఆర్టీసీ యాజమాన్యంతో మాట్లాడి త్వరలోనే వీటిని కొనుగోలు చేసి ఆయా మార్గాల్లో నడుపుతామని తెలిపారు. సంస్థకు రాయితీ బకాయిలు రూ. 290 కోట్లను కూడా ప్రభుత్వం విడుదల చేయడం జరిగిందన్నారు. సంస్థలో అంతర్గతంగా ఉన్న సమస్యలను పరిష్కరించుకుంటూ గత 7,6 నెలలుగా చేపట్టిన వివిధ సంస్కరణలు, పొదుపు చర్యల ద్వారా రూ. 350 కోట్ల నష్టాన్ని తగ్గించినట్లు పేర్కొన్నారు. అలాగే 67 శాతం నుంచి 70 శాతం వరకూ ఆక్యుపెన్సీ రేటును పెంచుకోగలిగామన్నారు. కార్మికుల కోసం నూతన వేతన సవరణ సంఘాన్ని నియమించినట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జలవనరులశాఖమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, డీజీపీ, ఆర్టీసీ ఎండీ-వైస్ చైర్మన్ మాలకొండయ్య, విజయవాడ మేయర్ కోనేరు శ్రీధర్‌తోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

చట్టసవరణ చేస్తేనే ఎస్జీటీలకు ఓటు : కత్తి నర్సింహారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రస్తుతం అమలులో వున్న ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950లోని సెక్షన్ 27(3)(బి)కి సవరణ చేస్తేనే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీ(సెకండరీ గ్రేడ్ టీచర్లు)లకు ఓటు హక్కు అవకాశముం టుందని రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ వివరణ ఉత్తర్వులు విడుదల చేశారని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.రాష్ట్రంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో లక్షా ఐదువేల మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు పనిచేస్తున్నారని వివరించారు. అదే కేడర్‌లో గల టీచర్లు ఉన్నత పాఠశాల్లో పనిచేస్తున్న వారికి ఓటు హక్కు కల్పించారని పేర్కొన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పని చేస్తున్న వారిని విస్మరించడం అశాస్త్రీయమని ఇటీవల తాము రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని హైదరాబాద్‌లో కలిసి విజ్ఞప్తి చేశామని తెలిపారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబరు-537, 644, 14లకు అనుగుణంగా పొందుప రిచిన విద్యా సంస్థలలోని ఉపాధ్యాయులకు మాత్ర మే నిబంధనలకు లోబడి ఓటు కల్పించామని లేఖ నంబరు-1031 ద్వారా స్పష్టం చేశామని పేర్కొన్నారు. చట్ట సవరణ చేసి ఆ టీచర్లకు ఓటు హక్కు కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఇ-పాస్‌తో అక్రమాలకు చెల్లు

- వాస్తవ లబ్ధిదారులకు మేలు
- టెక్నాలజీతో పేదరిక నిర్మూలన
- ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో చంద్రబాబు



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఇ-పాస్ యంత్రాలతో పౌరసరఫరాలు సహా పెన్షన్ల పంపిణీలో అక్రమాలకు చరమగీతం పడినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. కొన్ని చోట్ల బయోమెట్రిక్‌లో వేలిముద్రలు పడకపోవడం, ఐరిస్‌లో సమస్యలు వస్తుండడంతో ఫేస్ రికగ్నైజేషన్ (ముఖ చిత్రం గుర్తింపు) సాంకేతికతను వినియోగించనున్నట్లు ఆయన వివరించారు. శాసనసభలో సోమవారం ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో భాగంగా అత్యంత ప్రజా ప్రాముఖ్యం కలిగిన విషయంగా ' ఇ-పాస్ యంత్రాల కారణంగా వస్తున్న సమస్యలు, ధరల పర్యవేక్షణ వినియోగదారుల వ్యవహారాలు' తదితర అంశాలతో కూడిన స్వల్పవ్యవధి ప్రశ్నను తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణకుమార్ సభాపతి ద్వారా సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై చంద్రబాబు మాట్లాడుతూ ఇ-పాస్ యంత్రాలను ఏర్పాటు చేసిన తర్వాత చాలా చోట్ల వేలిముద్రలు పడడంలేదన్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందన్నారు. మరింత అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఈ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. చౌకధరల దుకాణాల ద్వారా బియ్యంతోపాటు చక్కెర, గోధుమపిండి, నూనె తదితర నిత్యావసర సరుకులను అందచేస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా చంద్రన్న విలేజ్ మాల్స్‌ను అంచెలంచెలుగా ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఇదే యంత్రాల సాయంతో వృద్ధులు, వితంతువులు.. వంటి పెన్షన్లను కూడా అందచేస్తున్నామని, ఒకటి అరా తప్ప ఎక్కడా ఇబ్బందులు లేవన్నారు. పేదరిక నిర్మూలనకు టెక్నాలజీ ఎంతగానో దోహదంచేస్తోందన్నారు. బయోమెట్రిక్ మిషన్ల వినియోగంపై డీలర్లకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. దేశవ్యాప్తంగా 50 లక్షల పెన్షన్లను ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ మాత్రమేనని చంద్రబాబు స్పష్టం చేశారు.

4జీ నెట్‌వర్క్ ఉన్నా సమస్యలే...

పౌరసరఫరాల దుకాణాల్లో ఇ-పాస్ మిషన్లు 4 జీ నెట్‌వర్క్ ఉన్నప్పటికీ పనిచేయకపోవడం లేదని రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. చాలా దుకాణాల్లో బియ్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో ఆ బస్తాలను రీసైక్లింగ్‌కు పంపుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయని, దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణకుమార్, బీజేపీ పక్షనేత విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ బయోమెట్రిక్ మిషన్లలో వేలిముద్రలు పడడం లేదనే సమస్యలు అనేక ప్రాంతాల్లో తలెత్తుతున్నాయని వివరించారు. ఈ విషయంలో వృద్ధులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకొని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. పౌరసరఫరాల శాఖమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ ఇ-పాస్ యంత్రాలను ఏర్పాటు చేయడం వల్ల ప్రభుత్వానికి రూ. 1500 కోట్ల వరకూ ఆదా అవుతోందన్నారు. నిత్యావసర వస్తువులు నేరుగా కార్డుదారునికే చేరుతున్నాయని తెలిపారు. బయోమెట్రిక్, ఐరిస్ విఫలమైన సందర్భాల్లో వినియోగించుకునే విధంగా ఫోటో గుర్తింపు కార్డులను అందచేయాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోందని మంత్రి పేర్కొన్నారు.



ప్రత్యేక హోదా తెచ్చే సత్తా జగన్‌కే సాధ్యం

వైసీపీ ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీకి ప్రత్యేక హోదా తెచ్చే సత్తా ఒక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని వైసీపీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. విజయవాడ వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో టీడీపీ పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. ఎమ్మెల్యే బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ, టీడీపీ అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న జగన్‌కు అందరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొలుసు పార్థసారథి, మాజీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాస్, జోగి రమేష్, విజయవాడ పార్లమెంటరీ అధ్యక్షులు సామినేని ఉదయభాను, పార్టీ నాయకులు పైలా సోమినాయుడు తదితరులు పాల్గొన్నారు.

5కోట్ల మంది రాజకీయాలకు అతీతంగా ఐక్యమవ్వాలి..

25రోజులపాటు పోరాడుదాం - ఎన్.రఘువీరారెడ్డి



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హక్కుల హామీల అమలు సాధన కోసం 5కోట్ల మంది ప్రజలంతా పార్టీలకతీతంగా ఐక్యంగా ఉద్యమించాలని పీసీసీ చీఫ్ డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి పిలుపునిచ్చారు. విజయవాడ పీసీసీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ బద్ధంగా మనకు సంక్రమించిన హక్కుల్ని కాపాడుకోవాల్సిన అవసరముందని సూచించారు. జాతికి అవమానం కొనసాగుతుంటే..భవిష్యత్తు తరాలు అన్యాయానికి గురవుతాయని పేర్కొన్నారు.ఏప్రిల్ 5 తర్వాత ఎవరి రాజకీయాలు వారు చేసుకోవాలని సూచించారు. ఈలోగా రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా 25రోజులపాటు రాజకీయాల్ని పక్కనపెట్టి పోరాడుదామన్నారు. 2019లో కేంద్రంలో యూపీఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తే..తొలిసంతకం ఏపీకి ప్రత్యేక హోదా కోసమేనని రాహుల్‌గాంధీ ప్రకటించారని గుర్తుచేశారు.విభజన చట్టంలోని హామీల అమలుకు అఖిలభారత కాంగ్రెస్ పార్టీ కట్టుబడి వుందని స్పష్టం చేశారు.రాష్ట్ర విభజనకు అందరూ కారణమేనని అన్నారు. దేశంలో థర్డ్ ఫ్రంట్‌కు అవసరం లేదని, 2019లో యూపీఏ ఆధ్వర్యాన కేంద్రంలో ప్రధానిగా రాహుల్ ఎన్నికవుతారని ఆయన జోశ్యం చెప్పారు.ఏపీకి ప్రత్యేక హోదా కోసం అందరమూ ఒకే తాటిపైకి వచ్చి పోరాడుదామని సూచించారు.

రాజ్యసభ సీట్లలో బీసీ, ఎస్సీలకు అన్యాయం

పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొలనుకొండ



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన రాజ్యసభ రెండు సీట్లలోనూ అగ్రవర్ణాలకే అవకాశమిచ్చి.. బీసీ, ఎస్సీలకు తీవ్ర అన్యాయం చేశారని పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొలనుకొండ శివాజీ సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. వ్యాపారవేత్తయిన సీఎం రమేష్‌కు రెండోసారి అవకాశమివ్వడం సిగ్గుచేటని తెలిపారు.ఎంతోకాలం నుంచి టీడీపీని నమ్ముకుని వున్న బీసీలకుగానీ, ఎస్సీలకుగానీ రాజ్యసభ సీటు ఇవ్వకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఎన్నికలు వచ్చినపుడే బీసీ జపం చేయడం బాబుకు పరిపాటైందని,ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని తెలిపారు.

సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఎండీగా సూర్య కుమారి

విశాలాంధ్ర అమరావతి : రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ ఎండీ రాంగోపాల్ పై బదిలీ వేటు పడింది. సోమవారం ప్రభుత్వం ఆయను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.రాంగోపాల్ హయాంలో కందులు , ఇతర ఆహార వస్తువులు కొనుగోళ్లలో భారీ అక్రమాలు జరిగాయని ఆరోపణలు వెలువెత్తాయి.ఈ అక్రమాల సమాచారం సీఎం కు చేరటంతో రాంగోపాల్ ను బదిలీ చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది.రాంగోపాల్ స్థానంలో దుర్గ గుడి మాజీ ఈఓ సూర్య కుమారిని కార్పొరేషన్ నూతన ఎండీ గా నియమిస్తూ ప్రభుత్వం జీవో జారీచేసింది.

ఆర్టీసీ ఈడీగా ఎస్ఏ అన్సారీ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ)లో చీఫ్ పర్సనల్ మేనేజర్‌గా చేస్తున్న ఎస్ఏ అన్సారీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ)గా పదోన్నతిని పొందారు. ఆయన విజయనగరంజోన్ ఈడీగా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈమేరకు ఆర్టీసీ ప్రజాసంబంధాల అధికారి కె శ్రీరాములు ప్రకటన విడుదల చేశారు. విజయనగరంజోన్ ఈడీగా చేస్తున్న ఏ రామకృష్ణ విజయవాడ బదలీ కావడంతో అక్కడ ఖాళీ ఏర్పడిందన్నారు. దీనిని భర్తీ చేసేందుకు అన్సారీకి పదోన్నతిని కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు.

15న నిరసన దినాన్ని జయప్రదం చేయండి

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: కేంద్ర ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ ఈ నెల 15వ తేదీన నిర్వహించ తల పెట్టిన అఖిల భారత నిరసన దినాన్ని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. దేశంలో శ్రమజీవులు, వారి బ్రతుకు దెరువుపై కేంద్రం తీవ్రమైన దాడులు ప్రారంభించిన నేపథ్యంలో 10 కేంద్ర కార్మిక సంఘాలు ఫిబ్రవరి 22న ఢిల్లీలో సమావేశమై మార్చి 15న దేశవ్యాప్తంగా నిరసన దినాన్ని పాటిం చాలని నిర్ణయిం చాయన్నారు. దీనిలో భాగంగా కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు ఏఐటీయూసీ, ఐఎన్‌టీ యూసీ, హెచ్‌ఎంఎస్, సీఐటీయు, ఏఐయూట ీయూసీ, యూటీయూసీ, టీయూసీసీ, ఐఎఫ్‌టీయూ, ఏఐఎఫ్‌టీయూ, (న్యూ)ఐఎఫ్‌టీయూ, వైఎస్సార్‌టీ యూ సంఘాల ఆధ్వర్యంలో 15 ఉదయం 10.30 గంటలకు విజయ వాడ లెనిన్ సెంటరులో మానవహారం నిర్వహిస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయడంపై పూర్తిగా దృష్టి సారిం చిందన్నారు. మొత్తంగా క్యాజువలైజేషన్ చేస్తూ పని భద్రతకు ముప్పుతేవడమే కాకుండా కాంట్రాక్టు లేబరు చట్టానికి సవరిస్తూ 'నిర్ణీతకాలపు పని'(ఫిక్స్‌డ్‌టర్మ్ ఎంప్లాయిమెంట్)ని తీసుకు రావడం ద్వారా ఉన్న అరకొర ఉద్యోగ భద్రతను తొలగించడానికి పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు ఆయన తెలిపారు.

రైల్వేల ప్రైవేటీకరణ, విదేశీ కంపెనీ లకు ఎలాంటి నియంత్రణలు, షరతులు లేకుండా బొగ్గు గనులు తవ్వడానికి అను మతుల మంజూరు, రక్షణశాఖ ఉత్పత్తులను ప్రైవేటు పరం చేసి దేశ రక్షణకు ప్రమాదం తెచ్చిపెట్టడం వంటి ప్రజా వ్యతిరేక, జాతి వ్యతిరేక చర్యలే ఇందుకు ఉదాహరణలుగా నిలుస్తాయన్నారు. కేంద్రం దురుద్దేశ పూరితంగా 47వ ఇండియన్ లేబరు కాన్ఫరెన్స్‌ను వాయిదా వేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. రానున్న కాలంలో సంఘటిత పోరాటశక్తితో నిరవధిక సమ్మెలకు సిద్ధం కావాలని కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చా యన్నారు. అనుబంధాలు ఏవైనా అంతా ఒక తాటిపైకి వచ్చి ఉద్యమాల్లో పాల్గొనాలని 10 కేంద్ర కార్మిక సంఘాలు తీర్మానించినట్లు ఓబులేసు తెలిపారు.

ఘనంగా వైసీపీ ఆవిర్భావ వేడుకలు



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: వైసీపీ 8వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పార్టీ కేంద్ర కార్యాలయం లోటస్‌పాండ్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సీనియర్ నేత, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, అనంతరం కేక్‌ను కట్ చేశారు. వైఎస్సార్ ఆశయ సాధనకు వైసీపీని స్థాపించామని, అందుకు అనుగుణంగా అందరం కృషి చేద్దామని పార్టీ శ్రేణులకు పెద్దిరెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికల తరువాత పాలకులు ప్రత్యేక హోదాను మర్చిపోయారని మండిపడ్డారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీని గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎమ్మెల్యే ఆర్.కె.రోజా మాట్లాడుతూ ఏడేళ్లుగా పార్టీకి అండగా ఉన్న కార్యకర్తలకు పాదాభివందనమన్నారు. చిరంజీవి లాంటి వాళ్ళు పార్టీ పెట్టి నడపలేక చేతులు ఎత్తేశారని ఆమె గుర్తుచేశారు. వైసీపీని పురిటిలోనే తొక్కేయాలని ప్రయత్నాలు చేశారని, 2019 లో వైసీపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆమె స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసం జగన్ చేస్తున్న ప్రత్యేక హోదా పోరాటాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. వైసీపీ ప్రధాన కార్యదర్శి భూమన కరుణాకర్‌రెడ్డి మాట్లా డుతూ ప్రత్యేకహోదాపై జగన్ పోరాటం చూసిన తర్వాత చంద్రబాబు యూటర్న్ తీసుకున్నారని ఎద్దేవా చేశారు.

తప్పుడు వాగ్దానాలు, మోసపూరిత కుట్రలు, అనైతిక పొత్తులతో చంద్రబాబు అధికారంలోకి వచ్చారని దుయ్యబట్టారు. ఆయన చేసిన మోసాలు ఎండగడుతూ తమ పార్టీ ప్రజల్లోకి వెళుతోందని భూమన తెలిపారు. ప్రతీక్షణం ప్రజల కోసం పరితపించే వైఎస్ఆర్ ఆశయాలను సమాధి చేయాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తే, విలువలు, విశ్వసనీయత కోసం జగన్ పార్టీని ప్రారంభించారని గుర్తు చేశారు. ఈ వేడుకల్లో భూమన కరుణాకర్ రెడ్డి, లక్ష్మీ పార్వతి, వాసిరెడ్డి పద్మలతో పాటు పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్సీలు విభీషణులా ? సైంధవులా ?

టీడీపీ ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్

విశాలాంధ్ర అమరావతి : శాసనమండలిలో బీజేపీ పక్ష నాయకుడు సోము వీర్రాజు, టీడీపీ సభ్యులు వైవీబీ.రాజేంద్రప్రసాద్, డొక్కా మాణిక్యవరప్రసాద్, దొరబాబు, మంత్రి పితాని సత్యనారాయణల మధ్య ఆసక్తికరంగా చర్చ సాగింది. సోమవారం శాసన మండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సోము వీర్రాజు మాట్లాడుతూ కేంద్ర సాయాన్ని రాష్ట్రం ఎక్కువగా వినియోగించుకుంటోంది. కేంద్రం చాలా ఇచ్చింది. ప్యాకేజీతోనే అభివృద్ధి జరుగుతుందని గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ కేంద్ర మంత్రి సుజనా చౌదరి మాట్లాడిన ప్రకటనలతో ఉన్న పేపర్ క్లిప్పింగ్‌లను చూపిస్తూ, రాష్ట్ర విభజనకు సీఎం కూడా లేఖ ఇచ్చారు. తెలంగాణలో ఒకమాట, ఆంధ్రలో మరోమాట మాట్లాడుతున్నారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వాలని కోరిందే బీజేపీ. అవన్నీ మరిచి ఇప్పుడు కేంద్రాన్ని నిందిస్తున్నారు అంటూ విమర్శించారు. ఉత్తరాంధ్ర, రాయలసీమలలో పెద్ద ఆసుపత్రులు నిర్మించాలని, ఒంగోలు ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. కేంద్రం ఎన్ని చేసినా బీసీ వర్గానికి చెందిన నరేంద్రమోడీని విమర్శించటం తగదన్నారు. ఆవేశంలో నీచమైన బీసీ అనే పదాన్ని వాడారు. వెంటనే ప్రభుత్వ విప్ డొక్కా మాణిక్యవరప్రసాద్ లేచి ఆ పదాన్ని ఉపసంహరించుకోవాలని, రికార్డుల నుంచి తొలగించాలని కోరటంతో చైర్మన్ స్థానంలో ఉన్న రెడ్డి సుబ్రహ్మణ్యం రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు చెప్పారు. వీర్రాజు ప్రసంగానికి దీటుగా టీడీపీ సభ్యుడు వైవీబీ.రాజేంద్రప్రసాద్ సమాధానమిచ్చారు. కేంద్రం ఆంధ్ర ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నది, రాష్ట్ర బి.జె.పి., ఎమ్.ఎల్.సిలు ఆంధ్రుల వైపా? ఢిల్లీ పాలకులు వైపా తేల్చుకోవాలి? ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చిన విధంగా ప్రత్యేకహోదా ఎందుకు ఇవ్వలేదు? ఎందుకు ఇవ్వరు? ఎన్నికల ప్రణాళికలు అమలు చేయండి. కేంద్రం ప్రభుత్వం ఆంధ్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలి. రాష్ట్ర ప్రగతిలో విభీషణులుగా ఉంటారా? సైంధవులుగా అడ్డుపడతారా ? అంటూ రాజేంద్రప్రసాద్ బీజేపీ ఎమ్మెల్సీలకు సవాల్ విసిరారు. చర్చలో మంత్రి పితాని మాట్లాడుతూ మిత్ర పక్షంగా కేంద్రం ప్యాకేజీ ద్వారా అవసరమైన నిధులు ఇస్తామంటే నమ్మామని, కానీ నమ్మినందువల్ల మోసపోయామని బీజేపీ పెద్దలకు ఇది ఎంత సబబో బీజేపీ పెద్దలు సమాధానం చెప్పాలన్నారు. వీర్రాజు గతంలో ఇచ్చిన పలు పత్రికా ప్రకటనల క్లిప్పింగ్‌లను రాజేంద్రప్రసాద్ సభలో చూపారు.

తిన్నవారిని ఏం చేయలేని పరిస్థితి

'ఇందిరమ్మ' గృహ నిర్మాణంలో అక్రమాలపై మంత్రి కాల్వ



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: కాంగ్రెస్ హయాంలో 2004-14 మధ్య కాలంలో ఇందిరమ్మ గృహ నిర్మాణంలో ప్రజాధనాన్ని తినేసిన వారిని ఏమీ చేయలని పరిస్థితి నెలకొని ఉందని మంత్రి కాల్వ శ్రీనివాసులు అన్నారు. ఈ వ్యవహారంలో లబ్ధిదారులు, డ్వాక్రా సంఘాలు, హౌసింగ్ అధికారులు బలైపోయారే తప్ప అక్రమాలకు పాల్పడిన కాంగ్రెస్ నాయకులు దర్జాగా తిరుగుతున్నారని విమర్శించారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా సోమవారం ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 1.84 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన విషయం ప్రభుత్వ దృష్టికి వచ్చిందన్నారు. ఈ ఇళ్లలో అనేకం స్లాబులు, గోడలు పెచ్చులూడి పోతుం డడంతో ఇళ్లలో ఉండేందుకు ప్రజలు భయపడిపోతున్నారని తెలిపారు. వీటికి మరమ్మత్తులను చేయించేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టా మన్నారు. ఇళ్ల నిర్మాణం, కేటాయింపుల్లో చోటు చేసుకున్న అవకతవకలకు సంబంధించి విచారణలు జరిపిస్తున్నామని, కొన్ని చోట్ల క్రిమినల్ కేసులు పెడుతున్నట్లు వివరించారు. డ్వాక్రా సంఘాలు, లబ్ధిదారులకు తెలియకుండా వారితో సంతకాలను చేయించుకుని ఆయా మొత్తాలను స్వాహా చేయడం జరిగిందన్నారు. ఇందులో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారనే ఆరోపణలు లేకపోలేదన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అవినీతికి సహకరించారనే ఆరోపణలపై వీరిపై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో పూర్తిగా నష్టపోయిన లబ్ధిదారులకు తమ ప్రభుత్వం తప్పకుండా న్యాయం చేస్తుందని మంత్రి భరోసా ఇచ్చారు.

మరో మూడు నెలల్లో అన్న క్యాంటీన్లు

రాష్ట్రంలో అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేయడానికి స్థలాల ఎంపిక ప్రక్రియ జరుగుతోందని, మరో మూడు నెలల్లో వీటిని అందుబాటులోకి తెస్తామని పౌర సరఫరాల శాఖమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. పట్టణ స్థానిక సంస్థల్లో వీటిని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుతం రాజధాని అమరావతి ప్రాంతంలో 4, కర్నూలుజిల్లా నంద్యాలలో 3 క్యాంటీన్లు పని చేస్తున్నాయని సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రాష్ట్రంలో గతంలో కిరోసిన్‌ను పంపిణీ చేసే డీలర్లు జీవనోపాధిని కోల్పోవడంతో దుర్భరమైన జీవితాలను అనుభవిస్తున్నారని బీజేపీ పక్షనేత విష్ణు కుమార్‌రాజు తెలిపారు. దీనికి పుల్లారావు బదులిస్తూ ' గతంలో కిరోసిన్‌ను పంపిణీ చేసే డీలర్ల సేవలను విలేజ్‌మాల్స్‌లో వినియోగించు కుంట ామని హామీ ఇచ్చారు. జీఎస్టీ తర్వాత కొందరు చిరు వ్యాపారులపై అధికారుల వేధింపులు అధికమయ్యాయని సభ్యులు డి నరేంద్ర కుమార్, బొండా ఉమమహేశ్వరావు తెలిపారు. దీనిపై ఆర్థికమంత్రి యనమల స్పందిస్తూ టర్నోవర్ రూ. 20 లక్షలలోపు ఉన్న వ్యాపారులు జీఎస్టీ పరిధిలోకి రారని, డెకాయ్ ఆపరేషన్స్ పేరిట జరుగు తున్న దాడులను ఆపాలని ఇప్పటికే ఆదేశించినట్లు ఆయన చెప్పారు.

64.80 లక్షల మందికి వడ్డీలేని రుణాలు

రాష్ట్రంలో గత సంవత్సరం 64.80 లక్షల మంది స్వయం సహాయక బృందాలకు వడ్డీలేని రుణాలను మంజూరు చేసినట్లు మహిళాసాధికారత, శిశుసంక్షేమ శాఖమంత్రి పరిటాల సునీత తెలిపారు. అలాగే 5.94 లక్షల డ్వాక్రా రుణాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. అలాగే మరొకప్రశ్నకు ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ నియోజక వర్గాల వారీగా భౌతిక, ఆర్థిక పురోగతి నేవేదికను ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు సీఎల్‌డీఎంఎస్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసినట్లు తెలిపారు.

సంపాదకీయం

నేడు సోనియా విందుదౌత్యం

దుష్టపాలన అంతానికి, ఐక్యత చర్యలకు ఏ దౌత్యమైనా మంచిదే... హర్షణీయమే. కాంగ్రెస్ అధినేత్రి సోనియా నేడు విందుదౌత్యంతో ప్రతిపక్షపార్టీలు, వాటి నాయకులకు చేరువ కావాలని భావించడం ఒక వివేకవంతమైన చర్యగా రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఎన్డీఏకి వ్యతిరేకంగా యూపీఏ ఏర్పాటుకు దారితీసిన ఆమె గత చొరవను ఈ విందుదౌత్యం స్ఫురణకు తెస్తుందనడం అతిశయోక్తి కాదు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రతిపక్ష పార్టీలను ఏకతాటిపైకి తీసుకొచ్చి, వాటితో చర్చలు జరిపి బీజేపీని ఎదుర్కోడానికి వ్యూహం రూపొందిస్తారని భావించబడింది. కానీ ఆయన ప్రతిపక్షపార్టీల ఐక్యతకు ఇటీవల మాసాల్లో ఎటువంటి ఊహాత్మకమైన చర్య చేపట్టలేదు. "ఎన్నడూ చేయకపోవడం కన్నా ఆలస్యంగానైనా చేయడం మంచిది" అన్నట్లుగా ప్రతిపక్ష పార్టీలు, వాటి నాయకులను విందు సమావేశం పేరుతో ఐక్యపరిచేందుకు సోనియా గాంధీ చొరవ తీసుకోవడం మంచిదే. కాంగ్రెస్‌లోని సీనియర్ నాయకులను ఏ విధంగా పక్కనపెట్టాలన్న విషయంలో స్పష్టతలేని సమయంలో రాహుల్ గాంధీ నుండి ప్రతిపక్ష పార్టీలను, వాటి నాయకులను ఐక్యపరిచేందుకు ప్రయత్నం జరుగుతుందని ఆశించడం అతిశయమే అవుతుంది. పార్టీలో పాత నాయకులకు గౌరవనీయ స్థానమే వుంటుందని ఇటీవల సోనియా గాంధీ వివరణ యిచ్చినప్పటికీ, రాహుల్ గాంధీ నుండి అటు మాట రాలేదు. అయితే ఒక జాతీయ పార్టీ అధ్యక్షుడిగా చొరవ తీసుకోవాలన్న విషయాన్ని రాహుల్ గాంధీ గ్రహించడం, రాజనీతి ప్రదర్శించడం సముచితంగా వుంటుంది. గత సందర్భాల్లోలాగా ఈసారి కూడా మేఘాలయ, నాగాలాండ్, త్రిపుర శాసనసభ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌కు ఇతర పార్టీల అవసరం కనిపించింది. కానీ, గుజరాత్ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ చూపిన 'దెబ్బతీయాలన్న స్ఫూర్తి' ఈసారి ఆ మూడు రాష్ట్రాల ఎన్నికల్లో కనిపించలేదు. ఎన్నికలంటే ఎన్నికలే. అది గుజరాత్ కావచ్చు, త్రిపుర కావచ్చు. విజయం సాధించడం ముఖ్యం. ఈ మూడు రాష్ట్రాల్లో బీజేపీ ఓటమికి రాహుల్ అంత శ్రద్ధ చూపినట్లు కనిపించదు. కాషాయపార్టీ సన్నాహక పద్ధతులు కాంగ్రెస్ వర్గాల్లో ఆందోళన ఘంటికలు మోగించవలసి వుండింది. దిగువ స్థాయిలో ఒక నిర్దిష్ట వ్యూహంతో ప్రచారం లోపించడం ఎన్నికల ఫలితాలు సుస్పష్టం చేశాయి. రాహుల్ గాంధీ ప్రతిపక్ష పార్టీలకు చేరువకావడానికి విముఖత చూపడానికి రెండు కారణాలు అయివుండవచ్చు. ఒకటి తన మాటను ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆలకిస్తారని ఆయనకు ఖచ్చితమైన నమ్మకం వుండి వుండకపోవచ్చు. లేక త్రిపురలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, బీజేపీల దాడిని కాంగ్రెస్ తట్టుకోలేదని రాహుల్ భావించి వుండవచ్చు. గుజరాత్‌లో దళిత శక్తులు, గ్రూపులను ఏకం చేయడం ద్వారా బీజేపీని రాహుల్ ఎదర్కోగలిగాడు. నేడు (మంగళవారం) సోనియా ఆతిధ్యమిస్తున్న విందు ఇప్పటికే ప్రతిపక్షాలను ఒక కుదుపునకు గురిచేసి, గాఢనిద్ర నుండి మేలుకొనేటట్లు చేసింది. బీజేపీకి వ్యతిరేకంగా ఐక్యఫోరం ఏర్పాటుకు ఈ విందు దౌత్యం ఒక చొరవగా భావించబడుతోంది. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీతో సహా అన్ని ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆమె అతిథులుగా రానుండడంతో విందు సమావేశం ప్రాధాన్యతను సంతరించుకోనున్నది. పార్లమెంటు లోపల, వెలుపలా సమన్వయానికి మమతా బెనర్జీ స్వయంగా టీఆర్ఎస్ అధినేత కేసీఆర్, డీఎంకే కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎంకే స్టాలిన్‌తో మాట్లాడారు.

సోనియా తాజాచర్య, బీజేపీకి వ్యతిరేకంగా ఒక ఐక్య సంఘటనకు కృషి చేయడానికి ప్రతిపక్ష నాయకులను శక్తిమంతం చేస్తుందన్నది నిస్సందేహం. కాషాయ దళాల దాడులు తిప్పికొట్టడానికి లౌకిక, ప్రజాస్వామ్య శక్తులలో ధైర్యాన్ని కూడా నింపుతుంది. త్రిపురలో లెనిన్ విగ్రహం కూల్చివేతపై బీజేపీ వ్యతిరేక శక్తులు స్పందించిన తీరు భవిష్య సూచనలకు సంకేతంగా భావించాలి. నిరసన స్వభావం, ప్రజల మనోభావాలను గ్రహిస్తూ, ఎల్లప్పుడు ఆకతాయి చేష్టలకు పాల్పడుతున్న దుష్టులను కాపాడుతున్న నరేంద్ర మోడీకి కూడా వారిని హెచ్చరించక తప్పలేదు. అటువంటి కార్యకలాపాలపట్ల మోడీ ఆగ్రహం వ్యక్తం చేసినప్పటికీ అది కేవలం కంటి తుడుపు చర్యగానే భావించాలి. ఇంతకు ముందు గోమూకలు ముస్లింలను హతమార్చినప్పుడు కూడా మోడీ ఇటువంటి బూటకపు ఆగ్రహాన్నే వ్యక్తం చేసిన విషయాన్ని స్ఫురణకు తెచ్చుకోవలసి వుంది. త్రిపుర కెరటాలు ప్రతిపక్ష పార్టీలను తాకాయనడానికి ఉత్తరప్రదేశ్‌లో జరిగిన రెండు ఉప ఎన్నికల్లో తన ఆగర్భ శత్రువైన సమాజ్‌వాదిపార్టీకి బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి మద్దతు పలకడమే నిదర్శనంగా భావించాలి. పార్టీ అవకాశాల పునరుద్ధరణకు రాహుల్ గాంధీ నాయకత్వంలో పార్టీ "కలసికట్టుగా" కృషి చేస్తుందని కూడా సోనియా హామీ యిచ్చారు. "గుజరాత్‌లో సంక్లిష్ట పరిస్థితుల్లో మేము మంచి పాత్ర పోషించాము. రాజస్థాన్‌లో ఉప ఎన్నికల ఫలితాలు చాలా పెద్దవి. ఇవి మార్పు పవనాలు వస్తున్నట్లు తెలియజేస్తున్నాయి" అని సోనియా పేర్కొన్నారు. అది రాహుల్ సారధ్యంలో జరుగుతుందన్న ఆశాభావంతో ఆమె వున్నారు. ఇతర ప్రతిపక్షపార్టీలతో సైద్ధాంతిక, కార్యక్రమాధారిత విభేదాలను కాంగ్రెస్, రాహుల్ గాంధీ మనసులో పెట్టుకోకుండా, రానున్న రోజుల్లో రాజకీయ లక్షణాన్ని నిర్వచించే విధంగా కాంగ్రెస్ పాత్ర, దృక్పథం వుండాల్సిన అవసరం వుంది. "ప్రతిపార్టీకి ఆశలు, ఆకాంక్షలు వుండవచ్చు. భారతదేశ పునాది విలువల కొరకు పోరాటమే కాంగ్రెస్ ధ్యేయం" అని కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ అధ్యక్షుడు రణదీప్ సూర్జేవాలా కచ్చితంగానే చెప్పారు. దేశ లౌకిక రాజ్యాంగ విలువలకు, ప్రజాస్వామ్యానికి మతోన్మాద కాషాలదళాల నుండి ప్రమాదం పొంచివున్న నేపథ్యంలో వామపక్ష లౌకిక ప్రజాస్వామ్య శక్తులు కూడా అదే ధ్యేయంతో ఆ దిశగా అడుగులు ముందుకు వేయడం నేటి తక్షణ కర్తవ్యంగా భావించాలి.

చురక

శాశ్విత అధ్యక్షులు
చైనాలో జిన్‌పింగ్
కమ్యూనిస్టు రాజ్యంలో
కాగలడా మరో కింగ్

వ్యక్తి చుట్టూ అధికారం
విస్తరిస్తే ప్రమాదం
సామాజిక బాగు కొరకు
సంస్కరిస్తే ప్రమోదం

- వేల్పుల నారాయణ

విశ్లేషణ

భ్రష్టుపడుతున్న తెలుగు రాష్ట్రాల విద్యా వ్యవస్థ

ప్రొఫెసర్ బి.రామకృష్ణారావు

ఉభయ తెలుగు రాష్ట్రాలలో రెండు మూడు కార్పొరేట్ విద్యాసంస్థలలో చదువుతున్న విద్యార్థులు ఒత్తిడిని తట్టుకోలేక అధిక సంఖ్యలో బలవన్మరణాలకు పాల్పడడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. వీటిలో నారాయణ విద్యా సంస్థలు ముందు వరసలో ఉన్నాయి. గత రెండు నెలలోనే ఉభయ తెలుగు రాష్ట్రాలలో 38 మంది విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో 2218 ప్రైవేటు కళాశాలలుండగా, వీటిలో సుమారు 4 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించేది ఇంటర్ విద్యేనన్న భ్రమతో దానికి తల్లిదండ్రులు ఎనలేని ప్రాధాన్యతనిస్తున్నారు. దీన్ని కార్పొరేట్ సంస్థలు లాభాలుగా మార్చుకుంటున్నాయి. రాజకీయ విరాళాలు ప్రభుత్వాలకు ఇవి అందిస్తున్నాయి. కాబట్టి పాలకులు కూడా వీరి జోలికి పోవటం లేదు. విద్యావంతులుగా తీర్చిదిద్దుతారని అప్పజెప్పితే, వారిని తిరిగి విగతజీవులుగా అప్పజెప్పుతున్నారు. ఇంత జరుగుతున్నా, విద్యాసంస్థలకు గాని, అటు పాలకులకుగాని పెద్దగా స్పందనే లేకపోవడం చాలా శోచనీయం. ఇంకెంతమంది చావాలి? తాము ఎందుకు చనిపోతున్నామో ఉత్తరాలు రాసినా ప్రభుత్వాలు దిద్దుబాటు చర్యలు చేపట్టకపోవడం విస్మయం కలిగిస్తోంది. విద్యాసంస్థల యజమానులు రాజకీయాల్లోకి రాకుండా వుంటే లేదా ప్రభుత్వాలు వారిని ప్రోత్సహించకుండా వుంటే ఈ బలవన్మరణాలు నేడు చోటుచేసుకునేవి కావు. గతంలో కొన్నాళ్లు ఈ సంస్థల యజమానులు రాజకీయాల్లోకి రాకుండా బయటనే ఉండి ఎన్నికల సమయంలో వివిధ పార్టీలకు విరాళాలు ఇచ్చేవారు. కాని నేడు పార్టీలకు ఆ అవకాశం ఇవ్వకుండా తామే రాజకీయాల్లోకి ప్రవేశించి పాలకులను శాసిస్తున్నారు. 2014 ఎన్నికల సమయంలో ఒక ప్రముఖ కార్పొరేట్ విద్యాసంస్థల యజమాని ఉత్తరాంధ్రలో కొన్ని జిల్లాల్లో డబ్బు ఖర్చుపెట్టే బాధ్యతను తీసుకొని అభ్యర్థులను గెలిపించాడన్న వార్త చాలామంది నోళ్లల్లో పలికింది. అది నిజమో అబద్ధమో తెలియదు గాని తర్వాత ఆ యజమాని బాగా లాభపడ్డాడు. అందుకే విద్యార్థులు పిట్టల్లా రాలిపోతున్నా వారిపై ఎటువంటి చర్యలు తీసుకోవటం లేదని పలువురి భావన. దీని ప్రభావం తర్వాత ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులపై పడకమానదు.

కార్పొరేట్ కాలేజీలలో తమ పిల్లలను చేర్పిస్తే, పెద్ద పెద్ద ఇంజనీర్లు డాక్టర్లు అవుతారని తల్లిదండ్రులకు ఒక నమ్మకం పట్టుకొంది. ఇది కేవలం భ్రమ మాత్రమే. చదువంటే కేవలం ఇంజనీరింగు, మెడిసన్ మాత్రమే కాదు. అనేక ఇతర రంగాలు, ఇతర కోర్సులు ఉన్నాయి. పిల్లల అభిరుచులను బట్టి ఆయా కోర్సులలో పిల్లలను చేర్పించాలే తప్ప, తమ అభిరుచుల ప్రకారం లేదా పక్కింటివాళ్ల పిల్లలు మెడిసన్ చదువుతున్నారనో, లేదా తమ బంధువుల పిల్లలు మెడిసన్ చదువుతున్నారనో అని పిల్లలను మెడిసన్‌లో చేర్పించకూడదు. అలా చేయబట్టే నేడు ఈ బలవన్మరణాలు. అలాగే ర్యాంకులు కొంచెం ఎక్కువగా వచ్చినా, లేదా ఫెయిలయినా తల్లిదండ్రులు ఎంతో బాధపడపోతుంటారు. బాల్యవిద్యలో ఫెయిలయినవారు, డ్రాపవుటయిన వారు భవిష్యత్తులో అద్భుతాలను సృష్టించారు. బిల్ క్లింటన్ ఒక ఉదాహరణ. నేడు ఇంజనీరింగు, మెడిసన్ ఈ రెండే కాకుండా సీఏ., ఐసీడబ్ల్యుఏ, కంపెనీ సెక్రటరీ కోర్సు, ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటివాటి గురించి తల్లిదండ్రులు ఆలోచించటం లేదు. పై కోర్సులు చదివి ఉన్నత శిఖరాలకు చేరిన అనేక మంది తక్కువ ర్యాంకులు, పూర్వం సెకెండు క్లాసు వచ్చిన విద్యార్థులే. అందులోను పైన పేర్కొన్న కొన్ని కోర్సులకు నేడు మన దేశంలోనే కాక, విదేశాల్లో కూడా మంచి డిమాండు ఉంది.

కార్పొరేట్ కాలేజీలు ప్రతీఏటా ఎండలు తీవ్రంగా ఉన్న ఏప్రిల్ నెలలో తరగతులు మొదలుపెట్టి కేవలం నాలుగు నెలల్లోనే సిలబస్ పూర్తి చేయడం పరిపాటైపోయింది. తర్వాత నెలల్లో పిల్లలకు విశ్రాంతి ఉండదు. వారాంతపు సెలవులు పండుగ సెలవులు ఉండవు. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుంటారు. వీటికి తల్లిదండ్రులు కూడా స్వాగతిస్తుంటారు. కాలేజీల్లో సరైన వసతులు ఉండవు. 40 మంది విద్యార్థులు ఉండవలసిన గదులలో సుమారు 100 మంది ఉంటుంటారు. ఇక హాస్టళ్లలో ఉన్న పిల్లల పరిస్థితి నరకమే. పరిమితమైన టాయిలెట్స్, అపరిమితమైన స్టడీ అవర్స్, నాసిరకం తిండి, ఇరుకైన గదులు, తల్లిదండ్రు వస్తే వారిని లోపలకు రానీయకుండా బయట ఉంచి పిల్లలను వారి వద్దకు పంపడం ఇదీ పరిస్థితి. ఇటీవల రాష్ట్ర విద్యామంత్రి జరిపిన తనిఖీలలో హాస్టల్స్‌లో పిల్లలు రోజుకు 18 గంటలు చదివిస్తున్నారని తేలింది. నిబంధనలకు విరుద్ధంగా 158 హాస్టళ్లు గుర్తించడం జరిగింది. వీరికి 3 నెలలు గడువు ఇచ్చారు. ఈ 3 నెలల్లో వసతులు సమకూర్చుకొని సంబంధిత శాఖ అనుమతి తీసుకోవాలి. ఈ నేపథ్యంలో ఇన్నాళ్లు సంబంధిత ప్రభుత్వ యంత్రాంగం ఏమి చేస్తుందన్న అనుమానం ఎవరికైనా రాకమానదు. గతంలో విద్యార్థులకు గురువులకు సత్సంబంధాలుండేవి. ఫలితంగా విద్యార్థులు పెద్దయిన తర్వాత తమ గురువులను గౌరవంతో నమస్కరించడం, పాదాభివందనం చేయడం జరిగేవి. నేడు దీనికి పూర్తిగా భిన్నం. కారణం పిల్లలు చదువును డబ్బుపెట్టి కొనుక్కోవడమే. పిల్లల్లో సబ్జెక్ట్ అవగాహన అయిందో లేదో గుర్తించకుండా గుడ్డిగా వారిచేత బట్టీ పట్టించడం ఈ సంస్థలలో సామాన్యమైపోయింది. నేడు బయటలలో 90 శాతం తెలుగు పిల్లలు ఫెయిల్ అవడం అక్షరసత్యం. దీనికి కారణం ఈ బట్టీ విధానమే. కొన్నిచోట్ల పరీక్షా ప్రశ్నాపత్రాలను ముందుగా తమ పలుకుబడిని ఉపయోగించుకొనో లేదా డబ్బులిచ్చో పిల్లలకు అందిస్తుంటారని బోగట్టా. ఫీజులు ఏ మాత్రం బాకీ ఉన్నా పిల్లలకు పరీక్ష హాల్‌టిక్కెట్లు ఇవ్వరు. ఈ సంస్థలు జైళ్లను, కోళ్లఫారాలను తలపిస్తుంటాయి. జైళ్లలో నేరస్తులు నయం. కనీసం జైళ్లలోనైనా వారికి స్వేచ్ఛ ఉంటుంది. నిబంధనలను పాటిస్తూ ఉంటారు. అంతకన్నా ఘోరం ఈ విద్యా సంస్థలలో.

రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ముఖ్యంగా మూడు శాఖలు నేడు ఈ విద్యా సంస్థలు ఇస్తున్న మామూళ్లకు కక్కుర్తిపడుతున్నారు. అవి 1) విద్యాశాఖ, 2) మునిసిపల్ శాఖ, 3) రవాణాశాఖ. విద్యాశాఖవారు విద్యకు సంబంధించిన ప్రమాణాల విషయంలోనూ, మునిసిపల్ శాఖ వారు భవనాలకు అనుమతులిచ్చే విషయంలోనూ, రవాణాశాఖవారు బస్సుల సామర్థ్యం విషయంలోనూ నియంత్రణ కరువయింది. కొంతవరకు ఇందులో వీరి తప్పుకూడా



లేదు. ఈ శాఖల అధికారులందరికీ రాజకీయ నాయకుల ఒత్తిళ్లుంటాయి. ఆ కారణం చేతను, మామూళ్లు లభించటంచేత వారంతా మౌనంగా ఉంటారు. ఈ మూడు శాఖలే కాకుండా, అగ్నిమాపక దళం వారు, పన్నుల శాఖవారు ముఖ్యంగా ఆదాయపు పన్నుల శాఖ వారు కూడా ఈ విద్యాసంస్థలకు దాసులు.

తెలుగు రాష్ట్రాలలో విద్య ముఖ్యంగా ఇంటర్ విద్య భ్రష్టుపట్టింది. విద్యార్థులను కాలేజీలకు భారీ లాభాలను తెచ్చిపెట్టే యంత్రాలుగా మార్చారు. మార్కులు, ర్యాంకులు, సీట్లు ఇవే భవిష్యత్తనుకుంటున్నారు తల్లిదండ్రులు. వాటికోసం పిల్లలపై ఒత్తిళ్లు. ఫలితం మరణం. ఈ ర్యాంకులు కూడా ఇటీవల కాలంలో దిగజారుతున్నాయి. ఫలితంగా మంచి ర్యాంకులొచ్చే విద్యార్థులను డబ్బుపెట్టి కొనుక్కుంటున్నారు. ఆ ర్యాంకులు మా సంస్థవే అని ప్రకటిస్తున్నారు. 50 నిమిషాలు లేకపోతే ఒక గంట జరపవలసిన ఒక పీరియడ్‌ను రెండు లేక రెండున్నర గంటలు పాఠాలు ఏకధాటిగా పిల్లలకు బోధిస్తున్నారు. అటు పిల్లలకు ఇటు టీచర్లకు ఎటువంటి సెలవులు ఉండకపోవడం చాలా శోచనీయం. భవిష్యత్తులో ప్రభుత్వ విద్యా సంస్థలకు చేదోడు వాదోడుగా ఉంటాయన్న ఉద్దేశంతో ప్రైవేట్ విద్యారంగాన్ని ప్రభుత్వాలు పాలకులు ఊహించలేదు. కొన్ని ప్రాంతాలలో పిల్లలు ఏరులు, వాగులు దాటుకొని తరగతులకు వెళుతున్నారు.

నేడు రెండు రాష్ట్రాల్లోనూ పిల్లలు పిట్టల్లాగ రాలిపోతున్నారు. ఈ విద్యా సంస్థల్లో ఇంతవరకూ వందల సంఖ్యలో పిల్లలు ఆత్మహత్యలు చేసుకుంటున్నా, ఎఫ్ఐఆర్ నమోదవుతోంది, ఛార్జిషీట్ ఉంటుంది గానీ, శిక్షలు పడకపోవడం విచిత్రం. చక్రపాణి సిఫార్సులు గానీ, ఇంటర్ బోర్డు నిబంధనలను గాని ఎక్కడా అమలవుతున్న దాఖలాలు లేవు. ఈ విషయంలో ఇరు ప్రభుత్వాలు విఫలమయ్యాయి. నేడు ముఖ్యంగా తల్లిదండ్రుల ఆలోచనా ధోరణి మారాలి. చదువంటే కేవలం కార్పొరేట్ చదువేకాదు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో కూడా మంచి ఉపాధ్యాయులున్నారు. వాస్తవానికి వారంతా సంబంధిత పరీక్ష (డీఎస్సీ)లో అత్యధిక మార్కులు సంపాదించినవారే. ఆ విషయానికొస్తే, ప్రైవేట్ విద్యాసంస్థల టీచర్లే ద్వితీయ, తృతీయ శ్రేణికి చెందినవారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న సంబంధిత పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చి అర్హులు కాని వారే ఇట్టి విద్యాసంస్థల్లో పనిచేస్తారు. అటు విద్యార్థులు ఎలాగైతే ఇష్టపడి కాకుండా కష్టపడి చదువుతారో, వీరు కూడా అతి తక్కువ జీతంతో ఎక్కువ గంటలు పనిచేస్తారు. వీరిపై యాజమాన్య గూఢచారి నిఘా కూడా ఉంటుందని సమాచారం. తల్లిదండ్రులు కూడా తమకు నచ్చిన కోర్సు కాకుండా, పిల్లలకు నచ్చిన కోర్సులోనే వారిని ప్రవేశపెట్టాలి. అకౌంటింగ్, ఫైనాన్స్, సెక్రటేరిషిప్, మైక్రోబయాలజీ వంటి కోర్సులకు మనదేశంలోనే కాక, విదేశాలలో కూడా మంచి గిరాకీ ఉంది. ఇవి గాకుండా పోటీ పరీక్షలనేకం ఉన్నాయి. భారీ డబ్బులు పోసి పై చదువులు చదివేబదులు ఆ డబ్బులు పెట్టి పై కోర్సులలో గానీ, లేదా పోటీ పరీక్షలకు ట్రైనింగుకు కాని ఖర్చుచేస్తే మంచిది. ఒకవేళ ఉద్యోగం దొరకకపోయినా, సొంతంగా ప్రాక్టీసు పెట్టుకోవచ్చు. ఈ ప్రైవేట్ సంస్థలను నియంత్రించడానికి ఒక రెగ్యులేటరీ అథారిటీని నియమించడం మంచిది. రాజ్యాంగం 39వ అధికరణ కల్పిస్తున్న బాలల హక్కులు కూడా ఇక్కడ ఉల్లంఘించబడుతున్నాయి. 2001లో ఉమ్మడి రాష్ట్రంలో నియమించిన ప్రొఫెసర్ నీరదారెడ్డి కమిటీ సిఫార్సులు, లేదా ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన చక్రపాణి కమిటీ సిఫార్సులు అమలుపై తీసుకున్న చర్యలు అంతంత మాత్రమే. కార్పొరేట్ కాలేజీలు ఎక్కువ ఫీజులు వసూలు చేయకుండా సహేతుకమైన ఫీజును నిర్ధారించి అదే వసూలు చేయాలి.

కార్పొరేట్ సంస్థలకు పూర్తిస్థాయిలో రాజకీయ దన్నుండడం నేటి దుస్థితికి ముఖ్య కారణం. తల్లిదండ్రుల తీరుతో పిల్లల్లో మనోవ్యాకులత, కాలేజీల్లో బందీగా మారిన వైనంతో స్నేహితులతోగానీ, తల్లిదండ్రులతో గాని తమ బాధను పంచుకోలేక తుంచుకుంటున్నారు. చదువులో ఆనందాన్ని పొందితేనే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకుంటాం అని మహాత్మా గాంధీ బోధించారు. అమెరికా వంటి అగ్రదేశాలలో ప్రభుత్వ ప్రాథమిక విద్య ఉచితం. యూరప్ ఖండంలోనే అత్యంత చిన్న దేశమైన ఫిన్లాండ్ విద్యా విధానం ప్రపంచంలోనే అత్యంత ఆదర్శనీయం. పరీక్షల పోటీలు, ర్యాంకుల పరుగు అక్కడ ఉండనే ఉండదు. అందరికీ ఒకే రకమైన విద్యనందిస్తారు. ఇంతవరకూ ఒక్క ఆత్మహత్య కూడా అక్కడ చోటు చేసుకోలేదు. విద్య కూడా ఉచితమే. మంచి ర్యాంకు వస్తేనే పిల్లల బ్రతుకులు బాగుపడతాయన్న తల్లిదండ్రుల ఆలోచన మారాలి. ర్యాంకులు సాధించలేని విద్యార్థులు, ద్వితీయ, తృతీయ తరగతిలో ఉత్తీర్ణులైన పాతకాలపు విద్యార్థులు అనేకమంది ఐఏఎస్, ఐపీఎస్‌లో ఎంపికైన నగ్నసత్యాన్ని తల్లిదండ్రులు తెలుసుకోవాలి. పాలకులు కూడా సమస్య వచ్చినప్పుడే హడావుడి చేయడం తూతూమంత్రంగా తాత్కాలిక చర్యలు ఒకటి రెండు తీసుకోవడమే తప్ప శాశ్వత చర్యలు శూన్యం. ఎన్నికలకు భారీ విరాళాలు అందుతున్నాళ్లు ఈ పరిస్థితి మారదు. ఈ విద్యాసంస్థలు ఏటా బ్యాలెన్స్‌షీట్ సంబంధిత శాఖకు సమర్పించాలి. కానీ ఈ సంస్థలు ఇదేదీ పాటించటంలేదు. ఈ సంస్థలు ఇంటర్‌బోర్డుకు సమర్పిస్తున్న జాబితాలోని టీచర్ల అర్హతలు వేరు. ప్రత్యేకంగా నియమించుకున్న అర్హతలు లేని టీచర్ల జాబితా వేరు. తాజాగా కేంద్ర మానవవనరుల అభివృద్ధి మంత్రి జవదేకర్ ఈ విద్యాసంస్థలు పిల్లలను బానిసలుగా చూస్తున్నాయని వాపోయారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రవర్తనను పరిశీలిస్తుండాలి. చదవలేమని చెబితే సమస్య తీవ్రతననుసరించి నిర్ణయాలు తీసుకోవాలి. ఒక ఏడాది నష్టపోయినా పర్వాలేదు వీలైతే మరో కళాశాలకు మార్చాలి. ప్రాణం విలువను దేనితోనూ పోల్చుకోలేమని గుర్తించాలి. ప్రభుత్వాలు వివిధ కమిటీలిచ్చిన సిఫార్సులను, నిబంధనలను అమలుచేసేటట్లు చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా మనో ఉల్లాసం కల్పించే వాతావరణాన్ని ఈ సంస్థలు కల్పించాలి. వినోద కార్యక్రమాలను అప్పుడప్పుడూ ఏర్పాటు చేయాలి. స్టడీ అవర్స్‌ను బాగా కుదించాలి. విద్యార్థులు కూడా చనిపోదామనే ఆలోచన వచ్చినప్పుడు దానిని ఆదిలోనే తుంచివేయాలి. విద్యాసంస్థలు కూడా లాభాపేక్ష కొంత తగ్గించుకుని సామాజిక దృక్పథంతో ముందుకు సాగాలి. చదువుతోపాటు పిల్లలకు ఉదయం, సాయంత్రం ఆటలు ఆడుకునే వీలు కల్పించాలి.

వ్యాస రచయిత : విశ్రాంత ఆచార్యులు, ఏయూ,
సెల్ : 9849102403

భలే భలే బడాయిలే...!

ఏడూళ్ల సూరిగాడు

బి.బాబు బహదూర్

పల్లెవెలుగు బస్సు కిటకిటలాడుతోంది. కుయ్యో మొర్రో అన్నట్టు రొప్పుతోంది. డ్రైవరు పళ్లు బిగించి గేర్ మార్చుతుంటే పెళ పెళ శబ్దాలు వస్తున్నాయి. సైకిల్ వాలాలు ఓవర్‌టేక్ చేస్తుంటే..ఏడూళ్ల సూరిగాడికి విసుగుపుట్టి కిటికీలోంచి చూశాడు. పెద్ద పెద్ద చెరువులు. చిన్న చిన్న సముద్రాల్లా కనిపించాయి. అక్కడక్కడ గట్లపై కొంగలు పురుగులు ఏరుకుంటున్నాయి. పులపర్రు స్టేజీ దగ్గర పడింది. సూరిగాడు సీటులోంచి లేచి..జనాన్ని తప్పించుకుంటూ డోర్ దగ్గరకు చేరుకున్నాడు. పులపర్రులో బస్సు ఆగింది. తన మేనమామ రాజన్న ఉంటున్న చెరువు వైపు నడిచాడు. యాభై ఎకరాల చెరువు. గట్టుపై గుడిసె దగ్గరకు వెళ్లాడు. గుమ్మానికి కట్టిన ఫ్లెక్సీ తెరను పక్కకు జరిపి తొంగి చూశాడు. నులక మంచంలో రాజన్న పడుకున్నాడు. పక్కనే రమణమ్మ వల చిల్లుల్ని సరి చేస్తోంది. సూరిగాడిని చూడగాననే రాజన్న ఒక్కసారిగా లేచాడు. రమణమ్మ సంబరపడిపోయింది. "అయ్యా....ఇదేనా రాక" అడిగింది.

"ఒసేవ్ కాళ్లకి నీళ్లువ్వు" రాజన్న అరిచాడు. రమణమ్మ పరుగున గుడిసెలోంచి బయటకు వచ్చింది. చెంబుతో నీళ్లించింది. కాళ్లు కడుకున్న సూరిగాడు గుడిసెలోకి వెళ్లి మంచంపై కూర్చున్నాడు.

"బాగున్నావా" చేతిలో చెయ్యి వేసి రాజన్నను పలకరించాడు.

"అంతా బాగే" సూరిగాడి పొట్టమీద నిమిరాడు రాజన్న.

"అయ్యా అన్నం పెట్టనా... రామములక్కాయ పచ్చడి చేశా" రమణమ్మ అడిగింది.

"నీయమ్మ గిన్నిలో అన్నం పెట్టివ్వు. అన్నం తింటావా అని అడగొచ్చా, ఇన్నేళ్లొచ్చినా వివరం తెలీదా" రాజన్న కసిరాడు.

"ముసలోడికి పొగరు తగ్గలేదు, చుట్టాలు కనపడగానే రొమ్ము విరుచుకుంటుంది. ఇప్పటిదాక చచ్చిన పాములా పడుకుని, అబ్బాయి కనపడగానే మాటల్లేస్తున్నాయి" రమణమ్మ గొణిగింది. సూరిగాడు నవ్వుకున్నాడు.


"అది సరే.. ఎలా ఉన్నారు, పిల్లగాళ్లేంచేస్తున్నారు"? సూరిగాడు అడిగాడు.

"పెద్దోడు పది తప్పాడు. చిన్నోడు కాలేజీ మానేశాడు. ఇద్దరికి పెళ్లి చేశా. పెద్దోడికి ఇద్దరాడపిల్లలు. చిన్నోడికి పిల్లలు పుట్టలేదు. పెద్దోడి పిల్లలు ఇక్కడే బోర్డు స్కూలుకు పోతున్నారు. కొడుకు కోడళ్లు ఈ చెరువుల మీదే పని చేస్తున్నారు. నెలకి ఎనిమిది వేలు ఇస్తున్నారు. ఇక మేమా.. రేషన్ బియ్యం తెచ్చుకుంటున్నాం. బాతులు మేపుతున్నాం. పర్వాలేదు. అన్నానికి లోటు లేదు", రాజన్న క్లుప్తంగా మొత్తం విషయాన్ని చెప్పేశాడు. రమణమ్మ గిన్నె అందించింది. సూరిగాడు అన్నం తిన్నాడు. "కాస్త చల్ల పోసుకో..కడుపులో చల్లగుంటాది" మజ్జిగ చెంబు ఇచ్చింది. మజ్జిగ తాగాడు. చెయ్యి కడుకున్నాడు.

"అయ్యో పడుకుంది చాల్లే బాతుల్ని తోలుకురా, అబ్బాయి కాస్త నడుము వాలుస్తాడు" రమణమ్మ అనగానే మంచం పక్కనే ఉన్న ముల్లుకర్రను తీసుకుని రాజన్న బయటకు వెళ్లాడు. సూరిగాడు మంచం మీద పడుకున్నాడు. సాయంత్రం ఐదింటి వరకూ మెలుకువ రాలేదు. ఏదో పిట్టను కాల్చినట్టు కమురు వాసనతో సూరిగాడికి మెలుకువ వచ్చింది. సూరిగాడు లేచాడు.

"లేచావా? మంచం బయటేయనా"? రమణమ్మ అడిగింది.

"నువ్వొద్దులే" అంటూ సూరిగాడు నులకమంచాన్ని బయటకు తీసుకువచ్చాడు. కాస్త దూరంలో రాజన్న బాతును కాల్చి కత్తిపీటతో మాంసం కోస్తున్నాడు. సూరిగాడు మంచం మీద కూర్చొని రాజన్న, రమణమ్మనే చూస్తున్నాడు. తన కోసం వాళ్లు పడుతున్న తపనకు మురిసిపోయాడు. చీకటి పడింది. రమణమ్మ కూర వండేసింది. పెద్దోడు సత్యం, వాడి పెళ్లాం అలివేలు వచ్చారు.



"ఏం బావ ఎప్పుడొచ్చావ్" సత్యం పలకరించాడు.

"బాబాయ్ బాగున్నావా" అలివేలు అడిగింది. గట్టుమీద ఆడుకుంటున్న పిల్లల్ని పిలిచి స్నానానికి తీసుకువెళ్లింది. కాసేపటికి చిన్నోడు రవి, వాడి పెళ్లాం రత్నం వచ్చారు. అందరూ కబుర్లలో పడ్డారు. రమణమ్మ అందరికీ అన్నం పెట్టింది.

"ఒరే అన్నయ్యా ఈ ఏడాది మన బతుకులు మారిపోవాల్సిందే" రవి సీరియస్‌గా అన్నాడు.

"అంటే"?సత్యం ప్రశ్న

"సొంతిల్లు కట్టుకుందాం" రవి

"మంచిదే, మరి డబ్బో"? సత్యం తలెత్తలేదు.

"దాని సంగతి నే చూసుకుంటాలే" రవిధీమాగా. సత్యం ఉలిక్కి పడ్డాడు. రవిని నిశితంగా చూశాడు. "వీడికి ఇంత డబ్బెక్కడిది? లాటరీ కొట్టాడా? ఉమ్మడిగా ఉన్నప్పుడు డబ్బులు నొక్కేశాడా? అప్పు చేస్తాడా? సెంటు భూమిలేదు, వీడికెవ్వడిస్తాడు"? మనసులో అనుకున్నాడు.

"ట్రిపుల్ బెడ్ రూమ్ కడదాం. మనిద్దరం చెరోగదిలో, అమ్మనాన్న ఇంకో గదిలో ఉందాం. వరండాలో కలర్ టీవీ పెడదాం. డిష్ ఏంటీనా పెట్టిద్దాం".

యారా, చిన్నోడా సారా తాగావా? రాజన్న గద్దించాడు.

"లేదు", రవి తల అడ్డంగా ఊపాడు.

"పిచ్చకల్లు తాగావా"?

"ఉహూ" రవి విసుక్కున్నాడు.

"ఒసేయ్ వాసన చూడు" రాజన్న అనగానే రమణమ్మ రవి దగ్గరకు వచ్చి వాసన చూసింది.

"నిజమే తాగలేదు" రమణమ్మ రూఢీ చేసింది.

దెయ్యం పట్టిందా? లేకపోతే ఈ పిచ్చవాగుడేంది? రాజన్న కంగారుపడ్డాడు.

"అదేం కాదు, వినండి" రవి కసిరాడు.

ఎప్పటి నుంచో అమ్మకి పట్టు చీర కొనాలని ఆశ. రమణమ్మ మురిసిపోయింది. రవి పెళ్లాం రత్నం ముఖం ముడుచుకుంది.

"నీకూ కాంచీపురం పట్టు చీర తెస్తాలే, మొన్న శ్రీదేవీకి కట్టారే... అలాంటి చీరలు పది కొంటా." రత్నం వైపు చూసి రవి కన్నుకొట్టాడు. అంతే.. "మన సంగతేంటి" అన్నట్టు అలివేలు సత్యం తొడగిల్లింది.

"అబ్బ నువ్వుండవే" సత్యం విసుక్కున్నాడు.

"బాబాయ్ మాకో" పిల్లలు అడిగారు.

"మీకు జీన్స్ ప్యాంట్లు, టీ షర్టులు కొంటా. నారాయణ టెక్నోస్కూల్లో చేరుస్తా" రవి అనగానే...

"వద్దు బాబాయ్, ఆ స్కూలుకు వెళ్లం" అరిచారు.

"సరే... మీ ఇష్టం", రవి అన్నాడు.

"ఇవ్వన్నీ చెయ్యటానికి ఎన్నేళ్లు పడుతుందో" సూరిగాడు అడిగాడు.

రవి మాట్లాడలేదు.

"దొంగతనాలు, దోపిడీలు చేయకపోతే ఈ జన్మ సరిపోదు" రాజన్న అందుకున్నాడు. "రెక్కాడితేగానీ డొక్కాడదు. ఈ గొంతెమ్మ కోర్కెలేందిరా" సత్యం కోపంగా.

"సంకల్పం లేకుంటే ఏం సాధించలేం. ఇల్లు కట్టుకోవాలి, గొప్పగా బతకాలనేది నా సంకల్పం. ఏమో? ఈ చెరువు గట్లమీద లంకెబిందెలు దొరుకొచ్చు. చేపలోళ్ల బ్లాక్‌మనీ సూట్‌కేసు కనపడొచ్చు. చేతిలో చిల్లిగవ్వ లేకుండా ఇరవై నాలుగువేల కోట్ల లోటుతో చంద్రబాబు నాయుడు లక్షా తొంభై ఒక్కవేల కోట్ల బడ్జెట్ పెట్టలేదా? ఎవరెవరకి ఎంత ఇవ్వాలో చక్కగా పద్దు రాసుకున్నాడు. డబ్బులొస్తే అందరికీ ఇస్తాడు. లేకపోతే లేదు". రవి నేల చూపులు చూశాడు.

"చాల్లే బడాయి. అయాచిత డబ్బు ఆశించి గొప్పలు పోతావా? సంకల్పం ఉండాల్సిందే. కానీ సాధించటానికి మార్గం కావాలి. నేల విడిచి సాము చేస్తే ఎలా? ఆయనంటే ఓట్ల కోసం ఎన్ని ఫీట్లయినా చేస్తాడు. భారీగా రెవెన్యూ లోటుతో పాటు జాతీయ సగటు కంటే ఎక్కువ వృద్ధినీ చూపిస్తాడు. మిగిలిన రాష్ట్రాల కంటే అభివృద్ధిలో దూసుకుపోతున్నామంటాడు...జీతాలకూ డబ్బుల్లేవంటూ కేంద్రం దగ్గర జోలిపడతాడు. ఇంతగా దూసుకుపోతుంటే హోదా దేనికని కేంద్రం అంటకత్తెర వేసింది. అందుకే తింటానికి తిండి లేకపోయినా మీసాలకు సంపెంగ నూనె రాసుకోవాలనే తత్వమే మనల్ని ముంచింది" సూరిగాడు చీవాట్లు పెట్టాడు.

విశాలాంధ్ర
బతుకు
The Life
మంగళవారం
13 మార్చి 2018



ఆహారమెక్కడ!

ఈ గొర్రెల మంద ఏం చేస్తోంది? ఆహారం కోసం వెతుకుతున్నాయి. అక్కడ అసలు పచ్చదనమే కనిపించడం లేదు. మరింక ఆహారమెలా? అంటారా! నిజానికి ఇవి గడ్డి మొలిచే భూములే. ఇప్పుడు ఈ ప్రాంతమంతా మంచుతో నిండిపోయింది. అయినా అందులోనే గడ్డికోసం వెతుకున్నాయి ఈ గొర్రెలు. ఈ దృశ్యం జర్మనీలోని జోఫిన్‌జెన్‌లోది.

ఎలక్ట్రోలైట్ డ్రింక్స్....వినడానికి కొత్తగా ఉందా! ఇవి ఉప్పు, ఖనిజాలతో కూడిన పానీయాలు. వేసవిలో చెమట రూపంలో బయటకు పోయే నీటిని అదే స్థాయిలో తిరిగి శరీరానికి అందించేవే ఈ ఎలక్ట్రోలైట్ డ్రింక్స్. సోడియం క్లోరైడ్, పొటాషియం, కాల్షియం, సోడియం బై కార్బొనేట్....వీటినే ఎలక్ట్రోలైట్స్ అంటారు. సమ్మర్ సీజన్‌లో శరీరానికి అతి ముఖ్యమైనవి. ఇవి శరీరానికి తగినంత నీటిని అందించడమే కాదు కండరాలకు పుష్టిని ఇస్తాయి. శరీరంలో జరిగిన ప్రతి ప్రధానమైన జీవరసాయన క్రియలకు ఈ ఎలక్ట్రోలైట్స్ అవసరం. ఎక్కువ పని చేసినప్పుడు, ఎక్కువ చెమట పట్టినప్పుడు ఈ ఎలక్ట్రోలైట్స్‌ని శరీరానికి మరింతగా అందించాలి, లేదంటే ప్రాణాపాయ స్థితి కూడా ఏర్పడుతుంది. ఎలక్ట్రోలైట్స్ తగ్గితే గుండె లయ పెరుగుతుంది, చర్మం పాలిపోయినట్లు అవుతుంది. ఈ ఎలక్ట్రోలైట్ డ్రింక్స్ కోసం ఎక్కడికో వెళ్ళనవసరం లేదు. వీటిని ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు. పేరు కొత్తగా ఉందని భయపడనక్కర్లేదు. ఇందులో సగం పానీయాలు మనకు తెలిసినవే. వేసవిలో తీసుకోవలసిన ఆ పానీయాల గురించి ఓసారి గుర్తుచేసుకుందామా!



ఎలక్ట్రోలైట్ డ్రింక్స్ తీసుకోండి!



సిట్రస్‌జాతికి చెందిన నిమ్మ, నారింజ లాంటి పళ్ళ రసాలు అన్నీ ఈ కోవకు చెందినవే. ద్రాక్ష జ్యూస్ కూడా అద్భుతమైన ప్రయోజనాలను అందిస్తుంది. వీటిని అలాగే పళ్ళ రూపంలో తీసుకున్నా, జ్యూస్ రూపంలో తీసుకున్నా శరీరానికి కావలసిన మినరల్స్ అందుతాయి.



మీ శరీరం బ్యాటరీ అయిపోయినట్లు బాగా డౌన్ అయిపోయిందా. కొత్త శక్తి కాదు అసలు శక్తే లేనట్లుగా అనిపిస్తోందా? అయితే వెంటనే గ్లాసు నీళ్ళల్లో కొంచెం కలిపి గడగడా తాగేయండి. మీ బాడీ ఛార్జింగ్ అవుతుంది. ఎలక్ట్రోలైట్స్ కోల్పోయిన శరీరానికి ఇదే అసలు సిసలైన మందు. చెమట రూపంలో బయటకు పోయే సోడియం ఈ ఉప్పునీళ్ళ ద్వారా శరీరానికి అందుతుంది.



ఇక వేసవిలో అందరికీ అమృతంలా కనిపించేది, దివ్యౌషధంలా పనిచేసేది ఒక్కటే, తాగుతుంటే హాయిగా గొంతు దిగిపోయేది ఒకటుంది...అదే కొబ్బరినీళ్ళు. పోయిన ఎలక్ట్రోలైట్స్‌ని తిరిగి అందించే శక్తి దీనికి ఉంది. రోజూ తాగాలంటే కొంచెం ఖర్చు అవుతుంది. కానీ, వేసవి సీజన్ అంతా తాగితే మీ ఆరోగ్యానికి ఎలాంటి ఢోకా ఉండదు. కొబ్బరినీళ్ళల్లో పొటాషియం పాళ్ళు ఎక్కువ. ఇతర అవసరమైన ఎన్నో ఖనిజాలూ ఇందులో ఉన్నాయి.



పడిపోయిన ఎలక్ట్రోలైట్ స్థాయిలను పెంచేందుకు క్రాన్‌బెర్రీలూ బాగా ఉపయోగపడతాయి. తీపి, పులుపు కలగలసిన రుచితో కూడిన ఈ పండ్ల నుంచి తీసే జ్యూస్ అద్భుతమైన ఎలక్ట్రోలైట్ జ్యూసే. ఇది కిడ్నీలు, బ్లేడర్‌లనూ శుభ్రంగా ఉంచుతుంది.



ఎక్కువ పనిచేసి బాగా అలసిపోయారా? తక్షణ శక్తి అవసరమనుకుంటున్నారా? అయితే వెంటనే అల్లం రసం తీసుకోండి. దీనిని తాగడం కొంచెం కష్టమే కానీ ధైర్యం చేసి తాగేస్తే మాత్రం చాలా ప్రయోజనాలను అందిస్తుంది. అలసట కారణంగా మొరాయించిన కండరాలనూ ఉత్తేజంగా పనిచేయిస్తుంది.



నరాలు సరిగ్గా పనిచేయాలన్నా, గుండె ఆరోగ్యం పదిలంగా ఉండాలన్నా పుచ్చకాయ రసాన్ని తీసుకోండి. వేసవి సీజన్‌లో ఎక్కువగా వచ్చే ఈ పండులో శరీరానికి అత్యవసరమైన ఎలక్ట్రోలైట్స్ ఎన్నో ఉన్నాయి. పుచ్చకాయ రసం తీసుకుంటే విటమిన్స్, ఎలక్ట్రోలైట్స్ పుష్కలంగా అందుతాయి.



పొద్దున్న నుంచి సాయంత్రం దాకా ఆఫీసులో ఉండి వచ్చారా? బాగా అలసటగా ఉందా? తినడానికి, తాగడానికి ఇంట్లో రెడీగా ఏమీ లేవా? అయితే గ్లాసు నీళ్ళల్లో కొంచెం ఉప్పు, దానికి రెట్టింపు పంచదార వేసుకుని బాగా కలిపేసి తాగండి. ఇవి రెండూ కలిస్తే శక్తి కారకాలుగా మారతాయి. మంచి ఎలక్ట్రోలైట్స్ అవుతాయి. శరీరానికి కావలసిన నీటిని అందిస్తాయి. చెమట, డయేరియా కారణంగా శరీరం నుంచి పోయిన ద్రావాలను తిరిగి అందిస్తాయి.



విటమిన్ సీ, కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, విటమిన్ ఏ, ఫొలేట్ సమృద్ధిగా దొరికే పండు స్ట్రాబెర్రీ. ఇది గుండెపోటు రాకుండా ఎచూస్తుంది, కేన్సర్‌ని అడ్డుకుంటుంది. ఒత్తిడిని నివారిస్తుంది. మరి ఇన్ని ప్రయోజనాలు ఉన్న స్ట్రాబెర్రీ డ్రింక్ ఎలక్ట్రోలైట్ డ్రింక్ కాకుండా ఎలా ఉంటుంది! ఇది మామూలు డ్రింక్ కాదు పరఫెక్ట్ ఎలక్ట్రోలైట్ డ్రింక్.



కాల్షియం, పాస్ఫరస్, పొటాషియం పుష్కలంగా ఉన్న మరో పదార్థం, మనకు అతి చౌకగా లభించే పదార్థం సబ్జా గింజలు. ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్, ఆరోగ్యకరమైన పీచు పదార్థమూ ఇందులో సమృద్ధిగా ఉంటాయి. ఈ సబ్జా గింజలు నానబెట్టిన నీటిని తీసుకుంటే శరీరానికి కావలసినన్ని ఎలక్ట్రోలైట్స్ అందుతాయి. చర్మం మీద వయస్సు పైబడిన ఛాయలనూ నివారించుకోవచ్చు.



ఈ ఎలక్ట్రోలైట్స్ డ్రింక్స్‌లో చెప్పుకోవలసిన మరో డ్రింక్ ఉంది అదే...కీరదోస రసం. దీనిని కూడా పరఫెక్ట్ ఎలక్ట్రోలైట్ డ్రింక్ అని చెప్పవచ్చు. పొటాషియం, మాంగనీసు, మెగ్నీషియం ఎక్కువ. ఇది నరాల వ్యవస్థను పటిష్టంగా ఉంచుతుంది. జ్ఞాపకశక్తినీ పెంపొందిస్తుంది. ఇది కేన్సర్ ముప్పునీ నివారిస్తుంది. ఒత్తిడిని అధిగమించేలా చేస్తుంది. జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్నీ కాపాడుతుంది.

ఈ వేసవి సీజన్‌లో రోజూ వీటిలో ఏదో ఒక పానీయాన్ని తీసుకున్నా ఆరోగ్యం గురించి ఆలోచించనక్కర్లేదు. ప్రత్యేకించి జాగ్రత్తలూ తీసుకోనక్కర్లేదు. తరచుగా ఈ పానీయాలు తీసుకోండి. మీ ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోండి. వేసవి అంతా ఎంజాయ్ చేయండి.

- ఎన్ఎస్





సాధికారత కోసం...!

అది పంజాబ్ రాష్ట్రం...భటిండా ప్రాంతం...హిమ్మత్‌పురా అనే చిన్న గ్రామం. ఇక్కడ ఉండేది అంతా కలిపి 350 మందే. అంత చిన్న గ్రామం ఇది. లింగ నిష్పత్తిలోనూ ఈ గ్రామం దిగువనుంచి ఐదో స్థానంలో ఉంది. మారుమూల ప్రాంతంలో అన్ని రకాలుగా వెనుకబడి ఉన్న ఇలాంటి గ్రామంలో ఇప్పుడు మహిళలంతా కలిసి ఒక ఆలోచన చేస్తున్నారు. అదే మహిళల సాధికారతా చర్యలు. ఇందులో భాగంగా ఒక కొత్త ప్రయత్నానికీ తెర తీశారు. అదే ఇంటి బయట గుమ్మానికి ఉండే నేమ్‌ప్లేట్స్ మహిళల పేర్లతో ఏర్పాటు చేయడం. ఇప్పుడు ఈ గ్రామంలో ఏ ఇంటిని చూసినా మహిళల పేర్లతోనే నేమ్‌బోర్డులు దర్శనమిస్తున్నాయి. పంచాయితీ సభ్యురాలైన రూప్ సింగ్ ఈ నేమ్‌ప్లేట్‌లు తయారుచేయడానికి రూ. 10 వేలు ఖర్చుచేశారు. వీటిని గ్రామంలోని ప్రతి ఇంటికి అందజేశారు. "మహిళల పేర్లతో నేమ్‌బోర్డులు తయారు చేయించడమే కాదు ఆడపిల్లల చదువునూ ప్రోత్సహించే ప్రయత్నం చేస్తున్నాం. కాలేజీలకు వెళ్ళి ఉన్నతవిద్యను అభ్యసించేందుకూ ఊతమిస్తున్నాం. మా ఇంటి ఆడపిల్లలు స్వతంత్రంగా బతకాలని కోరుకుంటున్నాం" అని చెప్పారు...గ్రామసర్పంచ్ మల్కిత్ కౌర్. తమ గ్రామ సభ కూడా సామాజిక చైతన్యం నినాదంతో పనిచేస్తోందని వివరించారు.

మహిళల కోసం ఈ గ్రామ పంచాయితీ ప్రత్యేకంగా ఒక నిధిని ఏర్పాటు చేసింది. ఇందులో నుంచి గ్రామ మహిళలకు పెళ్ళి సమయంలో రూ. 5,100లు, ఆడపిల్లకు జన్మనిచ్చినప్పుడు రూ.1,100లు ఇవ్వాలని నిర్ణయించారు. ఆడపిల్లలు ఏ రంగంలోనైనా ప్రత్యేకించి విద్య లేదా క్రీడల్లో తమ నైపుణ్యాలను కనబర్చినప్పుడు వారిని వెన్నుతట్టి మరింత ప్రోత్సహించాలనీ నిర్ణయం తీసుకున్నారు. ఈ అతి చిన్న గ్రామం గురించి చెప్పుకోవలసిన విషయం ఇంకకటి ఉంది. ఇరవైఏళ్ళ క్రితం 1997లో ఈ గ్రామ పంచాయతీ ఏర్పడినప్పటి నుంచి ఇంతవరకూ అసలు ఇక్కడ ఎన్నికలు అన్నవే జరగలేదు. ఎప్పుడూ ఏకగ్రీవ ఎన్నికే. సర్పంచ్ పదవి కోసం ఎన్నికలు జరపాల్సి వచ్చిన నాలుగుసార్లూ ఇక్కడ ఏకగ్రీ ఎన్నికే జరగడం విశేషం. మొత్తం నలుగురు సర్పంచ్‌లుగా పనిచేయగా ఇందులో ఇద్దరు మహిళలూ ఉన్నారు. మారుమూల ప్రాంతంలోని అతి చిన్న గ్రామంలో మహిళలు, బాలికల అభ్యున్నతి కోసం చర్యలు తీసుకోవడం ద్వారా మహిళా సాధికారత కోసం కృషి చేయడం నిజంగా గుర్తించాల్సిన, మెచ్చుకోవాల్సిన విషయం.

అరిచేతులు, అరికాళ్ళకు చెమటలా!



కొంతమందికి అరిచేతులు, అరికాళ్ళకు ఒకటే చెమట పట్టేస్తుంటుంది. ఇది ఒక అనారోగ్య సూచనే. ఈ ఇబ్బంది వేసవిలో ఇంకాస్త ఎక్కువ ఉంటుంది. ఈ సీజన్‌లో మామూలు వాళ్ళకే చెమటలు పట్టేస్తుంటాయి. ఇక ఎప్పుడూ ఈ సమస్యతో బాధపడేవారి పరిస్థితి ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. విపరీతమైన చెమట కారణంగా నలుగురిలోకీ వెళ్ళడానికీ జంకుతారు. ఇది పనిచేసుకోవడానికి ఇబ్బందే. ఇలా అధికంగా చెమటలు పట్టడాన్ని వైద్యపరిభాషలో హైపర్ హైడ్రోసిస్. ఈ చెమట సమస్యతో బాధపడేవాళ్ళు ఇలా చేసి చూడండి.

- ఒక టీ స్పూన్ యాపిల్ సిడర్ వెనిగర్‌లో ఒక టీ స్పూన్ రోజ్‌వాటర్ వేసి కలపండి. దీనిని అరిచేతులు, అరికాళ్ళకు రాయండి.
- కప్పు నీళ్ళల్లో ఒక నిమ్మకాయ రసం కలిపి శుభ్రమైన గుడ్డని అందులో ముంచి దాంతో అరిచేతులు, అరికాళ్ళు రుద్దండి. 20 నిముషాలు అలాగే ఉంచండి.
- పెద్ద టమాటా తీసుకుని ముక్కలు చేయండి. వాటితో అరిచేతులు, అరికాళ్ళకు రాయండి.
- తడిగా లేదా తేమగా ఉన్న బ్లాక్ టీ బ్యాగ్‌లను ఐదు నిముషాలు అరిచేతుల్లో ఉంచుకోండి. రోజుకి మూడుసార్లు ఇలా చేయండి.
- గిన్నె గోరువెచ్చని నీళ్ళల్లో ఐదు చుక్కల టీ ట్రీ ఆయిల్ వేయండి. దూదిని అందులో ముంచి తీసి దాంతో అరిచేతులు, అరికాళ్ళు రుద్దండి.
- బాదం, అవకాడో, అరటిపండు, బీన్స్, జీడిపప్పు, వాల్‌నట్స్ లాంటి మెగ్నీషియం ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోండి. మెగ్నీషియం తగ్గినా చెమటలు అధికంగా పడతాయి.
- తాజా గులాబీ రేకులు తీసుకుని వాటిని గిన్నెడు నీళ్ళల్లో వేసి పావుగంట మరిగించండి. ఈ రేకుల గుజ్జు తీసుకుని అరికాళ్ళు, అరిచేతులకు రాయండి.
- కొబ్బరినూనె బాగా కాళ్ళు, చేతులకు రాసి మర్దనా చేయండి.

పిల్లలు తినటానికి మారం చేస్తున్నారా!



సాధారణంగా తల్లులు పిల్లల కోసం గంటల తరబడి వంటలు వండుతారు. పిల్లలు ఇష్టపడి తినాలని కుతూహలంతో ఎదురుచూస్తారు. తీరాచూస్తే పిల్లలు వాటిని తినడానికి ఇష్టపడరు. అసలు చూడకముందే వద్దంటారు. తల్లులకు తరచుగా ఇలాంటి సంఘటనలు ఎదురవుతూనే వుంటాయి. కొంతమంది పిల్లలు తినడమంటే అసలు ఎంత విసుగో. ఎందుకు తిననంటున్నారో ఒక పట్టాన అర్థం కాని విషయం. వాళ్ళకు తినిపించడానికి ఎన్నెన్నో ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. పిల్లలు అసలు తినకపోవడానికి, ఇష్టంగా తినకపోవడానికి కూడా కారణాలూ చాలానే ఉంటాయి. విటమిన్స్ లోపం ఉన్నా పిల్లలు తినడానికి ఆసక్తి చూపించరు. పిల్లలకు తినిపించడమే అమ్మలకు అతి కష్టమైన సమస్య అన్నా అతిశయోక్తి కాదు. ముఖ్యంగా ఏడాది నుంచి ఐదేళ్ళ లోపు పిల్లల్లోనే ఏం పెట్టినా తినకపోవడం, వద్దని మారాం చేయడం ఉంటుంది. వారి చేత తినిపించాలా...అయితే ఇలా చేయండి!

- మీ పిల్లల భోజన సమయం, స్నాక్స్ సమయం మధ్య తగినంత సమయం ఖాళీ వుందా?లేదా? భోజనం చేయడానికి ముందు ఎలాంటి చిరుతుండి పెట్టవద్దు. భోజనానికి, స్నాక్స్‌కి 3-4 గంటల సమయం ఖాళీ వుండేలా చూసుకోండి.
- మీ పిల్లల ఇష్టాఇష్టాలు తెలుసుకుని వంటలు చేయండి. వాళ్ళకి ఇష్టమైనవి వండితే కచ్చితంగా తింటారు. ఈసారి ప్రయత్నించి చూడండి.
- మీ పిల్లల శరీరానికి తగినంత వ్యాయామం వుందా? లేకపోతే వెంటనే అలవాటు చేయండి. అదికూడా సరైన వ్యాయామం చేయించండి దీంతో ఆరోగ్య సమస్యలు తగ్గి పిల్లలకు ఆకలి వేస్తుంది.
- భోజనానికి ముందు మీ పిల్లలు స్నాక్స్ తింటున్నారా? అయితే వాటిని ఆపాల్సిందే. ఇలా తినడం వల్ల ఆకలి మందగిస్తుంది. భోజనానికి అరగంట ముందు నుంచే స్నాక్స్ ఇవ్వడం ఆపండి. ఇలా చేస్తే ఆకలి కలిగి పిల్లలు సరైన ఆహారం తీసుకుంటారు.

ఇలా చేసినప్పటికి వారు తినడానికి నిరాకరిస్తున్నారా? అయితే దీనికి కొన్ని ప్రత్యేక కారణాలు ఉండి ఉంటాయి. వాటిని గ్రహించాలి. ఆ కారణాలు ఇవే...

- పిల్లల రుచి మొగ్గలు చాలా సున్నితంగా వుండడం వల్ల కూడా వారు తినరు. చాలా మంది పిల్లలు నాలుక మీద పుట్టుకతోనే ఎక్కువ రుచి మొగ్గల్ని కలిగి వుంటారు. దీన్ని వల్ల వారు వారికి సాధారణంగా వున్న భోజనం అంతగా రుచించదు. అందువల్ల వారు తినరు.
- మీ పిల్లలు తినేటప్పుడు టీ.వి చూడటం, ఫోన్‌లో ఆడటం, వీడియో గేమ్స్ ఆడటం వల్ల వారి మనస్సు స్థిమితంగా వుండదు. దీని వల్ల వారు సరిగా తినడానికి ఇష్టపడరు.
- శరీరంలో దినచర్య సరిగా జరగకపోవడం వల్ల పిల్లలు ఆహారాన్ని సరైన మోతాదులో తీసుకోరు. మలబద్దకం అనేది ప్రధాన సమస్య. దీని వల్ల పిల్లలకు ఆకలి వేయదు. ఈ సమస్య సాధ్యమైనంత తొందరగా నివారించాలి.
- చాలా రకాల వంటకాలు వున్నప్పుడు ఏది తినాలో వారికి తెలియక వారు గందరగోళంలో వుండి ఏది కూడా సరిగా తినరు. అలా ఎక్కువ వంటకాలు వారి ముందు వుంచకుండా అన్నం లేదా రోటీని మాత్రమే ఇవ్వండి.



- అనారోగ్యంగా వున్నా, లేదంటే ఆ స్థితి నుంచి కోలుకున్నా సరే ఆకలనిపించదు. ఎందుకంటే ఆ సమయంలో వారికి ఏది కూడా అంతగా రుచించదు. అలాంటప్పుడు వారికి నిర్బంధించి పెట్టడం కూడా సరైన పద్ధతి కాదు. అప్పుడు వారికి నచ్చే భోజనం ఇవ్వాలి.
- కొంతమంది పిల్లలకి ఫుడ్ అలర్జీ వుంటుంది. వారికి ఏదైనా సహించనివి తింటే వారి శరీరంలో రకరకాల ఇబ్బందులు వస్తాయి. ఇది కూడా గుర్తించి పిల్లలికి ఆహారాన్ని ఇవ్వాలి.

కొబ్బరినూనె... సహజమైన సన్‌స్క్రీన్!





ఎండలు పెరుగుతున్నాయి. ఎండధాటికి తట్టుకోలేక ఏవేవో క్రీములు రాసేస్తుంటారు. అవేవీ కాకుండా ఈసారి కొబ్బరినూనె రాసి చూడండి. అవును, ఇది సహజమైన సన్‌స్క్రీన్. సూర్యుని నుండి వచ్చే అతి నీలలోహిత కిరణాల బారి నుంచి రక్షించే సామర్థ్యం కొబ్బరినూనెకు ఉంది. ఇది సూర్యకిరణాల వేడిని 20 శాతం అడ్డుకుంటుందని ఒక అధ్యయనంలోనూ తేలింది. జుట్టు, చర్మం, పెదాలకు రాయడానికి కొబ్బరినూనె అంత దివ్యౌషధం ఇంకొకటి లేదు. ఇది మన పూర్వీకుల నుంచీ చెబుతున్న మాటే. ఆచరిస్తే దీనివల్ల లాభాలు ఏంటో తెలుస్తాయి. జుట్టు కుదుళ్ళకు బాగా పట్టిస్తే చుండ్రుతో పాటు జుట్టు రాలిపోవడాన్ని అరికడుతుంది.



జరిగిన కథ

తల వూడపడమేమిటి - అతని మీదపడి కౌగలించ్కుంటే! ఛ! అతనికీ ఊర్వశి సరసం అలవాటు లాగేవుంది. నేను అక్కడ లేకపోయివుంటే జనర్దనరావుకి ఎంత అపకారం జరిగివుండును! అతన్ని చూస్తే జాలే వేస్తుంది. నా అనేవాళ్ళు యెవ్వరూ లేరుకదా! సీతారాం చెప్పాడు - అతని తల్లి నీళ్ళ బిందెలు మోసి పైసలు కూడబెట్టి చదువు చెప్పించిందట. వాళ్ళమ్మ ఎంత మంచి ఆవిడో మరి! మా అమ్మా నాన్నా నన్ను పోషించలేక ముక్కు మొహం తెలియని పరాయివాళ్ళకి డబ్బుకి అమ్మేశారు. సీతారాం జనార్దనరావుని బాగా ఈసడిస్తూనే విసిరాడు విసుర్లు. అంతటితో వూరుకున్నాడా? "కల్ల నిజము రెండు కరకంరుడెరుగును, నీరుపల్ల మెరుగు నిజముగాను! తనయుని జన్మంబు తల్లి తానెరుగును విశ్వదాభిరామ వినురవేమ!" అని పద్యం చదివేడు. నాకే నచ్చలేదు. అతని వేళాకోళం. నీళ్ళ బిందెలు మోసిందని ఆమెకు అప్రతిష్ట అంట కడుతున్నాడు. జనార్దనరావుకి అప్రతిష్ట రాకుండా కాపాడాలని నాకుంది.

(నిన్నటి సంచిక తరువాయి)

అతను చాలా సత్యకాలం మనిషి. ఆ సేట్జీలాంటి కంట్రాక్టర్లని పెట్టుకుని లక్షలు లక్షలు విలువగల పనులు ఎలా చేయిస్తున్నాడో? వీళ్ళు అతన్ని బుట్టలో వేసి పాడు చేయడానికి యెంతేనా ప్రయత్నిస్తారుకదా? సీతారాంకూడ తన యజమాని సేట్జీతో యేకం అయి జనార్దనరావుమీద దుగ్ధ? బోలెడు డబ్బుందాయే. తండ్రికి ఒక్కడే కొడుకు. తండ్రి భారీ వ్యాపారం చేసి ఇంకా ఆర్జించి పారేస్తున్నాడు. దాన ధర్మాలు చేసి మంచి పేరు సంపాదిస్తున్నాడు. సీతారాం ఆ వేమన పద్యం నా దగ్గర చదవడం అతనికి తగినపని కాదు. లేకపోతే - జనార్దనరావు మీద నాకు ఎలాగేనా విముఖత కలిగించుదాం అనా! నాకు జనార్దనరావుతో పరిచయం వున్న విషయం తనకి తెలియనట్టు నటిస్తేనే గాని-యీ విసురు విసరడానికి అవకాశం వుండదుగా? జనార్దనం అంటే నాకు చాలా యిష్టం. ఆ - అంతే. కాని చాలా ఇష్టం. చెప్పలేనంత ఇష్టం. ఒక్కొక్కప్పుడు అతన్ని తలచుకున్నా, సినిమాలో అక్కడా అతని ప్రక్కని కూచుంటే - యేమిటో ఏడుపే వొస్తుంది. నాయుడు బావ అన్నట్టు "గుండె గొంతుకలోన కొట్టాడుతాది" నిజంగా నాతో నేను రహస్యంగా చెప్పుకోవడానికి భయం ఎందుకు? సీతారాంకి కొంచెం అసూయ కలిగిందా యేమిటి? లేకపోతే పనికట్టుకుని జనార్దనరావు మీద కొండేలు, అతని కన్నతల్లి మీద వెటకార విసుర్లు ఎందుకు? ఈమాటు ఒక ఝూడింపు ఝూడించి మరీ వదలిపెట్టాలి. కాని సీతారాం తమాషా అయిన వ్యక్తి. అతని మీద నాకు కోపం తెచ్చుకుందాం అన్నా రాదు - మరేమిటో. గమ్మత్తుగాడు. ఐదేళ్ళకిందట కదూ - అప్పుడు లండనులో అతను నాకు 'డాన్సింగు' నేర్పినప్పుడు వొళ్ళు పులకరించేది. పిమ్మీడాన్సు నేర్పుతున్నప్పుడు అతని స్పర్శ తగిలి తల తిరిగిపోయేది. కొన్నాళ్ళవరకు అదే ప్రేమ అనుకేదాన్ని. ఇప్పుడు నవ్వొస్తుంది. అతడు తన స్పోర్ట్సు కారులో నాలుగు రోజులు స్కాట్లెండు తిరిగి వద్దాం అన్నాడు. ఆ మాట అమ్మతోను, నాన్నతోను చెప్పాను. నాన్న వెళ్ళొద్దన్నారు - కాని మాట వరసకి మాత్రమే అలా అన్నారేమో ఆపద రాకుండా, శీలం చెడకుండా ప్రవర్తింప గలుగుతాను అనే ధైర్యం వుంటే వెళ్ళమంది. ఆ నాలుగు రోజులు తమాషాగానే గడిచిపోయాయి. సీతారాంకూడా పెద్దమనిషి తరహాగానే ప్రవర్తించాడు. ఒకటి రెండుసార్లు కొంచెం కుర్రచేష్టలు చేయ ప్రయత్నించినా అమ్మతో చెప్పా. అమ్మ నవ్వి, యవ్వనంలో ఆ మాత్రం రసికత వుండడం ఏం ప్రమాదం లేదులే - ఆ గీతమాత్రం దాటకుండా నీ ఆత్మగౌరవం కాపాడుకుంటూ వుంటే మరేం ఫరవాలేదులే - మదనాన్నేనాసరే - సీతారాంనైనాసరే డబ్బు చూసుకుని మరీ చేసుకోమంటారు. ఇక జనార్దనరావుతో నాకు స్నేహం వున్నట్టు తెలిస్తే వుత్తరక్షణంలో అతన్ని చేసేసుకోమంటారు. అప్పుడు నేను విశాఖపట్నం వెళ్ళినప్పుడు మదనాన్ని పెళ్ళిచేసుకుని ఏకంగా మనుగుడుపులకి అల్లుడిని ఇంటికి తీసుకురాలేదని యెంతేనా కోపం వచ్చిందాయనికి. నాముందు కనపర్చలేదు కాని. ఆ కోపం, ఆశాభంగం అంతా అమ్మమీద చూపించివుంటారు. నాన్నకి ఎందుకో అంత తాపత్రయం నేను వేగం పెళ్ళి చేసేసుకోవాలని? నా బరువు నెత్తిమీద నుంచి వదిలించుకోవాలనా? అది కాదు. డబ్బు, హోదా కావాలి నాన్నకి. నేను తెలివి తక్కువగా తిరుగులు



తిరిగి ఎవరినేనా చేసేసుకుంటే తనకి ఎక్కడ అపఖ్యాతి వస్తుందో అని బెంగ అనుకుంటాను. "కమ్యూనిస్టు డ్రైవరు అమృతరావుని పెళ్ళిచేసుకుంటాను నాన్నా!" అని గమ్మత్తుకి అంటే ఏమంటారో చూడాలి! ఆయనకి నిలువునా ప్రాణాలు యెగిరిపోతాయనకుంటాను! ఒకమాటెప్పుడో అనేస్తాను! పాపం - నాన్న!

నిన్న మధ్యాహ్నం ఆంధ్ర నాటక సమాజం సమావేశం అయింది. వచ్చే ఆగష్టులో "కన్యాశుల్కం" నాటకం వెయ్యడానికి తీర్మానించాం. శర్మగారు నన్ను పిలిచి బుచ్చమ్మ పాత్రని నువ్వు తీసుకుంటే బాగుంటుంది అన్నారు. ఆలోచించి నాలుగైదు రోజుల్లో చెపుతానన్నాను. నేను చెన్నపట్నం వొచ్చి అమ్మవాళ్ళో



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

తలదాచుకొన గలిగేవరకూ నేనుకూడా ఒక బుచ్చమ్మనే అచ్చంగా - తల చెడలేదుకాని, తల్లిదండ్రులకి బరువైపోయాను. ఇంట్లో అంతచాకిరీ చేసేదాన్ని. నన్ను పోషించడానికి వాళ్ళకి డబ్బు లేదు. చదువు చెప్పించడానికి సంస్కృతీ లేదు. ఒక కరటక శాస్త్రులు మలయాళపువాళ్ళు వేషంలో రాగానే అతని కిచ్చేశారు. దారంటపోయే ఏ గిరిశమో నా మొళ్ళో పుస్తెకట్టితే - వాడికి చాకిరీచేస్తూ, వాడికి పిల్లల్ని కంటూ వుండడానికి - నా స్థితి ఏ మెరిగినట్టు? ఆ మలయాలళం దళారీల, గిరీశాల బారినుంచి తప్పించుకుని బారిష్టరు గారింట్లో పడ్డాను. నాన్నమాత్రం ఏమిటి? "సంఘ సంస్కరణ" వృత్తిగాపెట్టుకున్న సౌజన్యారావు గారి లాగు నన్ను ఎవరితో ఒకరికి ఇచ్చి పెళ్ళి చేసేద్దాం అనే ఆయన ఉద్దేశం. ఏమిటి తేడా? గిరీశంతో లేచిపోతే - నాల్గురోజులు నా ముక్కుపచ్చలు ఆరేవరకూ నన్ను ఉపయోగించుకుంటాడు. ఆ తరువాత నన్ను ఏ మధురవాణికో ఇచ్చేస్తాడు - పెంట కుప్ప మీద విస్తరాకు పారేసినట్టు - కుక్కలు నాకుతూ మనుష్యుల కాలికింద నలుగుతూ... సంఘసంస్కర్త నాన్న మాత్రం యేమిటి? పై దాబు దర్పమూ కావాలి - అల్లుడికి వెయ్యి రూపాయల ఉద్యోగం, బ్యాంకులో రెండు లక్షలు, మోటారుకారు వుండి వాడు యేలుకోడానికి యిష్టపడితే యే మదనానికో, సీతారాంకో, తీర్థగిరికో, ఎవడికో ఒకడికి యిచ్చి వదిలించేసుకోవడమేగా! గొప్పగా పెళ్ళి చేయడం, విందులు- వేడుకులు - భోజనాలు, పత్రికల్లో సంఘ సంస్కరణ వివాహం అనో ఘరానా సమాజ శ్రేణిలో పెండ్లి అనో ఫోటోలు వేసి గొప్ప ఆదర్శవంతమైన వివాహం చేశాం అని గర్వపడడం. అంతేకాని హరిజనులని దేవాలయ ప్రవేశం చేయించినట్టు నన్ను బలవంతంగా కళ్యాణమందిర ప్రవేశం చేయిస్తే యెవరు బాగుపడ్డట్టు? నాకు పెళ్ళి ముఖ్యంకాదు - విద్య, సంస్కృతి, ఆత్మగౌరవం, ధైర్యం, ఆరోగ్యం, స్వతంత్రం- ఇవీ నాకు కావలసినవీ - నేను కోరేవీ. అంతేనేకాని మొలతాడున్నవాడి కెవడికో ఇచ్చి నన్ను కట్టబెడితే - మళ్ళీ మరోసారి నా గొంతుక కొయ్యడమేగా? ఎవడిని సంస్కరించినట్టు - నన్నా? నా మొగుణ్ణా? నా బాగుకోరి నాలో మానవత్వం వుందని గ్రహించింది ఎవరు. అమ్మ, ఆవిడె పెట్టిన ప్రసాదం - అదీ సంస్కరణ.

అప్పారావుగారు బుచ్చమ్మని గొప్ప - గంభీరమైన పాత్రగా సృష్టించారనుకుంటాను. బుచ్చమ్మ అంటే మానవ సమాజమే. ఈ మానవ సమాజంలో ఈవేళటి పీడిత ప్రజానీకం, ఒక వైపున మతోన్మాదులు, అభివృద్ధి నిరోధకులు, అగ్నిహోత్రావధాన్లు, వెంకమ్మల చేతిలో పడి, తిరోగమన శక్తులని ఎదుర్కోవలసి వస్తూంది. మరోవైపున, దోపిడి, దుర్మార్గం, క్రౌరం - గిరిశీం, కరటక శాస్త్రులు, రామప్పంతులు - యీ రాక్షస శక్తులనుంచి తప్పించుకోవాలి. మరొకవైపున సంస్కరణవాదులు మధ్యే మార్గప్రియులు ఇటువంటి సౌజ్యనరావు, మధురవాణి ఇత్యాది మితవాద ధోరణుల సత్యకాలపు జడ్జివాళ్లు - వీళ్ళ పట్టపగటి కలలకి భ్రమసిపోకుండా వుండాలి. ఈ పీడిత మానవ సమాజానికి విద్య, సంస్కృతి ఇవ్వాలి - అంతేకాని, స్త్రీ పునర్వివాహ సభలు, భగవద్గీతా సమాజాలు, విడోస్ హోమలు మొదలైన చిట్కా వైద్య చికిత్సలు కాదు బాగు చేయగలిగేవి. సాహసం, ఆత్మశక్తి, పట్టుదల, అభ్యుదయం, సమానత్వం, సౌభ్రాతృత్వం - ఇవి అవసరం. బుచ్చమ్మని ఒక మనిషిగా మార్చేవి ఇవికాని - మూడో ఫారం వరకు చదువు చెప్పించడం - పెళ్ళికోసం హార్మోనియంపాటు భరతనాట్యం సినిమాసంగీతం నేర్పించడం ముక్కు ముఖం తెలియని గెజిటెడ్ ఆఫీసరికిచ్చి సంస్కరణ వివాహం చెయ్యడం - ఇవికావు. అభ్యుదయశక్తుల కైవసం అయినప్పుడే మానవ సమాజానికి మోక్షం. బుచ్చమ్మని ఇలా అర్థం చేసుకుని పాత్ర పోషణ చేస్తాను. నటిస్తాను. నేను గిరీశాన్ని మోపించగలనా? గిరీశం అచ్చమైన భూస్వామ్య వ్యవస్థయొక్క పతనావస్థలో పుట్టినవాడు. చదువులేదు. సంస్కృతీ సున్న. ఇంగ్లీషు యెంగిలి ముక్కలు మాత్రం నాలుగువచ్చు. బుగ్గని కారా కిల్లీ, నోట చుట్టపీకే, బేవర్సుగా దొరికితే దిండిగల్ సిగర్ లేకపోతే యేది దొరికితే అదే. గేరా, గిరజా, జునపాలు, మీసకట్టు, సన్నటి లాల్చీ సైకిల్ కచ్చ, చుట్టతాగుడికి ఆరిపోయిన గుండెలు, దుర్వ్యసనాలకి ఆలవాలమైన శరీరం, చేతితో కానీ లేదు. గౌరవమైన జీవనోపాధిలేదు. పూటకూళ్ళమ్మకి అరువు, సానిదాన్ని పక్కని పెట్టుకుని తీయించుకున్న ఫోటోగ్రాపుకీ అరువే! కొసకి సానిదానికి అరువేనట. దుర్మార్గం, మోసం, దంబం. ప్రైవేటు చెపుతానని కుదురుకుని ఆ వెర్రివెంగళాయికి చదువు చెప్పడంపోయి వాడికి అబద్ధాలు నేర్పించడం, వాడికి చుట్ట అబ్బేటట్టు చెయ్యడం, అమాయకురాలు అయిన వాడి అక్కని వలలో వేసుకుని దాని గొంతుక కోయడానికి పూనుకోవడం - ఇలాంటి దుర్మార్గుడిని ఎలా ప్రేమిస్తాను? వాడి మూర్తిలో ఏం సౌందర్యం వుంటుంది? వాడి ముఖంలో ఏం వర్చస్సు కనిపిస్తుంది? వాడి కళ్ళల్లో ఏం తేజస్సు ప్రకాశిస్తుంది? "అయ్యా, మీరు చల్దివన్నం తింటారా?" అని అడగడంలో బుచ్చమ్మ నోరు తెరుచుకుని ఆశ్చర్యపడి చిరునవ్వు ముఖంతో అడగలేదు. ఏవగించుకున్న ముఖంతో, అసహ్యంతో కనుబొమలు చిట్లించుకుంటూ, ధుమ ధుమలాడుతున్న చూపులతోనే గిరిశాన్ని అల్పుడు అని గ్రహించేస్తుంది. కౌమారంలోంచి యవ్వనంలోకి వస్తూంది. సహజమయిన శీలం వుంది. వీడు యోగ్యుడు కాడు, వీడు కాపురుషుడు అని ఆ అమ్మాయి అంతరాత్మ చెపుతుంది.

- ఇంకా వుంది.

ఢిల్లీ పోలీస్, సాయుధ దళాల్లో 1223 పోస్టులు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్సీ)... సాయుధ దళాలు (సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్బీ, సీఐఎస్ఎఫ్), ఢిల్లీ పోలీస్ విభాగంలోని 1,223 ఎస్ఐ పోస్టులకు, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్)లోని ఏఎస్ఐ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదల చేసింది.



పోస్టులు : సబ్ ఇన్స్పెక్టర్ (ఎస్ఐ), అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ (ఏఎస్ఐ).
విభాగాల వారీ ఖాళీలు : ఢిల్లీ పోలీస్ విభాగంలో ఎస్ఐ-150 (పురుషులు-97+మహిళలు-53); సాయుధ దళాల్లో ఎస్ఐ పోస్టులు : సీఆర్పీఎఫ్లో 274 (పురుషులు), బీఎస్ఎఫ్లో 508 (పురుషులు-483+ మహిళలు-25), ఐటీబీపీలో 85 (పురుషులు-72+మహిళలు-13), ఎస్ఎస్బీలో 206 (పురుషులు).
వేతన శ్రేణి : ఎస్ఐ-రూ.35,400-1,12,400; ఏఎస్ఐ-29,200-రూ.92,300.
అర్హతలు : ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఢిల్లీ పోలీస్ విభాగంలోని ఎస్ఐ పోస్టుల పురుష అభ్యర్థులకు అదనంగా ఎల్ఎంవీ డ్రైవింగ్ లైసెన్స్ (మోటార్ సైకిల్, కారు) ఉండాలి.
వయసు : 2018, ఆగస్టు 1 నాటికి 20-25 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
ఎంపిక విధానం : రాతపరీక్ష (పేపర్-1, పేపర్-2), ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్ (పీఎస్టీ), ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్ (పీఈటీ), డిటైల్డ్ మెడికల్ ఎగ్జామినేషన్. పేపర్-1లో ఉత్తీర్ణులైన వారికి పీఈటీ, పీఎస్టీ నిర్వహిస్తారు. వీటిలో ఉత్తీర్ణులైన వారికి మాత్రమే పేపర్-2 ఎగ్జామినేషన్ ఉంటుంది. రెండు పేపర్లలోనూ వచ్చిన మార్కుల మెరిట్ ఆధారంగా మెడికల్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు. అనంతరం డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఉంటుంది.
రాతపరీక్ష విధానం : దీన్ని రెండు పేపర్లుగా ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. పేపర్-1లో నాలుగు విభాగాలు.. జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, జనరల్ నాలెడ్జ్ అండ్ జనరల్ అవేర్నెస్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్ కాంప్రెహెన్షన్ ఉంటాయి. ఒక్కో విభాగం నుంచి 50 ప్రశ్నల చొప్పున మొత్తం 200 ప్రశ్నలు ఇస్తారు. మొత్తం గరిష్ట మార్కులు 200. పరీక్ష వ్యవధి 2 గంటలు. పేపర్-2లో ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రెహెన్షన్ నుంచి 200 ప్రశ్నలు 200 మార్కులకు ఇస్తారు. పేపర్-2 పరీక్ష వ్యవధి రెండు గంటలు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీల్లో మాత్రమే ఉంటుంది. రెండు పేపర్లలోనూ ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కు చొప్పున కోత విధిస్తారు.
శారీరక ప్రమాణాలు (ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్: పీఎస్టీ) : ఎత్తు-ఎస్టీ (పురుష) అభ్యర్థులకు 162.5 సెం.మీ., మిగిలిన కేటగిరీ పురుషులకు 170 సెం.మీ., ఛాతీ-ఎస్టీ (పురుషుల)కు 77 సెం.మీ. (సాధారణం)-82 సెం.మీ. (గాలి పీల్చినపుడు); మిగిలిన కేటగిరీల పురుషులకు 80 సెం.మీ. (సాధారణం)-85 సెం.మీ. (గాలి పీల్చినపుడు); ఎస్టీ (మహిళ)లకు ఎత్తు-154 సెం.మీ., మిగిలిన కేటగిరీ మహిళలకు-157 సెం.మీ. అలాగే అందరు అభ్యర్థులకూ ఎత్తుకు అనుగుణంగా బరువు ఉండాలి. తగిన దృష్టి సామర్థ్యం (ఎన్ 6, ఎన్ 9; 6/6, 6/9), శారీరక, మానసిక ఆరోగ్యం, వినికిడి శక్తి ఉండాలి. టాటూ (పచ్చబొట్లు) ఉండకూడదు.
దేహ దారుఢ్య పరీక్ష (ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్: పీఈటీ) : పరుగు-100 మీటర్ల దూరాన్ని పురుషులు 16 సెకన్లలో, మహిళలు 18 సెకన్లలో పూర్తిచేయగలగాలి. అలాగే 1.6 కి.మీ. దూరాన్ని పురుషులు 6.5 నిమిషాల్లో, మహిళలు 800 మీటర్ల దూరాన్ని 4 నిమిషాల్లో పరిగెత్తగలగాలి; లాంగ్జంప్-పురుషులు 3.65 మీటర్ల దూరాన్ని, మహిళలు 2.7 మీటర్ల దూరాన్ని మూడు అవకాశాల్లోపు అధిగమించాలి; హైజంప్-పురుషులు 1.2 మీటర్ల ఎత్తును, మహిళలు 0.9 మీటర్ల ఎత్తును మూడు అవకాశాల్లోపు దూకగలగాలి; షాట్పుట్ (పురుషులకు మాత్రమే)-16 ఎల్బీఎస్ను 4.5 మీటర్ల దూరానికి 3 అవకాశాల్లోపు విసరగలగాలి.
దరఖాస్తు రుసుం : రూ.100; ఎస్సీ/ ఎస్టీ/ మహిళ/ మాజీ సైనికోద్యోగ కేటగిరీలకు ఫీజు లేదు.
దరఖాస్తు విధానం : ఆన్లైన్.
దరఖాస్తు చివరి తేదీ : ఏప్రిల్ 2, 2018.
వెబ్సైట్ : www.ssc.nic.in, www.ssconline.nic.in

ఈఎస్ఐసీ సనత్నగర్లో 52 ఉద్యోగాలు

హైదరాబాద్లోని సనత్నగర్లో ఉన్న ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) మెడికల్ కాలేజీ, హాస్పిటల్స్లోని 52 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదలైంది.



పోస్టులు-ఖాళీలు : ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీలో ట్యూటర్స్-3 (పాథాలజీ), సీనియర్ రెసిడెంట్స్-9 (జనరల్ మెడిసిన్-3+జనరల్ సర్జరీ-1+ ఆర్థోపెడిక్స్-1+అప్తాల్మాలజీ-1+ఓబీజీవై-1+అనస్థీసియా-1+ రేడియాలజీ-1), జూనియర్ రెసిడెంట్స్-8 (జనరల్ మెడిసిన్-1+జనరల్ సర్జరీ-2+అప్తా ల్మాలజీ-2+టీబీ/ ఛాతీ-1+సైకియాట్రీ-1+ పీడియాట్రిక్స్-1); ఈఎస్ఐసీ హాస్పిటల్లో సీనియర్ రెసిడెంట్స్-15 (ఐసీయూ-5+ జనరల్ మెడిసిన్-3+ జనరల్ సర్జరీ-3+ పీడియాట్రిక్స్-2+ఆర్థోపెడిక్స్-2); ఈఎస్ఐసీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో సీనియర్ రెసిడెంట్స్-17 (అనస్థీసియా-6+ రేడియాలజీ-2+కార్డియాలజీ-2+ పీడియాట్రిక్స్ సర్జరీ-2+యూరాలజీ-1+ న్యూరో సర్జరీ-3+పీడియాట్రిక్ క్రిటికల్ కేర్-1).
వేతనం : ట్యూటర్స్, జూనియర్ రెసిడెంట్స్-రూ.74,000; సీనియర్ రెసిడెంట్స్-రూ.88,000.
అర్హతలు : సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి ఎంబీబీఎస్/ ఎంబీబీఎస్పీజీ డిగ్రీ/ పీజీ డిప్లొమా/ మెడికల్ ఎంఎస్సీ. అలాగే ఎంసీఐ, స్టేట్ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్, నిబంధనల మేర అనుభవం ఉండాలి.
వయసు : దరఖాస్తు గడువు ముగిసే నాటికి సీనియర్ రెసిడెంట్స్కు 35, జూనియర్ రెసిడెంట్స్, ట్యూటర్స్కు 30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
ఎంపిక : షార్ట్ లిస్టింగ్, వాకిన్ ఇంటర్వ్యూ. ఆన్లైన్ దరఖాస్తులను పరిశీలించి అభ్యర్థుల అకడమిక్ స్కోర్, బోధనానుభవం, కో-కరిక్యులర్ యాక్టివిటీస్, పరిశోధన, నీట్ పీజీ-2018, నీట్ సూపర్ స్పెషాలిటీ స్కోర్-2017 ఆధారంగా 1:10 నిష్పత్తిలో మెరిట్ జాబితా తయారుచేసి వాకిన్ ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను వెబ్సైట్లో పొందుపరుస్తారు. ఇంటర్వ్యూలో చూపిన ప్రతిభ ఆధారంగా తుది ఎంపిక ఉం టుంది.
దరఖాస్తు రుసుం : రూ.225; ఎస్సీ/ ఎస్టీ/ మహిళ/ దివ్యాంగ/ మాజీ సైనికోద్యోగ/ ఈఎస్ఐసీ రెగ్యులర్ క్యాండిడేట్స్ కేటగిరీలకు ఫీజు లేదు.
దరఖాస్తు విధానం : ఆన్లైన్.
దరఖాస్తు చివరి తేదీ : మార్చి 16, 2018.
వాకిన్ ఇంటర్వ్యూ తేదీలు (షార్ట్ లిస్టింగ్ అభ్యర్థులకు మాత్రమే) : పోస్టులు, విభాగాల వారీ మార్చి 20-31, ఏప్రిల్ 2-9, 2018.
వెబ్సైట్ : www.esicmchyd.ac.in

పుణె కంటోన్మెంట్ బోర్డ్లో 77 ఖాళీలు

కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని పుణె కంటోన్మెంట్ బోర్డ్ (పీసీబీ)... 77 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టు-ఖాళీలు : అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ (ఏఎంవో)-4; జూనియర్ ఇంజనీర్ (జేఈ)-4 (సివిల్-3ఎలక్ట్రికల్-1); ఇంగ్లిష్ మీడియం స్కూల్ టీచర్స్-26 (బీఈడీ-10+డీఈడీ-16); హెల్త్ ఇన్స్పెక్టర్ (హెచ్ఐ)-3; స్టాఫ్నర్స్-8; ల్యాబ్ టెక్నీషియన్ (ఎల్టీ)-2; జూనియర్ క్లర్క్స్-18; డ్రైవర్-10; హిందీ టైపిస్ట్-1; హెల్త్ అసిస్టెంట్-1.
వేతనం : ఏఎంవో, జేఈ, ఇంగ్లిష్ మీడియ టీచర్స్ (బీఈడీ), స్టాఫ్ నర్స్, -రూ.9,300-రూ.34,800; మిగిలిన పోస్టులకు రూ.5,200-రూ.20,200. పోస్టును బట్టి గ్రేడ్ పే వేర్వేరుగా ఉంటుంది.
అర్హతలు : సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి ఎంబీబీఎస్/ ఇంజనీరింగ్ డిప్లొమా/ బీఈ/ బీఏ.బీఈడీ (ఇంగ్లిష్/ సోషల్ స్టడీస్/ హిందీ/బీ.పీ.ఈడీ)/ బీఎస్సీ.బీఈడీ/ హెచ్ఎస్సీ.డీఈడీ/ బీఎస్సీ (కెమిస్ట్రీ)+డిప్లొమా (శానిటరీ ఇన్స్పెక్టర్)/ బీఎస్సీ (నర్సింగ్/ జనరల్ నర్సింగ్)/బీఎస్సీ (ఫిజిక్స్/కెమిస్ట్రీ)+ ల్యాబ్టెక్నీషియన్ కోర్స్/ ఇంటర్మీడియెట్/ పదోతరగతి. అలాగే పోస్టును బట్టి అనుభవం, కంప్యూటర్ ప్రత్యేకాంశాల్లో నైపుణ్యం, టైపింగ్ (హిందీ) తదితర అర్హతలుండాలి.
వయసు : ఏఎంవోకు 18-30 ఏళ్ల లోపు; మిగిలిన పోస్టులకు 18-25 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
ఎంపిక : రాతపరీక్ష.
దరఖాస్తు విధానం : ఆన్లైన్.
దరఖాస్తు చివరి తేదీ : ఏప్రిల్ 7, 2018.
వెబ్సైట్ : www.punecantonmentboard.org

ఎయిమ్స్ రిషికేశ్లో 223 ఖాళీలు

ఉత్తరాఖండ్లోని రిషికేశ్లో ఉన్న ఆలిండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)... 223 బోధన ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.



పోస్టు-ఖాళీలు : ప్రొఫెసర్-31, అడిషనల్ ప్రొఫెసర్-36, అసోసియేట్ ప్రొఫెసర్-75, అసిస్టెంట్ ప్రొఫెసర్-81.
వేతనశ్రేణి : ప్రొఫెసర్, అడిషనల్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్-రూ.37,400-రూ.67,000; అసిస్టెంట్ ప్రొఫెసర్-రూ.15,600-రూ.39,100. పోస్టును బట్టి గ్రేడ్ పే వేర్వేరుగా ఉంటుంది.
విభాగాలు : అనస్థీసియాలజీ, అనాటమీ, బర్న్స్ అండ్ ప్లాస్టిక్ సర్జరీ, కార్డియాలజీ, కార్డియో థొరాసిక్ సర్జరీ, కమ్యూనిటీ మెడిసిన్/ ఫ్యామిలీ మెడిసిన్, డెంటిస్ట్రీ, డెర్మటాలజీ, ఎండోక్రినాలజీ అండ్ మెటబాలిజం, ఈఎన్టీ, ఫోరెన్సిక్ మెడిసిన్/ టాక్సికాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, మెడికల్ ఆంకాలజీ/ హెమటాలజీ, మైక్రోబయాలజీ, నియోనటాలజీ, నెఫ్రాలజీ, న్యూరోసర్జరీ, న్యూక్లియర్ మెడిసిన్, గైనకాలజీ, అప్తాల్మాలజీ, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్ సర్జరీ, పీడియాట్రిక్స్, పాథాలజీ/ ల్యాబ్ మెడిసిన్, ఫార్మకాలజీ, ఫిజికల్ మెడిసిన్ అండ్ రిహాబిలిటేషన్, ఫిజియాలజీ, సైకియాట్రీ, పల్మనరీ మెడిసిన్, రేడియో డయాగ్నసిస్, సర్జికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీ, సర్జికల్ ఆంకాలజీ, ట్రాన్స్ఫ్యూజన్ మెడిసిన్ అండ్ బ్లడ్ బ్యాంక్, ట్రామా సర్జరీ, ఎమర్జెన్సీ మెడిసిన్, యూరాలజీ.
అర్హతలు: మెడికల్/ డెంటల్ అభ్యర్థులకు సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి ఎంబీబీఎస్/ బీడీఎస్తోపాటు పీజీ (ఎండీ/ ఎంఎస్/ ఎండీఎస్/ఎంసీహెచ్/ డీఎం..); నాన్ మెడికల్ అభ్యర్థులకు పీజీతోపాటు పీహెచ్డీ. అలాగే పోస్టులను బట్టి నిబంధనల మేర బోధనానుభవం ఉండాలి.
ఎంపిక : ఇంటర్వ్యూ.
దరఖాస్తు రుసుం: రూ.3,000; ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు లేదు.
దరఖాస్తు విధానం : ఆన్లైన్.
దరఖాస్తుల ప్రారంభం : మార్చి 17, 2018.
దరఖాస్తు చివరి తేదీ : ఏప్రిల్ 30, 2018.
వెబ్సైట్ : www.aiimsrishikesh.edu.in



నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ విండ్ ఎనర్జీలో 13పోస్టులు

చెన్నైలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ విండ్ ఎనర్జీ (ఎన్ఐడబ్ల్యూఈ)... 13 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టు-ఖాళీలు : ప్రాజెక్ట్ ఇంజనీర్ (పీఈ)-9 (సీఈ-3ఎపీ-1+జీఐఎస్-1+ఎంఈ-1+ఈఈ-1+ఈఎల్-2); ప్రాజెక్టు ఆఫీసర్ (పీవో)-1 (అకౌంట్స్); జూనియర్ ఇంజనీర్ (జేఈ)-2; జూనియర్ ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ (జేఈఏ)-1 (స్టెనో-టైపిస్ట్).
వేతనం : పీఈ, పీవో-రూ.50,000-రూ.60,000; జేఈ-రూ.35,000; జేఈఏ-రూ.25,000.
వయసు : దరఖాస్తు గడువు ముగిసే నాటికి పీఈ, పీవో పోస్టులకు 35 ఏళ్లు; జేఈ, జేఈఏ పోస్టులకు 28 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
ఎంపిక: టెస్ట్/ఇంటర్వ్యూ.
దరఖాస్తు విధానం : ఆఫ్లైన్.
దరఖాస్తు చేరడానికి చివరి తేదీ : మార్చి 28, 2018.
వెబ్సైట్ : niwe.res.in

ఎయిమ్స్ రాయ్బరేలీలో 31 పోస్టులు

ఉత్తరప్రదేశ్లోని రాయ్బరేలీలో ఉన్న ఆలిండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో 31 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ చండీగఢ్లోని పోస్ట్గ్రాడ్యుయేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (పీజీఐఎంఈఆర్) ప్రకటన విడుదల చేసింది. ఎయిమ్స్ రాయ్బరేలీకి పీజీఐఎంఈఆర్-చండీగఢ్ మెంటార్ ఇన్స్టిట్యూట్గా వ్యవహరిస్తోంది.



పోస్టు-ఖాళీలు : గ్రూప్ 'ఎ'లో అకౌంట్స్ ఆఫీసర్ (ఏవో)-1; గ్రూప్ 'బి'లో స్టాఫ్ నర్స్ గ్రేడ్ 2/నర్సింగ్ ఆఫీసర్-15, స్టోర్ కీపర్-1, జూనియర్ ఇంజనీర్ (జేఈ)-2 (ఎలక్ట్రికల్-1+ఏసీ అండ్ ఆర్-1), టెక్నికల్ అసిస్టెంట్/టెక్నీషియన్-4, టెక్నికల్ ఆఫీసర్ (ఆప్తాల్మిక్)(రిఫ్రాక్షనిస్ట్)-1, టెక్నికల్ ఆఫీసర్ (డెంటల్ టెక్నీషియన్)-1; గ్రూప్ 'సి'లో జూనియర్ మెడికల్ రికార్డ్ ఆఫీసర్ (రిసెప్షనిస్ట్)-1; ల్యాబ్ టెక్నీషియన్-1; ఫార్మసిస్ట్ గ్రేడ్ 2-2; స్టెనోగ్రాఫర్-3; స్టోర్ కీపర్ కం క్లర్క్-2.
వేతన శ్రేణి : గ్రూప్ 'ఎ' పోస్టులకు రూ.15,600-రూ.39,100; గ్రూప్ 'బి'-రూ.9,300-రూ.34,800; గ్రూప్ 'సి'-రూ.5,200-రూ.20,200.
అర్హతలు : సంబంధిత పోస్టులు, విభాగాలను బట్టి బీకాం/ బీఎస్సీ (ఆనర్స్) నర్సింగ్/ బీఎస్సీ (నర్సింగ్/ పోస్ట్ సర్టిఫికెట్/ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ/ ఆప్తాల్మిక్ టెక్నిక్స్/ మెడికల్ రికార్డ్స్)/ పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్/ డిప్లొమా (నర్సింగ్ అండ్ మిడ్వైఫరీ/ ఫార్మసీ/ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ)/ డిగ్రీ/పీజీ డిగ్రీ/పీజీ డిప్లొమా/ ఇంటర్మీడియెట్. అలాగే నిబంధన మేరకు సంబంధిత రంగంలో అనుభవం తదితర అర్హతలుండాలి.
వయసు : అకౌంట్స్ ఆఫీసర్, టెక్నికల్ ఆఫీసర్ (డెంటల్ టెక్నీషియన్), జూనియర్ మెడికల్ రికార్డ్ ఆఫీసర్ (రిసెప్షనిస్ట్) పోస్టులకు 21-35 ఏళ్ల లోపు; స్టాఫ్ నర్స్/ నర్సింగ్ ఆఫీసర్, టెక్నికల్ ఆఫీసర్ (ఆప్తాల్మిక్), ల్యాబ్ టెక్నీషియన్కు 21-30; స్టోర్ కీపర్కు 18-35 ; టెక్నికల్ అసిస్టెంట్/ టెక్నీషియన్కు 25-35; ఫార్మసిస్ట్ గ్రేడ్ 2కు 21-27; స్టెనోగ్రాఫర్కు 18-27 ఏళ్ల లోపు ఉండాలి. జేఈ, స్టోర్ కీపర్ కం క్లర్క్కు 30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
ఎంపిక : రాతపరీక్ష, ఇంటర్వ్యూ.
దరఖాస్తు రుసుం: ఎస్సీ/ ఎస్టీ-రూ.500; మిగిలిన కేటగిరీలకు రూ.1,000. దివ్యాంగ కేటగిరీకి ఫీజు లేదు.
దరఖాస్తు విధానం : ఆన్లైన్.
ఫీజు చెల్లింపునకు చివరి తేదీ : మార్చి 26, 2018.
దరఖాస్తుకు చివరి తేదీ : మార్చి 28, 2018.
వెబ్సైట్ : www.pgimer.edu.in

ఎయిర్ఫోర్స్ ఏఎఫ్సీఏవోలో 16 పోస్టులు

ఇండియన్ ఎయిర్ఫోర్స్కు చెందిన ఎయిర్ ఫోర్స్ సెంట్రల్ అకౌంట్స్ ఆఫీస్ (ఏఎఫ్సీఏవో).. 16 గ్రూప్ 'సి' ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదల చేసింది.
పోస్టు-ఖాళీలు : లోయర్ డివిజన్ క్లర్క్ (ఎల్డీసీ)-14 (అన్రిజర్వ్డ్-7+ ఎస్సీ-4+ఓబీసీ-3); మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (ఎంటీఎస్)-1 (అన్రిజర్వ్డ్); హౌస్ కీపింగ్ స్టాఫ్ (హెచ్కేఎస్)-1 (అన్రిజర్వ్డ్).
వేతనశ్రేణి : రూ.5,200-రూ.20,200.
అర్హతలు : ఎల్డీసీకి ఇంటర్మీడియెట్/తత్సమాన విద్యతోపాటు టైపింగ్ (ఇంగ్లిష్/హిందీ); ఎంటీఎస్, హెచ్కేఎస్కు పదోతరగతి/తత్సమాన విద్య.
వయసు : 18-25 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
ఎంపిక : రాతపరీక్ష.
రాతపరీక్ష విధానం : దీన్ని నాలుగు పేపర్లుగా నిర్వహిస్తారు. ఇందులో ఎల్డీసీకి జనరల్ ఇంటెలిజెన్స్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, న్యూమరికల్ ఆప్టిట్యూడ్, జనరల్ అవేర్నెస్ నుంచి ప్రశ్నలు ఇస్తారు. ఇవి ఇంటర్మీడియెట్ స్థాయిలో ఉంటాయి. మిగిలిన పోస్టులకు పదోతరగతి స్థాయిలోని జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, జనరల్ ఇంగ్లిష్, న్యూమరికల్ ఆప్టిట్యూడ్, జనరల్ అవేర్నెస్ నుంచి ప్రశ్నలు ఉంటాయి.
దరఖాస్తు విధానం : ఆఫ్లైన్.
దరఖాస్తు చేరడానికి చివరి తేదీ : ఎంప్లాయిమెంట్ న్యూస్లో నోటిఫికేషన్ వెలువడిన 30 రోజుల్లోపు.
వెబ్సైట్ : www.indianairforce.nic.in

విశాలాంధ్ర బిజినెస్

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	బంగారం (విశాఖపట్నం) / ప్రొద్దుటూరు	వెండి (విజయవాడ)	వెండి (విశాఖపట్నం) / ప్రొద్దుటూరు	డాలరు Vs రూపాయి
610.80 ▲	194.55 ▲	150 ▲		-100 ▼		
33,917.94	10,421.40	29,200 (22 క్యారెట్లు, 10 గ్రాములు)	29,110 / 29,110 (22 క్యారెట్లు, 10 గ్రాములు)	39,400 (కిలో (రూపాయల్లో))	41,500 / 41,529 (కిలో (రూపాయల్లో))	65.04

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
భారతీ ఎయిర్‌టెల్	420.75	4.68
ఎన్‌టీపీసీ	171.00	4.33
ఐటీసీ	270.00	4.09
టాటా మోటార్స్	353.05	3.07
టాటా స్టీల్	626.00	2.82

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
కోల్ ఇండియా	297.80	-2.26
ఎస్‌బీఐ	252.85	-0.12

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	65.17	65.04
యూరో	80.15	79.96
పౌండ్	90.16	90.15
ఆస్ట్రేలియా డాలర్	50.80	51.13
సింగపూర్ డాలర్	49.45	49.46

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	29,110	31,133
చెన్నై	29,110	31,133
బెంగళూరు	28,550	30,534
ముంబై	29,850	31,925
విజయవాడ	29,200	31,300
విశాఖపట్నం	29,110	31,133
ప్రొద్దుటూరు	29,110	30,570
ముడి చమురు		63.61

లక్షలాది ఉద్యోగాలు మాయం

- రెండేళ్లలో ఖాదీ పరిశ్రమలో 7 లక్షల మందికి కరువైన ఉపాధి
- కార్మికుల పొట్టకొడుతున్న మోడల్ చరఖాలు




న్యూఢిల్లీ: ఖాదీ పరిశ్రమలో ఉపాధి అవకాశాలు కరువవుతున్నాయి. ఉత్పత్తి పెరుగుతున్నా.. ఉద్యోగాలు మాత్రం అంతరించిపోతున్నాయి. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల (ఎంఎస్ఎంఈ) మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం 2015-16, 2016-17 మధ్య ఏకంగా ఏడు లక్షల కొలువులు మాయమైపోయాయి. ఖాదీ రంగంలో ఉపాధి పొందుతున్నవారి సంఖ్య ఈ రెండేండ్లలో 11.6 లక్షల నుంచి 4.6 లక్షలకు పడిపోయినట్లు లోక్‌సభకు సదరు మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అయితే ఇదే వ్యవధిలో ఖాదీ ఉత్పత్తి 31.6 శాతం, అమ్మకాలు 33 శాతం పెరుగడం గమనార్హం. ఇక కొత్త రకం చరఖాలు.. ఖాదీ కళాకారుల జీవనోపాధిని దెబ్బతీస్తున్నాయని ఖాదీ, గ్రామీణ పరిశ్రమల సంఘం (కేవీఐసీ) చెబుతున్నది. సంప్రదాయ చర్ఖాల స్థానంలో పరిచయమైన కొత్త రకం చరఖాలు .. కొన్ని ఉద్యోగాలను హరించాయని కేవీఐసీ అంగీకరించింది. ఇంతకుముందు సంప్రదాయ స్పిన్నర్లే ఉండేవని, వీటిపై ఎక్కువ మంది పనిచేసేవారన్న కేవీఐసీ.. కొత్త రకం చరఖాల రాకతో పాత కార్మికులకు పని కరువైందని చెప్పింది. అయితే ఇలా ఉపాధి కోల్పోయిన వారెందరుంటారన్నదానిపై అటు ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ నుంచిగానీ, ఇటు కేవీఐసీ నుంచిగానీ స్పష్టమైన సమాచారం లేదు. అంతేగాక 2015-16 వరకున్న ఉపాధి గణాంకాలు ఖాదీ రంగంలోని వాస్తవ పరిస్థితికి అద్దం పట్టలేదంటున్న కేవీఐసీ.. ఇందుకు కారణం కొత్తగా వచ్చిన ఉద్యోగాల వివరాల్ని మాత్రమే పరిగణనలోకి తీసుకున్నారని, పోయిన ఉద్యోగ వివరాల్ని పొందుపర్చలేదని అంటున్నది. ఇదిలావుంటే 2015-16 నుంచి 2016-17 వరకు ఖాదీ రంగంలో ఉపాధి కోల్పోయిన 6.8 లక్షల మందిలో 3.2 లక్షల మంది ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లతో కూడిన సెంట్రల్ జోన్‌వారే. బీహార్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఒడిషా, అండమాన్ నికోబార్‌లతో ఉన్న తూర్పు జోన్‌లో సుమారు 1.2 లక్షల మందికి ఉపాధి దూరమైంది.

తగ్గిపోతున్న పీఎంఈజీపీ ఉపాధి కల్పన

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017-18)లో ప్రధాన మంత్రి ఉద్యోగ సృష్టి కార్యక్రమం (పీఎంఈజీపీ) కింద ఉపాధి కల్పన కూడా తగ్గిందని అధికారిక లెక్క లు చెబుతున్నాయి. 2015-16లో దాదాపు 3.2 లక్షల మందికి ఉపాధి అవకాశాల్నిచ్చిన పీఎంఈజీపీ.. 2016-17లో 4.1 లక్షల మందికి ఉద్యోగాల్నిచ్చింది. ఈ క్రమంలో ఈ ఆర్థిక సంవత్సరం తొలి పది నెలల్లో (ఏప్రిల్-జనవరి) 2.5 లక్షల మందికి మాత్రమే పీఎంఈజీపీ కింద ఉపాధి లభించినట్లు లోక్‌సభలో కేంద్రం తెలిపిన వివరాలనుబట్టి తెలుస్తున్నది. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఇదే వ్యవధిలో పీఎంఈజీపీ ప్రాజెక్టుల సంఖ్యా 53,000ల నుంచి 31,000 పడిపోవడం గమనార్హం. పీఎంఈజీపీ అనేది రుణ ఆధారిత రాయితీ పథకం. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంపొందించడానికి కొత్తగా ఏర్పాటుచేసే సూక్ష్మ సంస్థలకు పీఎంఈజీపీ అండగా నిలుస్తుంది.

ర్యాలీ సృష్టించిన మార్కెట్లు

- 655 పాయింట్లు లాభంతో సెన్సెక్స్
- నిఫ్టీ 194.55 పాయింట్లు



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగిసాయి. ఏకంగా 655.34 పాయింట్లకు ఎగబాకి 33, 962.48 పాయింట్లనమోదు చేయగా నిఫ్టీ 194.55 పాయింట్లు లాభంతో 10, 421.40 పాయింట్లతో ర్యాలీ సృష్టించాయి. అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు నమోదుకావడంతో దేశీయ మార్కెటకలపై ప్రభావం చూపింది. ట్రేడ్ వార్ వర్రీతో గతవారం మార్కెట్లు నష్టాల్లో ముగిసాయి. టోక్యో నుండి సిడ్నీ వరకు ఆసియా స్టాక్స్ శుక్రవారం అమెరికా ఉద్యోగాల నివేదికను అనుసరించి ఆందోళనకు దారితీసాయి. జనవరి, ఫిబ్రవరికి సంబంధించి భారతీయ మార్కెట్లు ప్రధానంగా ఐఐపి, సీపీఐ గణాంకాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. గత ఏడెనిమిది సెషన్లలో నష్టాలను చవిచూసిన మార్కెట్లు 600కుపైగా పాయింట్లు నమోదుచేసింది. ఎఫ్ఎమ్‌సిజి జెయింట్ ఐటిసి ప్రదానంగా లాభపడింది. హెచ్‌డిఎఫ్‌సి, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసిఐసిఐ బ్యాంకు, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంకు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, ఎన్‌టిపిసి, ఎల్ అండ్ టి, భారతి ఎయిర్‌టెల్ షేర్లు ర్యాలీ నమోదుచేసాయి. ఎన్‌టిపిసి షేర్లు, భారతి ఎయిర్‌టెల్, ఐటిసి, టాటా మోటార్స్, యాక్సిస్ బ్యాంకు, యస్ బ్యాంకు, టాటా స్టీల్, ఐసిఐసిఐ బ్యాంకు, హీరో మోటాకార్ప్, అదానీ పోర్ట్సు, ఓఎన్‌జిసి, ఇండస్‌ఇండ్ బ్యాంకు, హెచ్‌డిఎఫ్‌సి విప్రో, ఆర్‌ఐఎల్, ఇన్ఫోసిస్ హెచ్‌యుఎల్, మారుతిసుజుకి లాభాల్లో నమోదుకాగా ఏడాదితో పోలిస్తే సెన్సెక్స్ అత్యధికంగా లాభాలు నమోదు చేసింది. సెక్టరల్ సూచీల్లో నిఫ్టీ పిఎస్‌యు బ్యాంకు ఇండెక్స్ తప్ప మిగిలిన ఎఫ్ఎమ్‌సిజి, నిఫ్టీ మెటల్, నిఫ్టీ ప్రైవేటు బ్యాంకు, నిఫ్టీ బ్యాంకు, ఆటో, ఫైనాన్షియల్ సర్వీసెస్ 2శాతం పెరుగుదలతో గ్రీన్‌లో నమోదయ్యాయి. బ్లు చిప్ కంపెనీలు కాక మిడ్‌కాప్, స్మాల్ కాప్ కంపెనీలు లాభాల్లో నమోదయ్యాయి. పిఎస్‌యు బ్యాంకర్స్‌లో ఐడిబిఐ బ్యాంకు, అలహాబాదు బ్యాంకు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూకో బ్యాంకు, ఆంధ్రా బ్యాంకు సహా 9శాతం నష్టపోయాయి. ప్రపంచ స్టాక్స్ సోమవారం రెండు వారాల గరిష్టానికి చేరాయి. అమెరికా ఉపాధి గణాంకాలు వెల్లడించిన నేపథ్యంలో మదుపరులు పెట్టుబడులకు ఉత్సాహంగా ఉన్నట్లు తెలుస్తోంది. అమెరికా , ఇతర దేశాలతో తలెత్తిన వార్ ట్రేడ్ నేపథ్యంలో మదుపరులు సేఫ్ హెవెన్ అయిన బంగారాల్లో పెట్టుబడులకు ఉత్సాహం చూపారు. వృద్ధిలో పెరుగుదల, ద్రవ్యోల్బణం తగ్గుదల నేపథ్యంలో మదుపరులు ఈక్విటీల్లో పెట్టుబడులకు ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలుస్తోంది. ఎస్ అండ్ పి 500 1.7శాతం పెరుగుదలతో ఈ ఏడాది రెండవ అతిపెద్ద రోజుగా నమోదైంది. జర్మనీ డిఏఎక్స్ యూరప్‌లో 0.9శాతంతో లాభాలను నమోదు చేసింది. ఎమ్ఎస్‌సిఐ ప్రపంచ ఈక్విటీ ఇండెక్స్ రెండువారాల గరిష్టానికి చేరింది. సౌత్ కొరియా 1శాతం ఆస్ట్రేలియా మెయిన్ ఇండెక్స్ 0.7శాతం పెరిగింది.

విజ్ఞానం

టీవీకి అతుక్కుపోతే ముప్పే..



రోజుకు 4 గంటలు టీవీ చూస్తూ ఉంటే మాత్రం పెద్ద పేగు కేన్సర్ ముప్పు తప్పదని తెలుస్తోంది. బ్రిటన్‌లోని ఇంపీరియల్ కాలేజి లండన్, ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ నిపుణులు చేపట్టిన అధ్యయనంలో 5లక్షలమంది ఆరోగ్య సమాచాన్ని పరిశీలించగా, 2391 మందికి పెద్దపేగు కేన్సర్ సోకినట్లు తెలుస్తోంది. కదలకుండా టీవీ వీక్షించేవారే వీరంతా...కంప్యూటర్ ముందు కూర్చున్నవారితో పాటు మహిళల్లోనూ ఇటువంటి ముప్పు లేకపోవడం గమనార్హం. టీవీల ముందుకూర్చుంటే మొదట శరీరంలో కొవ్వు, బరువు పెరగడంతో హార్మోన్లలో తేడాలు వస్తున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా కేన్సర్ ముప్పు పెరుగుతుందని నీల్ మర్ఫీ తెలిపారు. కాకపోతే క్రమంతప్పకుండా శరీరకవ్యాయామంతో ఈ ముప్పును ఎదుర్కొవచ్చు.

జన్యు సవరణ



మనుషులు ఎదుర్కొంటున్న పలుస సమస్యలకు పరిష్కారం చూపగల సామర్థ్యమున్న జన్యు సవరణ ప్రక్రియ మరింత మెరుగుపడనుంది. కచ్చితత్వంతో జన్యువులను సరిదిద్దే సాంకేతికతను జపాన్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసారు. మైక్రోహోమాజలసీ అసిస్టెడ్ ఎక్సిషన్‌గా పిలుస్తున్న ఈ ప్రక్రియతో జన్యు కత్తిరింపుకోసం విరివిగా వినియోగిస్తున్నారు. ఒక్కో జన్యువును లక్ష్యంగా చేసుకుని అత్యంత కచ్చితత్వంతో లోపాలను సవరించేందుకుగాను తాజా సాంకేతిక దోహదపడుతుందని తెలుస్తోంది. వ్యాధి కారక జన్యువులోపాలను సరిదిద్దడానికి హానికర సూక్ష్మ జీవులను నాశనం చేసేందుకు అవసరమైన లక్షణాలతో కొత్త జాతులను సృష్టించడానికి జన్యు సవరణ ప్రక్రియ ఉపయోగపడుతుంది.

చెన్నై ప్లాంట్‌లో బీఎండబ్ల్యూ ఉత్పత్తి ప్రారంభం

విజయవాడ : ప్రముఖ కార్ల కంపెనీ బీఎండబ్ల్యు గ్రూపు చెన్నై ప్లాంట్‌లో నూతనంగా ఉత్పత్తి ప్రారంభిస్తున్నట్లు మినీ రీజియన్ ఆసియా, పసిఫిక్, సౌత్ ఆఫ్రికా ఇంపోర్టెడ్ రీజియన్స్ అధికారి హెన్రిక్ విల్‌హెల్మ్ స్మైయర్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఎండబ్ల్యు ఐదు సీట్ల స్పోర్ట్ యాక్టివిటీ వెహికల్ గతంలోకన్నా ఎక్కువ స్థల అవకాశం, సౌఖ్యత కలిగి వుంటుంది. పెట్రోల్, డీజిల్ ఇంజన్ల నూతన శ్రేణి ఆధునిక మినీ పవర్ టర్బో టెక్నాలజీతో అసాధారణ పెర్ఫామెన్స్, ఎఫిషియన్సీలను అందిస్తుంది. ఢిల్లీ ఎన్.సి.ఆర్. ఆల్ న్యూ మినీ కంట్రీమెన్‌ను భారతదేశంలో ఆటో ఎక్స్‌పో - 2018లో విడుదల చేశారు. స్థానికంగా బీఎండబ్ల్యు గ్రూపు ప్లాంట్ చెన్నైలో ఉత్పత్తి చేసే ఆల్ న్యూ మినీ కంట్రీమాన్ మూడు వేరియంట్స్‌లో లభిస్తుంది. రెండు పెట్రోల్ వేరియంట్స్, మినీ కంట్రీమెన్ కూపర్ ఎస్ మరియు కంట్రీమెన్ కూపర్ ఎస్ జేసీ డబ్ల్యు ఇన్‌స్పైర్డ్ మరియు ఒక డీజిల్ వేరియంట్ మినీ కంట్రీమ్యాన్ కూపర్ ఎస్.డి. ఉన్నాయి. వీటిని జూన్ 2018 తరువాత పంపిణీను ప్రారంభిస్తారు మరియు ఎక్స్-షోరూం ధరలను ప్రకటించనున్నారు.


కోకాకోల కంపెనీలోఎల్ఈడీ వెలుగులు...!

విజయవాడ : 21 ఫ్యాక్టరీల్లో నూరుశాతం ఎల్ఈడీ లైట్‌లను సమకూర్చిన తొలి కంపెనీగా విజయవాడ హిందుస్థాన్ కోకాకోలా బేవరేజెస్ అవతరించింది. 420 పైగా ప్యానల్ లైట్లు, 380 హైవే లైట్లు, 15 ఫ్లేమ్ ప్రూఫ్ లైట్లు, 75 ట్యూబ్ లైట్లు, 60 హైమాస్ట్ లైట్లు, 60 ఇతర లైట్లను దశల వారీగా మార్చి ఈ మైలు రాయిని చేరుకుంది. హిందుస్థాన్ కోకాకోలా బేవరేజెస్ విజయవాడ ఫ్యాక్టరీ మేనేజర్ బి.రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ, 2018 నాటికి ఇంధన అవసరాల్లో 40 శాతం గ్రీన్ అండ్ క్లీన్ ఇంధనాన్ని పొందాలనే లక్ష్యానికి అనుగుణంగా... హెచ్‌సీసీబీ విజయవాడ కంపెనీ నూరు శాతం ఎల్ఈడీ లైట్‌లను సమకూర్చుకున్న కంపెనీగా ఘతన సాధించటం గర్వకారణమన్నారు. భవిష్యత్తులో సంప్రదాయేతర ఇంధనాల వినియోగాన్ని పెంచేందుకు అన్ని మార్గాలను అన్వేషిస్తామని హామీ ఇచ్చారు.

నిలదొక్కుకున్న రూపాయి

ముంబై: డాలర్‌తో రూపాయి మార కపు విలువ అత్యధికంగానే నమో దైంది. కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ఆధారిత ద్రవ్యోల్బణం, పారిశ్రా మిక ఉత్పత్తి (ఐఐపి) గణాంకాలలు వెలువడనుండటంతో సోమవారం విడు దల కానున్న నేపథ్యంలో రూపాయి 0.25శాతం పెరిగి 65.01 వద్ద నిలిచింది.10ఏళ్ల ప్రభుత్వ బాండ్లు 7.647 శాతం కాగా శుక్రవారం 7.671 వద్ద ముగిసింది. దేశీయ ఈక్విటీ మార్కెట్‌లో ప్రారంభ లాభాలు రూపాయికి మద్దతు పలికాయి. శుక్రవారం రూపాయి 3పైసలు నష్టపోయి 65. 17 వద్ద నిచింది. విదేశీ మదుపరులు సుమారు రూ.550. 36 కోట్లు షేర్లను కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. శుక్ర వారం రూపాయి 3పైసలు నష్టపోయి 65.17 వద్ద నిలిచింది. బ్లూమ్‌బర్గ్ అంచనాల ప్రకారం జనవరి ఐఐపి 6.4శాతం, ఫిబ్రవరి సీపీఐ 4.74 శాతం నమోదు కావచ్చునని అంచనా.

దేశీ మార్కెట్‌లో అమెరికన్ ఆర్గానిక్ యాపిల్స్



కోల్‌కతా : అమెరికన్ యాపిల్స్ దేశీయ మార్కెట్లో రుచులను పంచబోతున్నాయి. భారత్ మార్కెట్‌లో తొలిసారిగా అమెరికాలోని వెనాచీ నుంచి ఆర్గానిక్ యాపిల్స్‌ను ప్రవేశపెట్టామని పండ్ల దిగుమతి సంస్థ ఐజీ ఇంటర్నేషనల్ వెల్లడించింది. దేశంలో సహజమైన పండ్లు, కూరగాయలకు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా విదేశీ సంస్థ స్టెమిల్ట్ గ్రోయర్స్‌తో ఒప్పందం ద్వారా ఆర్గానిక్ యాపిల్స్‌ను దిగుమతి చేస్తున్నామని తెలిపింది. ఆరోగ్య స్పృహ పెరుగుతున్న క్రమంలో సహజమైన తాజా యాపిల్స్‌ను ప్రజలకు అందించే ఉద్దేశంతో అమెరికా నుంచి ఆర్గానిక్ యాపిల్స్‌ను తొలిసారిగా భారత మార్కెట్‌కు పరిచయం చేస్తున్నామని ఐజీ ఇంటర్నేషనల్ తెలిపింది. దేశంలో పండ్లను ఇష్టంగా తినే వారిలో ఆర్గానిక్ పండ్లపై ఆసక్తి కనబరుస్తారని పేర్కొంది. భారత్‌లో అరటి పండ్ల తర్వాత అత్యధికంగా యాపిల్స్‌ను ఎక్కువగా వాడతారు. దేశంలో ఏటా 20 లక్షల టన్నుల పైగా యాపిల్స్ వినియోగం జరుగుతుంది.

బోల్డ్‌సౌత్ స్కోప్ క్యాలెండర్ ఆవిష్కరించిన లావణ్య త్రిపాఠి



విశాలాంధ్ర బ్యూరో- హైదరాబాద్: తెలుగు సినిమా రంగంలో పేరు ప్రఖ్యాతలు సంపాదించిన సినీతార లావణ్య త్రిపాఠి 'బోల్డ్ సౌత్ స్కోప్ క్యాలెండర్ 2018"ని ఆవిష్కరించారు. కిండల్ గ్రూప్ బ్రాండ్ డైరెక్టర్ పుష్పాంజలి బెనర్జీ, అరుణ ఆర్ కృష్ణన్, పూనం షా, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు. బోల్డ్ సౌత్ స్కోప్ క్యాలెండర్ అనేది భారత దేశంలో సినిమా రంగంలో పేరుపొందిన వ్యక్తుల ఫోటోలతో ప్రచురించే ఏకైక క్యాలండర్. ఈ ఏడాది క్యాలెండర్‌లో ప్రభుదేవా, రానా దగ్గుపాటి, త్రిష కృష్ణన్, విక్రమ్ ప్రభు, లక్ష్మి మంచు, కీర్తి సురేష్ వంటి ఎంతో మంది నటులతో కనువిందు చేయనున్నారు. బోల్డ్ సౌత్ స్కోప్ క్యాలెండర్‌ను ప్రఖ్యాత ఫోటోగ్రాఫర్లు జి.వెంకట్ రామ్, కార్తీక్ శ్రీనివాస్ చిత్రీకరించారు. తారల అందం ఉట్టిప డేలా, వారి వ్యక్తిత్వం ప్రతిబింబించేలా ఫోటోలు తీశారు. కిండల్ గ్రూప్, సౌత్ స్కోప్, బూట్స్ భాగస్వామ్యంతో ఇప్పటి వరకు ఆవిష్కరించిన ఆరు క్యాలెండర్‌లకు మంచి స్పందన లభించిందని బెనర్జీ తెలిపారు. ఈ సంవత్సరం క్యాలెండర్ చాలా ప్రత్యేకమైనదని, అంతర్జాతీయ బ్రాండ్ బోల్డ్ కంపెనీ భాగస్వామ్యంతో చేస్తున్న మొదటి క్యాలెండర్ ఎంతో హుందాగా ఉందన్నారు ఆడంబరంగా బోల్డ్ బ్రాండ్ గొప్పతనాన్ని సూచిస్తూ సినిమా రంగంలో పేరొందిన వ్యక్తులతో రూపొందించామని, వైజాగ్, ఆంధ్రప్రదేశ్‌వాసులు దీనిని తమ కాఫీ టేబుల్ మీద కచ్చితంగా పెట్టుకుంటారన్నారు.

26శాతం పెరిగిన వాహనాల విక్రయాలు



న్యూఢిల్లీ: ఫిబ్రవరిలో పాసెంజర్ వాహనాల విక్రయాలు 7శాతం పెరగగా మోటారుసైకిళ్ల విక్రయాలు 26శాతం పెరిగాయి. కమర్షియల్ వాహనాల విక్రయాలు 31.13శాతం పెరిగి 87,777 యూనిట్లు నమోదైంది. జనవరిలో కార్ల అమ్మకాలు నిదానించగా వాసెంజర్ వాహనాల విక్రయాలు మాత్రం 7.6శాతం నమోదుచేసింది. వాహనాల ఉత్పత్తి 8శాతం పెరగగా రెండు చక్రాల వాహనాల అమ్మకాలు అమ్మకాలు 6శాతం తగ్గాయి. దేశీయ పాసెంజర్ వాహనాల అమ్మకాలు ఫిబ్రవరిలో 7.77శాతం పెరిగి 275,329 యూనిట్లు కాగా గత సంవత్సరం ఫిబ్రవరిలో 255,470గా ఉంది.డొమెస్టిక్ కార్ల అమ్మకాలు 3.7 శాతం పెరిగి 179, 122 యూనిట్లు కాగా 2017 ఫిబ్రవరిలో 172, 737 యూనిట్లు నమోదైంది. మోటారుసైకిళ్ల అమ్మకాలు గత నెల 26.48శాతంతో 1053,230 యూనిట్లు కాగా గతేడాది ఇదే కాలానికి 832,695 యూనిట్లు నమోదైంది. కమర్షియల్ వాహనాల అమ్మకాలు 31.13శాతం పెరిగి 87,777యూనిట్లు ఫిబ్రవరిలో నమోదైంది. వాహనాల అమ్మకాలు కేటగిరీల ప్రకారం 22.77 శాతంతో 2,111,383 యూనిట్లుకాగా గతేదాది ఫిబ్రవరిలో 1719,806 యూనిట్లుగా ఉంది.



జిరాక్స్ ఉత్పాదనల ప్రదర్శన

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ప్రింట్ ఫెయిర్ 18లో జిరాక్స్ ఇండియా వినూత్న సాంకేతికత, కొనుగోలుదారుల అవసరాలను తీర్చగల తన విస్తృత శ్రేణి ఉపకరణాలను ప్రదర్శించింది. జిరాక్స్ ఇండియా తన ప్రజాదరణ పొందిన వెర్సంట్ శ్రేణి-కలర్ సీ70తో పాటుగా వెర్సంట్ 180, వెర్సంట్ 3100లను నగరంలో జరిగిన కార్యక్రమంలో ప్రదర్శించింది. తమ ఉత్పాదకత, సామర్థ్యాలకు పేరొందిన, వివిధ మాధ్యమాలపై ప్రింట్ చేయడానికి వీలైన ఉత్పాదనలను అందిస్తున్నట్లు జిరాక్స్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బాలాజీ రాజగోపాలన్ తెలిపారు. సెటప్ టైమ్, టెస్టింగ్, ప్రి-ప్రింట్ వర్క్‌లను తగ్గించేలా ఈ తరగతిలోనే అత్యుత్తమమైన ఆటోమేషన్ విశిష్టతలను ఈ ఉపకరణాలు కలిగి ఉన్నాయన్నారు. కొనుగోలుదారుల వ్యాపార లాభదాయకతను మెరుగుపర్చాలని, తమ పరిధిని విస్తృతం చేసేందుకు వీలు కల్పిస్తుందన్నారు. మూడింట ఒక వంతు వ్యాపారంతో జిరాక్స్ ఇండియా కార్యకలాపాలలో దక్షిణాది ప్రాంతం గణనీయమైన పాత్ర పోషిస్తుందని బాలాజీ తెలిపారు.

మోసం చేశారు.. ఆస్తులు వేలం వేయాల్సిందే

యునిటెక్ లిమిటెడ్‌పై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

ఢిల్లీ: రియల్ ఎస్టేట్ సంస్థ యునిటెక్ లిమిటెడ్‌పై సుప్రీంకోర్టు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. గృహ కొనుగోలుదారులను యునిటెక్ మోసం చేసిందని.. వారి డబ్బులను రీఫండ్ చేయాలంటే సంస్థ ఆస్తులను వేలం వేయాలని స్పష్టం చేసింది. కొనుగోలుదారుల నుంచి డబ్బులు తీసుకుని, వారికి సరైన సమయంలో ఇళ్లను నిర్మించి ఇవ్వలేదన్న ఆరోపణలతో యునిటెక్ లిమిటెడ్‌పై పలు కేసులు నమోదయ్యాయి. దీనిపై సర్వోన్నత న్యాయస్థానం నేడు విచారణ చేపట్టింది. కొనుగోలుదారుల డబ్బులు తిరిగి చెల్లించేందుకు గాను యునిటెక్ ఆస్తులను వేలం వేయాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. కంపెనీ డైరెక్టర్ల వ్యక్తిగత ఆస్తులు సహా సంస్థ ఆస్తులను గుర్తించి వాటిని వేలం వేయాలని పేర్కొంది. అయితే ఆ ఆస్తులు ఎలాంటి వివాదాల్లో చిక్కుకుని ఉండరాదని స్పష్టం చేసింది. ఆస్తుల వివరాలను ఇవ్వాల్సిందిగా యునిటెక్ సంస్థనూ ఆదేశించింది.

మొండి బకాయిలు రూ.8.41 లక్షల కోట్లు

- డిసెంబర్ 31 నాటికి బ్యాంకుల్లో పరిస్థితిపై కేంద్రం నివేదిక



న్యూఢిల్లీ: బ్యాంకింగ్ రంగంలో మొండి బకాయిలు మరింత పెరిగాయి. డిసెంబర్ 31తో ముగిసేనాటికి ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకుల మొండి బకాయిలు రూ.8.41 లక్షల కోట్లకు చేరుకున్నాయని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం వెల్లడించింది. ముఖ్యంగా పారిశ్రామికం, సేవలు, వ్యవసాయ రంగ ంలో వీటి వాటా మరి ఎక్కువగా ఉన్నదని పేర్కొంది. వీటిలో ఇండస్ట్రీకి ఇచ్చిన రుణాల్లో రూ.6,09,222 కోట్లు ఎన్‌పీఏలుగా మారయన్న కేం ద్రం.. మొత్తం ఎన్‌పీఏల్లో వీటి వాటా 20.41 శాతంగా ఉంది. అలాగే సేవల రంగం రూ.1, 10,520 కోట్లు(5.77 శాతం), వ్యవసాయం రూ.69,600 కోట్లు(6.53 శాతం), ఆహారేతర రంగం రూ.14,986 కోట్లు, రిటైల్ లోన్ల వాటా రూ.36,630 కోట్లు(2.01 శాతం)గా ఉన్నాయని లోక్‌సభకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ్ ప్రతాప్ శుక్లా రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన తొమ్మిది నెలలకాలంలో ఉద్దేశపూర్వకంగా రుణాలు ఎగ్గొట్టే వారి సంఖ్య 1.66 శాతం పెరిగి 9,063కి చేరుకున్నట్లు శుక్లా వెల్లడించారు. వీటి విలువ రూ.1,10,050 కోట్లని ఆయన చెప్పారు. ఈ రుణాలు ఎగ్గొట్టేవారిపై ఉక్కుపాదం మోపడానికి ఇప్పటికే కేంద్రం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నదని, 2,108 మందిపై ఎఫ్ఐఆర్ దాఖలు చేసినట్లు తెలిపారు.

పీఎన్‌బీకి రూ.2,800 కోట్ల నష్టం : భారీ కుంభకోణంతో సతమతమవుతున్న ప్రభుత్వరంగ బ్యాంకు పంజాబ్ నేషనల్ బ్యాంకు గడిచిన ఆర్థిక సంవత్సరంలో కూడా భారీగా నష్టపోయింది. వివిధ మోసాల ద్వారా 431 మిలియన్ డాలర్లు నష్టపోయినట్లు కేంద్ర ప్రభుత్వం శుక్రవారం వెల్లడించింది. మన కరెన్సీలో వీటి విలువ రూ.2,800 కోట్లకు పైమాటే.

ఎగవేతదారులను వదలొద్దు: యూఎఫ్‌బీయూ కన్వీనర్ శర్మ బ్యాంకులకు చెల్లించాల్సిన లక్షలాది కోట్ల రూపాయలను ఎగ్గొట్టిన ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలపై కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) కన్వీనర్ వీవీఎస్ఆర్ శర్మ కోరారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి ప్రజలు ఇంటి కోసం రుణాలు తీసుకుంటే ముక్కు పిండి వసూలు చేస్తారని, బడా కంపెనీల వద్ద బ్యాంకులకు సంబంధించిన నిరర్థక ఆస్తులు రూ.10 లక్షల కోట్లుగా ఉన్నాయని, ముందుగా వీటిని వసూలు చేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని, అందుకోసం కఠినమైన చట్టాలను రూపొందించాలన్నారు.


పీఎన్‌బీలో జరిగిన మోసాన్ని సాకుగా చూపుతూ ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రైవేట్ పరం చేయాలన్న ఆలోచనను విరమించుకోవా లన్నారు. ప్రైవేట్ బ్యాంకులు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని చెబుతున్న వారు గ్లోబల్ ట్రస్ట్ బ్యాంకు ఎందుకు మూతపడిందో సమాధానం చెప్పాలన్నారు. కొన్ని కార్పొరేట్ శక్తులు ప్రభుత్వ బ్యాంకులను దివాలా చేయించే కుట్ర చేస్తున్నాయని, పాలక ప్రభుత్వాలు ఈ విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ఈ నెల 21న ప్రభుత్వ రంగ బ్యాంకులను రక్షించాలని కోరుతూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేస్తున్నామని, లక్షలాది సంతకాలను సేకరించి లోక్‌సభ స్పీకర్‌కు నివేధిస్తామని ఆయన తెలిపారు.

విజ్ఞాని ఐన్‌స్టీన్

భౌతిక ప్రపంచం నుంచి నిష్క్రమించి 63 సంవత్సరాలయినా ఆల్బెర్ట్ ఐన్‌స్టీన్ పేరు నేటికి ఏనాటికీ విజ్ఞాన పరిశోధనా రంగంలో "సత్యం-శివం-సుందరం"గా వెలుగులీనుతూనే ఉంటుంది. ఆ మహనీయుని స్మృతికి యింతకన్నా నివాళి ఏమిటి? 1905 వేసవికాలంలో ఆ జర్మనీ యువప్రజ్ఞాశాలి తన 26వ ఏట నాలుగు అత్యద్భుత వైజ్ఞానిక పత్రాలు వెలువరించాడు. అవి 1. కాంతి గురించి, 2. రేణువుల కదలికలు, 3. ఎలక్ట్రోడైనమిక్ సూత్రాలు 4.శక్తి సిద్ధాంతం. ఈ నాలుగు వైజ్ఞానిక అంశాలు కొన్ని పేజీలకు పరిమితే కాని యివి విజ్ఞాన శాస్త్ర ప్రపంచాన్ని ఎంతగానో ప్రభావితం చేశాయి. రోదసి, కాలం-విశ్వం గురించి ప్రపంచ అవగాహనను యివి సమూలంగా మార్చివేశాయి. అందుకే ఐన్‌స్టీన్ పేరు ప్రతిభకు పర్యాయపదంగా /మేధావుల/ మనోభూమికను/ అలంకరించింది. వారి ఆలోచనను/ జ్వలంతం/ చేస్తూనే ఉంది.

ఆల్బెర్ట్ ఐన్‌స్టీన్ 1879 మార్చి 14న జర్మనీలోని ఉల్మ్‌లో జన్మించాడు. పుట్టిననాడు అతడి బుర్ర చాలా పెద్దదిగా ఉండేది. అందుకే తల్లిపాలిన్ అతడిని "వింతబిడ్డ" అనేది. అతని వయసు పిల్లలకన్నా యితడి తల చాలా పెద్దదిగా ఉండేది. అయితే అలాగే అతడు ప్రపంచ మేధావి అవుతాడని ఎవ్వరు భావించలేదు. రెండున్నర ఏళ్ళు వచ్చే వరకు అతనికి మాటలే సరిగా రాలేదు. మాటలు వచ్చిన కొత్తలో ప్రతిమాటనీ రెండేసిమార్లు ఉచ్చరించి ఫూల్ అనిపించేవాడు.

తోటి వారితో ఎలా ప్రవర్తించాలో అతనికి తెలీదు. అందుకే స్నేహితులతనిని 'బోర్‌బోయ్' అనేవారు. విధిలేక అతడు ఒంటరిగా తనలోతానే ఉండి ఆటలాడుకునేవాడు. అతనికి చిన్ననాడే మరబొమ్మలు అంటే చాలా యిష్టం. వాటితో ఆడుతూ కొత్తగా పుట్టినచెల్లెలు మాజాని వింతగా చూసి "ఈ పిల్లకు చక్రాలు ఎక్కడ వున్నాయి" అని వింతగా ఆశ్చర్యంగా అడిగేవాడు.



అందరూ చెప్పుకునేటట్లు ఆల్బెర్ట్ చెడ్డపిల్లవాడేంకాదు, మంచి విద్యార్థి, అతడికి 15 నెలలు వచ్చినప్పుడు కుటుంబం వలస వెళ్లింది. 'మ్యూనిచ్'లో అతని హైస్కూల్ విద్యాభ్యాసం జరిగింది. ప్రతి సబ్జెక్ట్‌లో మంచి మార్కులు తెచ్చుకునేవాడు. కాని పాఠశాల కట్టుదిట్టాలు అతనికి రుచించేవికావు. అందుకే తరచు ఉపాధ్యాయులతో ఘర్షణపడుతుండే వాడు. అలాగే అధ్యాపకులు "తరగతిలో అతను ఉండడం గొప్ప"గా ఉన్నట్లు భావించే వారు. 15వ ఏట అతడు స్కూలు వదిలి పెట్టేశాడు. అంతకుముందు ఏడాదే అతడి తల్లిదండ్రులు మిలాన్ నగరం వెళ్ళిపోయారు. చాలా తర్జన భర్జన తర్వాత జర్మనీ మాట్లాడే స్విట్జర్లాండ్‌లో చదువుకొన సాగించదానికి ఐన్‌స్టీన్ అంగీకరించాడు. మ్యూనిచ్‌లో వున్న అరావు పట్టణం లివర్‌డాం స్వేచ్ఛగా సరదాగా ఉండేది.


×× ×× ××

ఐన్‌స్టీన్‌కి మిగిలిన అంశాల కన్నా ఫిజిక్స్, గణితశాస్త్రం అంటే యిష్టం ఎక్కువ. పాఠశాల విద్యానంతరం జ్యూరిచ్ విశ్వ విద్యాలయంలో అధ్యయనం చేయాలని అతడు నిశ్చయించుకొన్నాడు. విజ్ఞానశాస్త్రమే కాక పలు ఇతర అంశాలు కూడా అతనిని బాగా ఆకర్షించాయి. సహాధ్యాయిని 'మిలేవా మారిక్' అంటే అతనికి చాలా యిష్టం. ఆకర్షణ, ఆమె సెర్బ్ యువతి, ఆరోజుల్లో యూరప్‌లో స్త్రీలకు చదవుకొనే అవకాశాలు యిచ్చిన కొన్ని విశ్వవిద్యాలయాలలో జ్యూరిచ్ ప్రముఖమైనది. ఆమెను చూడగానే ఐన్‌స్టీన్ ఆకర్షితుడైనాడు. ఇది భౌతిక అందం ఆకర్షణ మాత్రమే కాదు. మేధోపరమైన ఆకర్షణ. తొలిచూపులోనే అతడు ఆమెను "క్లవర్ క్రీచర్" అని ఆరాధనా పూర్వకంగా అభివర్ణించాడు. యూనివర్శిటీలోకాని, యింటి వద్దకాని అతనికి ఆమె అపురూపమైన జీవిగా కనిపించేది.

వారిద్దరి మధ్య ప్రేమ అంకురించింది. ప్రేమ లేఖలు నడిచాయి. ఆ ఉత్తరాలలో లలిత శృంగారభావాలు, అపారమైన విజ్ఞానఅంశాలు అక్షర చిత్రాలుగా నిలిచేవి." మేమిద్దరం కలిసి సాపేక్ష సిద్ధాంతాన్ని రూపొందించగలిగినపుడు ఎంత ఆనందం గర్వంగా ఫీల్ అయ్యామో" అని ఐన్‌స్టెయిన్ అనడం, రాయడం యిందుకు సోదాహరణ.

×× ×× ××

1900లో ఐన్‌స్టీన్ 21 ఏళ్ళ విశ్వవిద్యాలయ పట్టభద్ర నిరుద్యోగి, కొన్నాళ్లు టీచింగ్ అసిస్టెంట్‌గా, ప్రైవేట్ ట్యూటర్‌గా కాలం గడిపాడు. చివరగా 1902లో బెర్న్‌లో పేటెంట్ ఆఫీసులో



టెక్నికల్ ఎక్స్‌పర్ట్ ఉద్యోగం వచ్చింది. అక్కడ ఇతరుల పరిశోధనలను విశ్లేషించి, అంచనాలు వేయడం అతడి ఉద్యోగ బాధ్యత. అయినా తాను స్వయంగా ప్రైవేటుగా పరిశోధనలు చేసుకునేవాడు. అది గోప్యంగా జరిగేది. అందుకే తన డెస్క్ డ్రాయర్‌ని 'బ్యూరో ఆఫ్ థియరిటికల్ ఫిజిక్స్' అని పిలిచేవాడు.

1905లో వెలువడిన ఐన్‌స్టీన్ పరిశోధనా పత్రాలలో "ప్రత్యేక సాపేక్ష సిద్ధాంత" పత్రం ప్రముఖమైనది. ఇది స్థలకాల సమన్వయ సిద్ధాంతం అనాలి. రెండు గడియారాలలో ఒకటి చాలా వేగంగా తిరుగుతోందనుకుందాం. ఇది రెండవ గడియారానికి సాపేక్షం, ఐతే ఈ రెండు ప్రయాణంలో కలిసి ఒకే చోటికి వస్తే సమానం చేయాలి. ఈ సిద్ధాంతం ప్రేరణగానే కాలాంతరంలో ప్రపంచ ప్రసిద్ధ విశ్వశక్తి అవినాశన సిద్ధాంతం ఇ=ఎంసి2 అవతరిం చింది. ఇవి ద్రవ్యరాశికి, శక్తికి మధ్యగల సంబంధాన్ని స్పష్టంగా రుజువు చేసింది.

ఐన్‌స్టీన్ భౌతికశాస్త్రంలో కఠినతర సమస్యల్ని పరిష్కరించే కృషి చేస్తున్న తరుణంలోనే అతడి వ్యక్తిగత జీవితం ఒడుదుడుకులకు గురిఅయింది. చదువు కాగానే మిలేవాను పెళ్ళి చేసుకోవాలని అతడు ఆశించాడు. కాని అతడి తల్లి వ్యతిరేకించింది. మేలేవా తన కొడుకు కన్న మూడేళ్ల పెద్దది, పైగా బాగా తెలివైనది, ఆమె ప్రతిభముందు కొడుకు వెలవెలకాకూడదన్న భయం ఉండేదామెకు. అందుకే "ఆమె ఒక గ్రంథం వంటిదిరా! నీకు భార్యగా ఉండే స్త్రీకావాలి" అని, అందుకే అప్పటికీ ఆవిషయాన్ని ఐన్‌స్టీన్ వాయిదా వేయకతప్పలేదు.

దాంపత్య బాంధవ్యం మాటెలా ఉన్నా 1901లో మెలీవా గర్భవతి అయింది. ఆ మరుసటి సంవత్సరంలో కూతుర్ని కన్నది. ఆమె పేరు లీసెర్ల్. ఆమెను దత్తత ఇచ్చేశారు. 1903 జనవరిలో ఐన్‌స్టెయిన్, మిలీవాల వివాహం జరిగింది. ఇద్దరూ మగపిల్లలు కలిగారు. కాని కొద్ది ఏళ్ళకే ఆ వివాహం భగ్నం అయింది. ఐన్‌స్టీన్ యితర స్త్రీల వెంటపడ్డాడు. దగ్గర బంధువులైన ఎల్సాతో అనుబంధం బలపడింది.

ఈ దశలోనే మిలీవా తన మేధో ఆశయాలు వదులుకొంది. ఆమె అసంతృప్తి గృహిణిగా మారింది. సుదీర్ఘ కాలపు కయ్యాల తర్వాత 1919లో ఈ దంపతులు విడాకులు తీసుకుని విడిపోయారు. ఆనాడే ఐన్‌స్టీన్ ఎల్సాను పెళ్ళి చేసుకొన్నాడు.

×× ×× ××

అతడి కీర్తి ప్రపంచ స్థాయిని చేరుతోంది. 1915లో సాధారణ సాపేక్షసిద్ధాంతాల్ని వెలువరించాడు. ఈ సిద్ధాంతం గురుత్వ సిద్ధాంతపు కేంద్రబిందువుపై కొత్తకాంతి ప్రసరించింది. అప్పటి (1919) సంపూర్ణ సూర్యగ్రహణ వేళ జరిపిన పరిశీలనలు అతడి ఈ సాపేక్ష సిద్ధాంతాలకి సాధికారక రుజువులు అందించింది. స్థిరతారల నుంచి వెలువడే కాంతిలీన ప్రసారంలో సూర్య గురుత్వ శక్తి క్షేత్రంలో ఒంపు తిరుగుతోందని ఈ ప్రయోగాలు ధృవీకరించాయి. అతడి ఈ కృషి "వైజ్ఞానిక విప్లవం" అని పత్రికలు విశ్లేషించాయి.

ఫొటో ఎలక్ట్రిక్ ఎఫెక్ట్ ప్రక్రియపై విశేష కృషికి గుర్తింపుగా ఐన్‌స్టీన్‌కు 1921లో నోబెల్ పురస్కారం ఇచ్చారు. అతడిని విజ్ఞాన ప్రపంచం ఘన సన్మానాలతో ముంచెత్తింది. ప్రశంసల వర్షం కురిపించింది.

×× ×× ××

అప్పటికీ ఐన్‌స్టీన్ బెర్లిన్‌లో ఉంటున్నాడు. అక్కడ అతడు అత్యధిక వేతనంపై ప్రూసియన్ అకాడమీ ఆఫ్ సైన్స్‌స్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ పరిశోధనలకు డైరెక్టర్ అతనే? సాధారణ సాపేక్ష సిద్ధాంత ప్రవచనం తర్వాత అతడు విశేష కృషికి దేనికి చేసినట్లు కానరాదు. పైగా కొన్ని విషయాలలో వివాదస్పదుడయ్యాడు. 1920 దశకంలో వెలువడిన క్వాంటమ్ థియరీని అతడు తిరస్కరించాడు. కాని అతడి ప్రధాన పరిశోధన దీనిపైనే ఆధారపడి ఉండడం విశేషం.

1933లో జర్మనీలో నాజీల ఆధిపత్యం ఏర్పడింది. ఐన్‌స్టీన్ అమెరికా వెళ్ళిపోయాడు. ఐదేళ్ళ తర్వాత బెర్లిన్‌లో అణు విచ్ఛేదనం గురించి సంచలన వార్త వెలువడింది. ఇది అమెరికా శాస్త్రవేత్తలలో గందరగోళం, ఆందోళన కలిగించింది. ఆ సమయంలోనే ఎందరో శాస్త్రవేత్తలు ఫాసిజం నుంచి రక్షణకై అమెరికా వలస వెళ్ళిపోయారు. త్వరలోనే నాజీలు అణు బాంబును నిర్మించగలరని వారి భయం. ఒక సహచరుని పట్టుదలపై ఐన్‌స్టీన్ నాటి అమెరికన్ అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్‌కు అణుబాంబు నిర్మాణం ఆవశ్యకతను వివరిస్తూ లేఖ రాశాడు. ఒక అణువిస్ఫోటనం సృష్టించే విధ్వంసాన్ని వర్ణించాడు. అతడి లేఖ వృధా పోలేదు. అమెరికా రహస్యంగా అణు బాంబు నిర్మించి 1945 ఆగస్టులో జపాన్, హిరోషిమా, నాగసాకిలపై ప్రయోగించింది.

×× ×× ××

ఈ విధ్వంసం ఐన్‌స్టీన్‌ను ఎంతగానో కలవర పరిచింది. అప్పుడే ఆయన ఐక్యరాజ్యసమితికి ఒక అద్భుత లేఖ రాశారు. "ప్రపంచ ప్రభుత్వం" అవతరించాలని దానిలో ఆయన కోరాడు. అయితే నాడు అతడు రూజ్‌వెల్ట్‌కు రాసిన లేఖ వలె ఈ లేఖ అంతటి కార్యాచరణ ప్రభావాన్ని చూపలేదు. ఐన్‌స్టీన్ ఆ ప్రపంచ పరిణామాల నేపథ్యంలో రాజకీయాలపట్ల మొగ్గు చూపారు. ఆయుధ నిర్మాణ పోటీకి స్వస్తి పలకాలని, శాంతి వర్ధిల్లాలని ఆయన గొంతెత్తారు.

1955 ఏప్రిల్ 18న ఐన్‌స్టీన్ మరణించినప్పుడు "ప్రపంచ పౌరుడుగా, విజ్ఞానశాస్త్ర బృహస్పతిగా, ద్రష్టగా ప్రపంచం నివాళులర్పించింది.

"తన జీవిత కృషి సర్వస్వాన్ని ప్రపంచానికి అంకితం చేసిన విరాగి, విజ్ఞాని ఐన్‌స్టీన్" అని, అదే ఆయన స్వేచ్ఛ" అని ఒక మనస్తత్వ వేత్త చేసిన అభివర్ణన ఐన్‌స్టీన్ స్మృతికి అక్షరనివాళి.

సమ్మర్ సందడి చేయనున్న సినిమాలు

సమ్మర్ సినిమాలు దాదాపు కన్‌ఫర్మ్ అయ్యాయి. మార్చి 30 నుంచి మే రెండో వారం వరకు ఏ వీకెండ్ ఖాళీ లేదు. అన్నీ దాదాపు రిలీజ్ డేట్స్ ఫిక్స్ చేసుకున్నాయి. థియేటర్లతో అగ్రిమెంట్లు కుదుర్చుకునే పనిలో ఉన్నాయి. ఈ వేసవికి టాలీవుడ్ లో రసవత్తరమైన పోరు సాగనుంది. వారానికో సినిమా వస్తోంది.



రంగస్థలం - మార్చి 30

రామ్ చరణ్, సుకుమార్ కాంబినేషన్‌లో రాబోతున్న రంగస్థలం సినిమా నుంచి సమ్మర్ ఫీవర్ షురూ అవుతుంది. ఈ మూవీపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. సమంత హీరోయిన్‌గా నటించిన ఈ సినిమా 1980ల నాటి కథతో తెరకెక్కింది. దేవిశ్రీప్రసాద్ ఈ సినిమాకు సంగీతం అందించాడు.



ఛల్ మోహన్ రంగ - ఏప్రిల్ 5

నితిన్, మేఘా ఆకాష్ హీరోహీరోయిన్లుగా నటించిన సినిమా ఇది. కృష్ణచైతన్య డైరక్ట్ చేసిన ఈ సినిమాకు త్రివిక్రమ్ కథ అందించాడు. పవన్, త్రివిక్రమ్, నితిన్ తండ్రి సుధాకర్ రెడ్డి కలిసి ఈ సినిమా నిర్మించారు. తమన్ సంగీతం అందించిన ఈ సినిమా పాటల్ని దశలవారీగా విడుదల చేస్తున్నారు. ఈ వేసవికి పెర్ ఫెక్ట్ రొమాంటిక్ మూవీగా ఇది పేరుతెచ్చుకుంది.

కృష్ణార్జున యుద్ధం - ఏప్రిల్ 12

వరుస విజయాలతో దూసుకుపోతున్న నాని, ఈ సమ్మర్‌లో కూడా మరో సినిమా రిలీజ్ చేయబోతున్నాడు. నేచురల్ స్టార్ డ్యూయల్ రోల్‌లో నటించిన సినిమా ఇది. మేర్లపాక గాంధీ డైరక్ట్ చేసిన ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్, రుక్సార్ మిర్ హీరోయిన్లుగా నటించారు. హిపాప్ తమీజా ఈ సినిమాకు సంగీతం అందించాడు.





భరత్ అనే నేను - ఏప్రిల్ 20

మహేష్ నటిస్తున్న మోస్ట్ ఎవెయిటింగ్ మూవీ ఇది. శ్రీమంతుడు లాంటి బ్లాక్ బస్టర్ మూవీ తర్వాత మహేష్-కొరటాల కాంబోలో వస్తున్న సినిమా కావడంతో భరత్ అనే నేనుపై అంచనాలు భారీస్థాయిలో ఉన్నాయి. దేవిశ్రీప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాతో కైరా అద్వానీ హీరోయిన్‌గా పరిచయం అవుతోంది. మూవీకి సంబంధించి త్వరలోనే ఫారిన్ షెడ్యూల్ ప్రారంభమౌతుంది.

కాలా - ఏప్రిల్ 27

సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన సినిమా కాలా. ఈ మూవీని ఏప్రిల్ 27న ఒకేసారి తెలుగు, తమిళ భాషల్లో విడుదల చేయబోతున్నారు. పా రంజిత్ డైరక్ట్ చేసిన ఈ సినిమాకు రజనీ అల్లుడు ధనుష్ నిర్మాత. తెలుగులో ఈ సినిమాను ఎన్వీ ప్రసాద్ రిలీజ్ చేస్తున్నారు.



నా పేరు సూర్య - మే 4

స్టయిలిష్ స్టార్ అల్లు అర్జున్ నటిస్తున్న సినిమా ఇది. వక్కంతం వంశీ డైరక్టర్‌గా పరిచయమౌతున్న ఈ సినిమాలో అను ఎమ్మాన్యుయేల్ హీరోయిన్‌గా నటిస్తోంది. కంప్లీట్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రాబోతోంది. ఈ సమ్మర్ బరిలో పూర్తిస్థాయి యాక్షన్ చిత్రం ఇదే. విశాల్-శేఖర్ అందించిన సంగీతం ఈ సినిమాకు స్పెషల్ ఎట్రాక్షన్ కానుంది.

సాక్ష్యం -మే 11

యంగ్ హీరో బెల్లంకొండ సాయిశ్రీనివాస్, బ్యూటిఫుల్ పూజా హెగ్డే హీరోహీరోయిన్లుగా నటిస్తున్న సాక్ష్యం సినిమా కూడా సమ్మర్ కానుకగా ముస్తాబవుతోంది. శ్రీవాస్ డైరక్ట్ చేస్తున్న ఈ సినిమా కంప్లీట్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోంది. అభిషేక్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మాత అభిషేక్ నామా ఈ సినిమాను ప్రొడ్యూస్ చేస్తున్నారు.

పంతం - మే 18

గోపీచంద్ కెరీర్‌లో ప్రతిష్టాత్మక 25వ చిత్రమిది. కొత్త దర్శకుడు చక్రవర్తి తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో గోపీచంద్ సరసన మెహ్రీన్ హీరోయిన్‌గా నటిస్తోంది. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై రాధామోహన్ నిర్మిస్తున్న ఈ సినిమా శరవేగంగా షూటింగ్ పూర్తిచేసుకుంటోంది. గోపీసుందర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నాడు.

18 నుంచి మల్టీస్టారర్ రెగ్యులర్ షూటింగ్

కింగ్ నాగార్జున, నేచురల్ స్టార్ నాని హీరోలుగా వైజయంతి మూవీస్ పతాకంపై టి.శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో అగ్ర నిర్మాత సి.అశ్వనీదత్ భారీ మల్టీస్టారర్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ మార్చి 18 ఉగాది రోజు నుంచి ప్రారంభం కానుంది.

అమెరికాలో మ్యూజిక్ సిట్టింగ్స్

ఈ సందర్భంగా అగ్రనిర్మాత సి.అశ్వనీదత్ మాట్లాడుతూ "మా వైజయంతి బేనర్‌లో మణిశర్మ చేసిన సినిమాలన్నీ మ్యూజికల్‌గా పెద్ద హిట్స్ అయ్యాయి. ఈ సినిమాని కూడా మ్యూజికల్‌గా బిగ్గెస్ట్ హిట్ చెయ్యాలని ఫుల్‌గా కాన్సన్‌ట్రేట్ చేస్తున్నారు. ప్రస్తుతం అమెరికాలో ఈ సినిమాలోని సాంగ్స్‌ని మణిశర్మ కంపోజ్ చేస్తున్నారు. మూడు పాటలకు సంబంధించిన మ్యూజిక్ సిట్టింగ్స్ అక్కడ జరుగుతున్నాయి. మార్చి 18 ఉగాది రోజు నుంచి రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ చేస్తున్నాం. మా బేనర్‌లో ఎన్నో మల్టీస్టారర్స్ చేశాం. అవన్నీ కమర్షియల్‌గా ఘనవిజయాల్ని అందుకున్నాయి. ఇప్పుడు నాగార్జున, నాని కాంబినేషన్‌లో చేస్తున్న మల్టీస్టారర్ కూడా బిగ్గెస్ట్ హిట్ అయి మా బేనర్‌కి మరింత మంచి పేరు తెస్తుంది" అన్నారు. దర్శకుడు టి. శ్రీరామ్ ఆదిత్య మాట్లాడుతూ - 'ఎంటర్‌టైనింగ్ వేలో సాగే డిఫరెంట్ సబ్జెక్ట్ ఇది. నాగార్జున, నాని వంటి హీరోలతో వైజయంతి బేనర్‌లో ఈ మల్టీస్టారర్ చెయ్యడం చాలా ఆనందంగా ఉంది' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, స్క్రిప్ట్ అడ్వైజర్: సత్యానంద్, సినిమాటోగ్రఫీ: శ్యామ్‌దత్, ఎడిటింగ్: ప్రవీణ్ పూడి, మాటలు: వెంకట్ డి. పతి, శ్రీరామ్ ఆర్. ఇరగం, స్క్రిప్ట్ అడ్వై జర్: సత్యానంద్, కో-డైరెక్టర్: తేజ కాకుమాను, ప్రొడక్షన్ కంట్రోలర్: మోహన్, నిర్మాత: సి.అశ్వనీదత్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: టి.శ్రీరామ్ ఆదిత్య.

మనం సైతం... సేవా సామ్రాజ్యంగా

ప్రముఖ నటుడు, సామాజిక సేవకుడు కాదంబరి కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మనం సైతం రోజు రోజుకూ తన సేవా సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటోంది. మనసున్న ఎంతో మంది మనం సైతంలో భాగమవుతున్నారు. తమకు వీలైనంత విరాళాలు అందిస్తున్నారు. మరోవైపు మనం సైతంను ఆశ్రయిస్తున్న ఆపన్నుల సంఖ్య కూడా విపరీతంగా పెరుగుతోంది. వాటిలో అత్యవసరంలో ఉన్న వాళ్లను ఎంపిక చేసి ఆర్థిక సహాయం అందిస్తోంది మనం సైతం. అలాంటి కొంతమందికి హైదరాబాద్ ఫిలిం ఛాంబర్‌లో ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు వీవీ వినాయక్, నిర్మాత సి కళ్యాణ్, దర్శకుడు జి.నాగేశ్వరరెడ్డి, శ్రీ మిత్రా చౌదరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న డ్రైవర్ యూనియన్ రాజు, లైట్ మెన్ కూతురు అనూజ, నటుడు థమ్ కొడుకు బాబు, దర్శకత్వ శాఖలో పనిచేస్తున్న ఉదయ్ కాంత్ తదితర పదమందికి చెక్‌లు అందజేశారు.

అనంతరం కాదంబరి కిరణ్ మాట్లాడుతూ మనల్ని మనం గౌరవంగా భావించుకున్నప్పుడే సాటి వారినీ గౌరవిస్తాం. చిత్ర పరిశ్రమలో నాకు కష్టాలు ఉన్నాయని ఎవరూ చెప్పుకోరు. అలా చెప్పుకుంటే అవకాశాలు ఇవ్వరు, దగ్గరకు రానీయరు అనే అపోహ ఉంది. అయితే నేను నా జీవితంలోని కష్టాలను పరిశ్రమలోని వాళ్లతో పంచుకున్నాను. వాళ్లు నన్ను దూరం పెట్టకుండా ఆదరించారు. అప్పుడే అనిపించింది ఈ భావన



తప్పని. మనకున్న బాధలను చెప్పుకోవడంలో తప్పు లేదు. ఇవాళ మనం సైతం ఇంతింతై విస్తరిస్తోంది. ఎంతోమంది కొత్తగా సేవాభావం ఉన్నవాళ్లు భాగస్వామ్యులు అవుతున్నారు. చిరంజీవి గారితో సహా పెద్దలంతా మమ్మల్ని ఆశీర్వదిస్తున్నారు. ఇవాళ వినాయక్ గారు, కళ్యాణ్ గారు లాంటి వాళ్లు మా సంస్థను దీవించదానికి వచ్చారు. వాళ్లకు

కృతజ్ఞతలు. అన్నారు.

దర్శకులు వీవీ వినాయక్ మాట్లాడుతూ మనం సైతం కార్యక్రమానికి నన్ను పిలిచినందుకు కాదంబరి కిరణ్‌కు కృతజ్ఞతలు. ఇదొక గొప్ప కార్యక్రమం. మనం సైతం సేవను కిరణ్ తన జీవితంలో భాగం చేసుకున్నారు. కష్టాల్లో ఉన్న వాళ్ల గురించి మాట్లాడుతుంటే ఆయన కళ్లలో నీళ్లు వస్తున్నాయి. అంతగా ఇతరుల బాధను పంచుకోవడం అద్భుతం. నా వంతుగా మనం సైతంకు లక్ష రూపాయలు విరాళం అందిస్తున్నాను. మాకు వేసే దండలు, శాలువాలు కూడా వద్దు. ఆ ఖర్చు కూడా పేదల సేవకు ఉపయోగించండి. ఇలాంటి సంస్థల్లో రాజకీయాలు చేరకుండా గొప్ప సంస్థగా తీర్చిదిద్దుతారని ఆశిస్తున్నా. నా సహాయ సహకారాలు మనం సైతంకు ఎప్పుడూ ఉంటాయి అన్నారు.

నిర్మాత సి. కళ్యాణ్ మాట్లాడుతూ పది మందితో ప్రారంభమైన మనం సైతంలో ఇప్పుడు లక్ష మంది సభ్యులయ్యారు. రేపు కోటి మంది ఇందులో చేరాలని కోరుకుంటున్నాను. కోటి మందిలో పది శాతం స్పందించినా పది లక్షల రూపాయల విరాళం అందుతాయి. మన చిత్ర పరిశ్రమలో ఎన్నో కష్టాలు ఉంటాయి అవన్నీ మనకు తెలుసు. మనం ఘనంగా పుట్టిన రోజులు జరుపుకుంటాం. ఆ ఖర్చులో పదిశాతం మనం సైతంకు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నాను. నిర్మాతలుగా మేము హీరోల, దర్శకుల పుట్టిన రోజులకు వేసే ప్రకటనల్లో కొన్ని సెంటీమీటర్లు తగ్గించి ఆ సొమ్ము మనం సైతంకు ఇస్తే చాలా బాగుంటుంది. మనం సైతం దేశవ్యాప్తంగా విస్తరించాలి అన్నారు.

దర్శకుడు జి. నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రతి మనిషికీ బాధ ఉంటుంది. ఆ బాధ తీర్చేందుకు ఓ అండ కావాలి. అది కాదంబరి కిరణ్ రూపంలో దొరుకుతున్నందుకు సంతోషంగా ఉంది. నా వంతుగా ఏడాదికి పాతిక వేల రూపాయలు మనం సైతంకు అందిస్తాను అన్నారు.

ప్రభాస్ పక్కన పూజా హెగ్డే



ప్రభాస్ ప్రస్తుతం యూవీ క్రియేషన్స్ నిర్మాణంలో సుజీత్ డైరక్షన్లో 'సాహో' మూవీలో నటిస్తున్నాడు. ప్రస్తుతం ఈ సినిమాలోని యాక్షన్స్ సీన్స్‌ను దుబాయ్‌లో తెరకెక్కిస్తున్నారు. ఈ ఏడాది చివర్లో 'సాహో' ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సినిమా తరువాత 'జిల్' డైరక్టర్ రాధాకృష్ణతో ప్రభాస్ సినిమా చెయ్యబోతున్నాడు. గోపికృష్ణ సంస్థలో కృష్ణం రాజు ఈ సినిమాను నిర్మించబోతున్నాడు. ఈ మూవీలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించనుందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఈ హీరోయిన్ బెల్లంకొండ శ్రీనివాస్‌తో 'సాక్ష్యం' సినిమాలో నటిస్తోంది. ఎన్టీఆర్, త్రివిక్రమ్ సినిమాలో కూడా కథానాయకిగా ఎంపికైన ఈమె మహేష్ బాబు, వంశీ పైడిపల్లి సినిమాలో కూడా నటించనుంది.



యూపీలో అతిపెద్ద సోలార్ ప్లాంట్

ప్రారంభించిన మోడీ, మాక్రాన్

దాదర్ కాలన్(యూపీ) : ఉత్తరప్రదేశ్‌లో అతిపెద్ద సోలార్ విద్యుత్ ప్లాంటును ప్రధాని నరేంద్రమోడీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ సోమవారం ప్రారంభించారు. యూపీలో ఏర్పాటు చేసిన అతిపెద్ద సోలార్ పవర్ ప్రాజెక్టు ఇదే. దీనిని మీర్జాపూర్ జిల్లాలోని చాన్వే బ్లాక్‌లో ఏర్పాటుచేశారు. మాక్రాన్, ఆయన భార్య బ్రిగిట్టెకు ఇక్కడి విమానాశ్రయంలో మోడీ, గవర్నరు రామ్‌నాయక్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఘనస్వాగతం పలికారు. మోడీ, మాక్రాన్ ఒకేసారి సోలార్ ప్యానెల్స్‌కు సంబంధించిన బటన్‌ను నొక్కి ప్రాజెక్టును ప్రారంభించారు. 75 మెగావాట్ల సామర్థ్యం గల ఆ విద్యుత్ ప్లాంట్‌ను ప్రజలకు అంకితమిచ్చారు.

ఫ్రాన్స్ సంస్థ ఈఎన్‌జీఐఈ రూ.500 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును నిర్మించింది. 380 ఎకరాల స్థలంలో 1,18,600 సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేశారు. ఉత్తరప్రదేశ్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ పరిధిలోని మీర్జాపూర్ రేంజిలోని జిగ్నా సబ్‌స్టేషన్‌కు విద్యుత్‌ను ఇక్కడి నుంచి సరఫరా చేస్తారు. ఈ ప్లాంటు ద్వారా ఏడాదికి 15.6 కోట్ల యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుందని, నెలకు 1.30 కోట్ల యూనిట్లు ఉత్పత్తి అవుతుందని అధికారులు తెలిపారు.

కొనసాగిన వాయిదాల పర్వం

- ఉభయ సభలు నేటికి వాయిదా
- వెల్ వద్ద టీడీపీ, టీఆర్ఎస్, తృణమూల్, ఏఐఏడీఎంకే, ఆప్ సభ్యుల ఆందోళన



న్యూఢిల్లీ : పార్లమెంట్ ఉభయ సభలు వరుసగా ఆరో రోజు సోమవారం కూడా ఎటువంటి కార్యకలాపాలను చేపట్టకుండానే వాయిదాపడ్డాయి. ప్రతిపక్ష, ఎన్డీయే మిత్రపక్షం టీడీపీ సభ్యులు సభలో గందరగోళం సృష్టించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పించాలని టీడీపీ, బ్యాంకింగ్ కుంభకోణంపై ప్రతిపక్షాలు, కావేరిజల నిర్వహణ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐఏడీఎంకే సభ్యులు సభలో గందరగోళం సృష్టించారు. రాజ్యసభలో వీరికి ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) సభ్యులు కూడా జతకలిశారు. ఢిల్లీలో సీలింగ్ డ్రైవ్‌కి అంతంపలకాలని కోరుతూ ఆందోళనకు దిగారు.

లోక్‌సభలో తీవ్ర గందరగోళం మధ్య ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ్‌ప్రతాప్ శుక్లా ఆర్థిక నేరస్థుల బిల్లు 2018ని ప్రవేశపెట్టారు. ఆర్థిక అక్రమాలకు పాల్పడిన వారి ఆస్తుల స్వాధీనానికి, రుణాలు ఎగవేసిన వారి నుండి బకాయిలను వసూలు చేయడానికి ఈ బిల్లు ఉద్దేశించబడింది. వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ పంజాబ్ నేషనల్ బ్యాంకులో రూ. 12,700 కోట్ల మేర అక్రమాలకు పాల్పడి విదేశాలకు పారిపోవడంతో నిరసనలు వ్యక్తమౌతున్న నేపథ్యంలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. వంద కోట్లు లేదా అంతకన్నా ఎక్కువ మొత్తం బకాయిలు ఉండి దేశం నుంచి పరారైన వారికి ఈ ప్రతిపాదిత చట్టం వర్తిస్తుంది. చిట్‌ఫండ్స్ (సవరణ) బిల్లు 2018ని కూడా మంత్రి ప్రవేశపెట్టారు. పార్లమెంట్ బడ్జెట్ రెండో విడత సమావేశాలు మార్చి 5న ప్రారంభమైన నాటి నుంచి ఇంతకు మించి కార్యకలాపాలు ఏమీ జరగలేదు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజ్యసభలో చర్చలో పాల్గొ గంట సమయం మినహా పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రతి రోజూ ఈ అంశాలపై గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి.

నేడు ప్రశ్నోత్తరాల సమయం ప్రారంభమైన వెనువెంటనే టీఆర్ఎస్, ఏఐఏడీఎంకే, వైఎస్ఆర్ కాంగ్రెస్ సభ్యులు వెల్ వద్దకు దూసుకువచ్చి ప్లకార్డులను ప్రదర్శించి తమ డిమాండ్లకు మద్దతుగా నినాదాలు చేయడంతో స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను వాయిదావేశారు. మధ్యాహ్నం సభ తిరిగి సమావేశమైన తరువాత శుక్లా ప్రవేశపెట్టిన రెండు బిల్లులతో సహా స్పీకర్ కార్యక్రమాలను చేపట్టేందుకు సమాయత్తం అవుతుంటే సభ్యులు తిరిగి గందరగోళం సృష్టించారు. బీజేడీ సభ్యులు భర్తృహరి మహతాబ్ ఆర్థిక నేరస్థులబిల్లును ప్రవేశపెట్టడం పట్ల వ్యతిరేకత తెలిపారు. ఈ బిల్లులోని నిబంధనలు ప్రజల ప్రాథమిక హక్కులను ఉల్లంఘించే విధంగా ఉన్నాయని అన్నారు. దోషులు అమాయకులుగా నిరూపించుకునేందుకు అవకాశం ఉందని అన్నారు. దోషిగా నిరూపితం కాకముందే నిందితుల ఆస్తులు స్వాధీనం చేసుకునే అవకాశం ఉండాలని అన్నారు. బిల్లుపై చర్చ సందర్భంగా ఈ నిబంధనలపై చర్చించవచ్చునని శుక్లా అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసం టీడీపీ సభ్యులు వెల్ వద్దకు వచ్చి ప్లకార్డులను చేబూని నినాదాలు చేశారు. తెలంగాణలో రిజర్వేషన్లు పెంచాలని టీఆర్ఎస్ సభ్యులు డిమాండుచేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కావేరిజల నిర్వహణ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐఏడీఎంకే సభ్యులు డిమాండు చేశారు.

రాజ్యసభలో కూడా ఇదేవిధమైన పరిస్థితులు చోటు చేసుకున్నాయి. సభ సమావేశమైన వెనువెంటనే టీడీపీ, వైఎస్ఆర్ కాంగ్రెస్, టీఎంసీ, ఏఐఏడీఎంకే, ఆప్ సభ్యులు ఆయా డిమాండ్లపై ఆందోళన ప్రారంభించారు. సభ్యులను శాంతింపచేసి జీరో అవర్‌ని నిర్వహించేందుకు చైర్మన్ ఎం. వెంకయ్యనాయుడు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దానితో మధ్యాహ్నం 2 గంటల వరకు ఆ తరువాత మంగళవారానికి వాయిదావేశారు.

'2జీ సెక్ట్రమ్' దర్యాప్తు ఆరు నెలల్లో పూర్తి చేయండి

సీబీఐ, ఈడీలకు సుప్రీం ఆదేశం



న్యూఢిల్లీ : 2జీ స్పెక్ట్రమ్ కేటాయింపులు, ఈ అంశానికి సంబంధించిన ఇతర కేసులన్నింటిపై దర్యాప్తును ఆరుమాసాలలోగా పూర్తిచేయాలని సుప్రీంకోర్టు సోమవారం దర్యాప్తు ఏజెన్సీలు సీబీఐ, ఈడీలను ఆదేశించింది. 2జీ స్పెక్ట్రమ్ కుంభకోణం, ఎయిర్‌సెల్-మాక్సిస్ ఒప్పందంతో సహా ఈ అంశానికి సంబంధించిన ఇతర కేసుల్లో దర్యాప్తు ఏ స్థాయిలో ఉందో నివేదికను రెండు వారాలలో సమర్పించాలని జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ నవీన్ సిన్హాలతో కూడిన ధర్మాసనం కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ కేసు దర్యాప్తు ప్రారంభించి దీర్ఘకాలం గడిచిపోయిందని, సున్నితమైన ఇటువంటి అంశాలలో ప్రజలకు వాస్తవాలు తెలియజేయాల్సిన అవసరం వుందని ధర్మాసనం అభిప్రాయపడింది. 2జీ స్పెక్ట్రమ్ కేసులో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా 2014లో నియమించిన సీనియర్ న్యాయవాది ఆనంద్ గ్రోవర్‌ని అత్యున్నత న్యాయస్థానం రిలీవ్ చేసింది. ఈ కేసులో ఎస్‌పీపీగా గ్రోవర్ స్థానంలో అదనపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతను నియమించాలన్న కేంద్రం నిర్ణయానికి సర్వోన్నత న్యాయస్థానం ఆమోదం తెలిపింది.

రాజ్యసభకు జైట్లీ నామినేషన్



లక్నో : కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ సోమవారం ఉత్తరప్రదేశ్(యూపీ) నుంచి రాజ్యసభ ఎన్నికలకు నామినేషన్ వేశారు. నామినేషన్ పత్రాలను ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ హాల్ టాన్‌డన్‌లో యుపి బీజేపి చీఫ్ మహేంద్ర నాథ్ పాండే, ఉప ముఖ్యమంత్రులు కేశవ్ ప్రసాద్ మౌర్య, దినేష్ శర్మ యూపీ మంత్రులు శ్రీకాంత్ శర్మ, అనుపమ జైశ్వాల్, పార్టీ నాయకులు హీరో భాజ్‌పేయ్ సమక్షంలో దాఖలు చేశారు. బీజేపి ప్రకటించిన అభ్యర్థుల్లో జైట్లీతో పాటు అశోక్ భాజ్‌పేయ్, విజయ్ పాల్ సింగ్ తోమర్, సకల్ దీప్ రాజ్‌భార్, కంటా కర్ధమ్, అనిల్ జైన్, హరనాథ్ యాదవ్, జీవీఎల్ నరసింహరావు వున్నారు. జైట్లీ నామినేషన్ సమయంలో యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వారణాసిలో ప్రధాని నరేంద్రమోడీ పర్యటనలో వున్నారు. సోమవారం నామినేషన్‌లకి ఆఖరి రోజు. అవసరమైతే ఎన్నికలు మార్చి 23న నిర్వహిస్తారు.

యూపీ ఉప ముఖ్యమంత్రి దినేష్ శర్మ మీడియాతో మాట్లాడుతూ తమ రాజ్యసభ అభ్యర్థుల జాబితా పరిశీలిస్తే ప్రతిభ ఆధారంగా అన్ని ప్రాంతాలకు ప్రాతినిధ్యం కల్పించామనీ బీజేపి ప్రత్యేకత ఇదేనని అన్నారు.



లండన్‌లో 'కట్టప్ప' మైనపు విగ్రహం

ప్రభాస్ తర్వాత సత్యరాజ్‌కు..!

చెన్నై: సీనియర్ నటుడు సత్యరాజ్‌కు అరుదైన గౌరవం దక్కింది. లండన్‌లోని ప్రతిష్ఠాత్మక మేడం టుసాడ్స్ మ్యూజియంలో 'కట్టప్ప' మైనపు విగ్రహాన్ని ఉంచబోతున్నారు. సత్యరాజ్ సినీ కెరీర్‌లో ఓ మైలురాయిగా నిలిచిపోయిన పాత్ర 'కట్టప్ప'. ఆయన నటించిన అన్ని చిత్రాలు ఓ ఎత్తైతే.. 'బాహుబలి' మరో ఎత్తుగా నిలిచింది. మాహిష్మతి సామ్రాజ్యానికి కట్టు బానిస అయిన 'కట్టప్ప' పాత్రలో ఆయన్ని తప్ప మరొకర్ని వూహించుకోలేమంటే అతిశయోక్తి కాదు. అంతగా ఆ పాత్ర ప్రేక్షకులకు దగ్గరైంది. 'కట్టప్ప బాహుబలిని ఎందుకు చంపాడు?' అనే ప్రశ్న ప్రథమార్థం 'బాహుబలి' విడుదల తర్వాత సినీ అభిమానుల్ని వెంటాడింది. ఆ తర్వాత 'బాహుబలి 2'తో ఆ ప్రశ్నకు సమాధానం దొరికింది.కాగా 'బాహుబలి'లో 'అమరేంద్ర బాహుబలి', 'మహేంద్ర బాహుబలి'గా నటించి, మెప్పించిన ప్రభాస్ మైనపు విగ్రహాన్ని ఇప్పటికీ లండన్ మేడం టుసాడ్స్ మ్యూజియంలో ప్రదర్శనకు ఉంచారు. సత్యరాజ్ విగ్రహాన్ని కూడా త్వరలో ఉంచబోతున్నారు. ఈ విషయాన్ని సత్యరాజ్ కుమారుడు, నటుడు సిబిరాజ్ సోషల్‌మీడియా వేదికగా తెలిపారు. ఈ ఘనతను సొంతం చేసుకుంటున్న తొలి తమిళ నటుడు తన తండ్రి సత్యరాజ్ కావడం చాలా గొప్పగా ఉందంటూ సంతోషం వ్యక్తం చేశారు .ఇదే సందర్భంగా సినీ నటులు ఖుష్బూ, మహేంద్రన్, ప్రసన్న తదితరులు సత్యరాజ్‌కు శుభాకాంక్షలు చెప్పారు. ఇది గర్వించదగ్గ తరుణం అని ట్వీట్లు చేశారు. సత్యరాజ్‌ను 'కట్టప్ప'గా ఈ స్థాయిలో వెండి తెరపై చూపించిన దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళిని, చిత్ర బృందాన్ని ప్రశంసించారు. 'బాహుబలి', 'బాహుబలి 2' చిత్రాలు ప్రపంచ వ్యాప్తంగా విజయ ఢంకా మోగించిన సంగతి తెలిసిందే. ఈ చిత్రాల ద్వారా తెలుగు చిత్ర పరిశ్రమ ఖ్యాతి అంతర్జాతీయంగా పెరిగింది.

అహం వదలండి

- రైతుల డిమాండ్లు ఆమోదించండి
- మోడీ, ఫడ్నవిస్‌కు రాహుల్ విజ్ఞప్తి



న్యూఢిల్లీ : 'మీ అహాన్ని పక్కన పెట్టండి. ముంబైలో ఆందోళన చేస్తున్న వేలాదిమంది రైతులు, గిరిజనుల డిమాండ్లు ఆమోదించండి' అని ప్రధాని నరేంద్రమోడీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌లకు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ విజ్ఞప్తి చేశారు. రైతులు ముంబైకి నిర్వహించిన మహా ప్రదర్శనే ప్రజాశక్తికి దిమ్మతిరిగే ఉదాహరణ అని రాహుల్ స్పష్టంచేశారు. రైతులు, గిరిజనుల కష్టాల గురించి తెలియజేయడానికి ఇంతకన్నా ఆందోళన ఇంకేముంటుందని రాహుల్ ప్రశ్నించారు. ఈ మేరకు రాహుల్ సోమవారం ట్వీట్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణికి వ్యతిరేకంగా ఆందోళన నిర్వహిస్తున్న రైతులు, గిరిజనులకు కాంగ్రెస్ అండగా ఉంటుందని ఆయన చెప్పారు.

అహాన్ని విడనాడాలని ప్రధాని మోడీ, సీఎం ఫడ్నవిస్‌కు విజ్ఞప్తి చేస్తున్నానని, తక్షణమే రైతుల డిమాండ్లు అంగీకరించాలని రాహుల్ కోరారు. మరోవైపు, రైతులు, గిరిజనుల డిమాండ్ల పట్ల తమ ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఫడ్నవిస్ పేర్కొన్నారు. అసెంబ్లీలో ప్రతిపక్ష నేత రాధాకృష్ణ వికేపాటిల్ లేవనెత్తిన ప్రశ్నకు ఫడ్నవిస్ పైవిధంగా సమాధానమిచ్చారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో భాగంగా రైతులు, గిరిజనులు వేలాదిమంది నాసిక్ నుంచి ముంబైకి మహా ప్రదర్శన నిర్వహించారు. రైతులు శాంతియుతంగా ప్రదర్శన నిర్వహించడాన్ని వికేపాటిల్ ప్రశంసించారు. రైతుల రాకతో దక్షిణ ముంబైలోని ఆజాద్ మైదాన్ ఉదయం నుంచే జనసంద్రంగా మారింది. రైతులంతా ఎర్రజెండాలు చేబూని గొప్ప చారిత్రాత్మక ప్రదర్శన నిర్వహించారు. నాసిక్ నుంచి ఆరు రోజుల క్రితం ప్రారంభమైన రైతుల మహా ప్రదర్శన నేటికి ముంబైకి చేరుకున్నది. 180 కిలోమీటర్ల దూరం పాదయాత్ర సాగింది. బేషరతుగా రుణమాఫీ, ఏళ్ల తరబడి తమ సాగుబడిలో ఉన్న అటవీ భూమిని గిరిజనులకు బదిలీ చేయాలని డిమాండు చేస్తూ రైతులు ఆందోళనకు దిగారు. రైతుల ఆందోళనకు కాంగ్రెస్, ఎన్‌సీపీ, సీపీఎం, సీపీఐ, శివసేన పార్టీలు మద్దతు పలికాయి.



ఒక్క టవల్ వందలమందిని కాపాడింది

పాట్నా: ఒక్క టవల్ వందలమందిని ఎలా కాపాడుతుంది అనిపిస్తుంది కదా! ఆ టవల్ వెనక ఒక గ్రామస్థుడి సమయస్ఫూర్తి, అప్రమత్తత ఉన్నాయి. రైలు పట్టాల నుంచి అతడికి వినిపించిన శబ్దంలో తేడా గుర్తించి చాకచక్యంగా వ్యవహరించడంతో వందల మంది ప్రయాణికుల ప్రాణాలు కాపాడాడు. బీహార్ రాష్ట్రంలోని కతిహార్ జిల్లాలో రెండు రోజుల క్రితం ఈ సంఘటన చోటుచేసుకుంది. శుక్రవారం రోజు ఒక గ్రామస్థుడు రైల్వే పట్టాల వైపు వెళ్తున్నాడు. అప్పటికే కామాఖ్య-రాజేంద్ర నగర్ రాజధాని ఎక్స్‌ప్రెస్ వెళ్లిపోయింది. అయితే అతడికి రోజూ వినిపించే శబ్దానికి భిన్నమైన శబ్దం అతడికి వినిపిస్తూనే ఉంది. అసలు అది ఎక్కడి నుంచి వస్తుందా అని గమనించగా ఒక పట్టాలకు నెర్రలున్నట్లు గమనించాడు. అది ఢిల్లీ-గౌహతి-దిబ్రుఘర్ రాజధాని ఎక్స్‌ప్రెస్ వచ్చే సమయం. వెంటనే అతడు తన దగ్గరున్న ఒక టవల్‌ను ఊపసాగాడు. కానీ డ్రైవర్‌కు ఆ విషయం అర్థం కాకపోవడంతో రైలు ముందుకు వస్తూనే ఉంది. అయినా ఆ గ్రామస్థుడు తన ప్రయత్నాన్ని విరమించలేదు. ఎలాగైనా రైలును ఆపాలని ఇంజన్ వైపుకు రాళ్లు విసరడం మొదలు పెట్టాడు. దీన్ని గమనించిన డ్రైవర్ అత్యవసర బ్రేక్‌ను ఉపయోగించాడు. అయినా రైలింజన్, మూడు బోగీలు దెబ్బతిన్న ట్రాకును దాటాయి. 'అదృష్టం కొద్దీ ఏ ప్రమాదం చోటుచేసుకోలేదు. ప్రయాణికులందరూ సురక్షితంగా ఉన్నారు' అని తూర్పు మధ్య రైల్వే ప్రధాన ప్రజా సంబంధాల అధికారి మీడియాకు వెల్లడించారు. అనంతరం ఆ గ్రామస్థుడి సమయస్ఫూర్తిని అభినందించారు.

బీఎస్ఎఫ్‌లో ఇంటిదొంగల కలకలం

న్యూఢిల్లీ : దేశ భద్రతలో కీలక పాత్ర పోషించే సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్)లో ఇంటిదొంగల వ్యవహారం కలకలం రేపుతున్నది. శత్రుదేశాల ఏజెంట్లు, అసాంఘిక శక్తులతో కుమ్మక్కైన కొందరు సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఇటీవల వెలుగు చూడటంతో అధికారులు అంతర్గత నిఘాను పటిష్టం చేశారు. విలాసవంతమైన జీవనం గడుపుతూ, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సిబ్బందిపై కన్నేసి ఉంచాలని, వారి కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని నిర్ణయించారు. ఈ మేరకు 2017 సంవత్సరానికి గానూ అనుమానితుల జాబితాను సిద్ధం చేసినట్లు



తెలిసింది. ఇటీవలే బంగ్లాదేశ్ సరిహద్దులో ఉగ్రవాదులకు సహకరిస్తోన్న బీఎస్ఎఫ్ కమాండింగ్ అధికారిని సెంట్రల్ ప్రోబ్ ఏజెన్సీ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అతని వద్ద నుంచి 45 లక్షల రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. 2.5 లక్షల సిబ్బంది కల్గిన బీఎస్ఎఫ్ ప్రతిష్టను కాపాడటం కోసమే ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. ఇది ఎవరి మనోభావాలు దెబ్బతియడానికి కాదని స్పష్టం చేశారు.

ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్ : జమ్మూ, కాశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లాలో భద్రతాదళాలు, ఉగ్రవాదుల మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారని ఆర్మీ అధికారులు సోమవారం తెలిపారు. జిల్లాలోని హకురాలో ఆదివారం రాత్రి నుంచి ఆపరేషన్ మొదలైందని చెప్పారు. హతమైన ముగ్గురిలో ఇద్దరిని మాత్రమే గుర్తించినట్టు తెలిపారు.ఎన్‌కౌంటర్ స్థలం నుంచి ఏకే 47 రైఫిల్స్, పిస్తోళ్లు, హ్యాండ్‌గ్రేడ్స్ ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

బన్లోవత్ గ్రామం మద్యపాన రహితం

రాంచి : తమ రాష్ట్రంలో మద్యపాన రహిత గ్రామంగా రాంచీ జిల్లాలోని బన్లోవత గ్రామం మొదటి స్థానంలో నిలిచిందని, ఈ విజయం సాధించిన గ్రామ ప్రజలను జార్ఖండ్ రాష్ట్ర ముఖ్యమంత్రి రఘువీర్ దాస్ అభినందించారని జిల్లా అధికారులు పేర్కొన్నారు. మద్యపాన రహిత గ్రామంగా మారిన ఏ గ్రామానికైనా దాని అభివృద్ధికి ఒక లక్ష రూపాయల నగదు ఇస్తామని రెండేళ్ల క్రితం సీఎం ప్రకటించారని, ఆ మేరకు బన్లోవత్ గ్రామాభివృద్ధికి నగదును అందించినట్టు చెప్పారు.

తలాక్‌పై ముస్లిం మహిళల మౌన ప్రదర్శన

సికార్ : ట్రిపుల్ తలాక్ బిల్లును వ్యతిరేకిస్తూ రాజస్థాన్‌లోని సికార్ జిల్లాలో ముస్లిం మహిళలు సోమవారం మౌనప్రదర్శన చేపట్టారు. ముస్లిం మహిళల వివాహ హక్కు రక్షణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ వారు ప్లకార్డులు చేతబూని సికార్‌లో ఇద్గాహ్ చౌక్ నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు ప్రదర్శన జరిపారు. బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండు చేశారు. అనంతరం ముస్లిం మహిళల ప్రతినిధి బృందం అదనపు జిల్లా కలెక్టర్‌కు మెమొరాండం ఇచ్చింది.

ఆప్ ఎమ్మెల్యేకు బెయిల్ మంజూరు

న్యూఢిల్లీ : ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్షు ప్రకాష్‌పై దాడి కేసులో ఆప్ ఎమ్మెల్యే అమానుతుల్లా ఖాన్‌కు ఢిల్లీ హైకోర్టు సోమవారం బెయిల్ మంజూరు చేసింది. ఫిబ్రవరి 21న అరెస్టయిన ఓక్లా ఎమ్మెల్యేకి జస్టిస్ ముక్తా గుప్తా బెయిల్ మంజూరు చేశారు. 20 రోజుల కంటే పైగా జైల్లో గడిపిన ఆయనకు కస్టడీ విచారణ అవసరం ఇక లేకపోవడంతో పిటిషనర్‌కు బెయిల్ మంజూరు చేసినట్టు కోర్టు పేర్కొంది.

మిజోరాం విమానాశ్రయంలో అగ్నిప్రమాదం

ఐజ్వాల్ : మిజోరాంలోని లెంగ్‌పుయ్ విమానాశ్రయంలో అగ్నిప్రమాదం సంభవించింది. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్ (ఏటీసీ)లో మంటలు చెలరేగాయని, అయితే ఎవరికీ ఏ ప్రమాదం జరగలేదని, కొన్ని వస్తువులు కాలి బూడిదయ్యాయని అధికారులు తెలిపారు. విమాన రాకపోకలు సాఫీగానే సాగాయని తెలిపారు. ఉదయం 9.30 గంటలకు మంటలు చెలరేగాయని, అరగంటలో మంటలను అదుపు చేసినట్టు చెప్పారు. షార్ట్ సర్క్యూట్ ప్రమాదానికి కారణంగా భావిస్తున్నట్టు తెలిపారు.

ఐదుగురు విచారణలో ఉన్న ఖైదీలకు ఎయిడ్స్

ముజఫర్‌నగర్ : ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ జైలులో ఐదుగురు విచారణలో ఉన్న ఖైదీలకు హెచ్‌ఐవీ పాజిటీవ్ ఉందని వైద్యపరీక్షల్లో తేలిందని అధికారులు సోమవారం తెలిపారు. రాష్ట్ర అధికారుల ఆదేశాలననుసరించి వైద్య పరీక్షలు నిర్వహించామని జైల్ సూపరింటెండెంట్ ఏకే సక్సేనా తెలిపారు. గతంలో గోరఖ్‌పూర్ జైలులో ఖైదీలకు వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో 24 మందికి హెచ్‌ఐవీ పాజిటివ్ అని తేలింది.

యూపీలో అంబేద్కర్ శిలాఫలకం ధ్వంసం

ముజఫర్‌నగర్ : ఉత్తరప్రదేశ్‌లోని భోఫా నగర్‌లో జావాద్ గ్రామంలోని పంచాయతీ భవనంలో వెలుపల ఉన్న బీఆర్ అంబేద్కర్ చిత్రం ఉన్న శిలాఫలకాన్ని దుండగులు ఆదివారం రాత్రి ధ్వంసం చేశారని పోలీసులు సోమవారం తెలిపారు. ఈ ఘటనను వ్యతిరేకిస్తూ, దళిత వర్గం, దళిత సేన కార్యకర్తలు నిరసన ప్రదర్శన జరిపారు. పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని దుండగులపై కఠినచర్యలు తీసు కుంటామని, అదేచోట శిలాఫలకాన్ని తిరిగి స్థాపించేందుకు ఏర్పాట్లు చేయిస్తామని సీఐ నిరసనకారులకు హామీ ఇచ్చిన అనంతరం వారు తమ ఆందోళనను విరమించారని తెలిపారు.

బొగ్గు కేసులో సీబీఐకు ఢిల్లీ కోర్టు అక్షింతలు

న్యూఢిల్లీ : పారిశ్రామికవేత్త నవీన్ జిందాల్ పాత్ర ఉన్న బొగ్గు కుంభకోణం కేసులో నిందితుడికి పత్రాలు ఇవ్వకుండా గతంలో ఇచ్చిన ఆదేశాలను బేఖాతరు చేయడంపై ప్రత్యేక కోర్టు సీబీఐపై ఆగ్రహం వ్యక్తంచేసింది. మధ్యప్రదేశ్‌లో అర్టాన్ నార్త్ కోల్ బ్లాక్ కేటాయింపునకు సంబంధించిన ఈ కేసులో పత్రాలు పరిశీలించేందుకు ప్రత్యేకకోర్టు జడ్జి భరత్ ప్రసార్ విచారణను ఏప్రిల్ 10కి వాయిదా వేశారు.

గోవా రాష్ట్రేతరులకు భూముల అమ్మకం వద్దు

పనాజీ : గోవా రాష్ట్రేతరులకు వ్యవసాయ భూములను అమ్మడాన్ని నిషేధిస్తూ ఒక చట్టాన్ని తేవాలని ఆ రాష్ట్ర ఎమ్మెల్యే మైఖెల్ లోబో సోమవారం పేర్కొన్నారు. గోవాకు కర్ణాటకకు చెందిన లామని తెగకు చెందిన వలసలకు షెడ్యూల్ ట్రైబ్ (ఎస్‌టీ) హోదాపై మద్దతుకు సంబంధించి సోషల్ మీడియాలో ఒక ప్రకటన వచ్చిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గోవా డిప్యూటీ స్పీకర్ కూడా అయిన ఆయన మాట్లాడుతూ, గోవా రాష్ట్రేతరులకు వ్యవసాయ భూముల అమ్మకాలను నిలిపివేస్తూ చట్టాన్ని తేవాల్సిన అవసరం ఉందని, దీనిపై తాను అసెంబ్లీలో మాట్లాడుతానని చెప్పారు.

మేఘాలయ స్పీకర్ డన్‌కుపార్ రాయ్

షిల్లాంగ్ : మేఘాలయ శాసనసభ స్పీకర్‌గా యూనైటెడ్ డెమొక్రటిక్ పార్టీ (యూడీపీ) అధ్యక్షుడు డన్‌కుపార్ రాయ్ ఎన్నికయ్యారు. 56 ఓట్లకు ఆయన 35 ఓట్లను దక్కించుకున్నారని తాత్కాలిక స్పీకర్ తిమోతి డి షిరా తెలిపారు. ప్రతిపక్ష కాంగ్రెస్ అభ్యర్థి డీ సంగ్మాకు కేవలం 20 ఓట్లు మాత్రమే దక్కాయి. మంత్రులు జేమ్స్ కె సంగ్మా, సామ్లిన్ మలంగియాంగ్, బంటైడోర్ లింగ్డోహ్, కైమెన్ షిల్లా రాయ్ పేరును ప్రతిపాదించారు.

హాస్పిటల్ నుంచి తప్పించుకున్న ఖైదీ

మాల్దా(పశ్చిమబెంగాల్): నాలుగు రోజుల నుంచి అనారోగ్యంతో ఇక్కడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బంగ్లాదేశ్‌కు చెందిన విచారణ ఖైదీ సోమవారం తప్పించుకున్నాడు.ఖైదీ తాడును ఉపయోగించి ఆసుపత్రి టాయిలెట్ కిటికీ నుండి తప్పించుకున్నట్లు ఆసుపత్రి సిబ్బంది పోలీసులకు తెలిపారు. బంగ్లాదేశ్ నాగోన్‌కు జిల్లాకు చెందిన షేక్.షఫికుల్‌ను వివిధ ఆరోపణల క్రింద పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం అతని కోసం గాలిస్తున్నారు.

అధికారిని చితకబాది ఆరు లక్షల దోపిడీ

శ్రీనగర్: బ్యాంకు అధికారి నుంచి ఆరు లక్షల రూపాయలు దోచుకున్న ఘటన దక్షిణ కాశ్మీర్‌లో కుల్గాం జిల్లాలో సోమవారం చోటు చేసుకుంది.ఆ అధికారి కుల్గాం నుంచి బ్యాంకుకు వెళ్తుండగా అటాకాయించి డబ్బు దోచుకున్నారు.దుండగులు అధికారిని తీవ్రంగా కొట్టి డబ్బులు తీసుకున్నారని పోలీసులు చెప్పారు.విచారణ జరుగుతున్నది.

మృత్యుంజయుడు.. ఈ బాలుడు...

దేవాస్ : ఆడుకుంటూ వెళ్లి బోరుబావిలో జారిపడిన నాలుగేళ్ల బాలుడు మృత్యుంజయుడిగా బయటపడ్డాడు. ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని దేవాస్ జిల్లా ఉమేరియా గ్రామంలో జరిగింది. వివరాలల్లోకి వెళితే..4ఏళ్ల రోషన్ శనివారం పొలం వద్ద ఆడుకుంటూ ఉదయం 11 గంటల సమయంలో బోరుబావిలో పడిపోయాడు. వెంటనే సమాచారం అందుకున్న ఆర్మీ బృందం రంగంలోకి దిగి.. 150 అడుగుల లోతున్న బోరు బావిలో 30 అడుగుల లోతున చిక్కుకున్న బాలుడ్ని రక్షించేందుకు 35 గంటలపాటు శ్రమించింది. తొలుత బోరుబావికి సమాంతరంగా గొయ్యి తవ్వి తీసే ప్రయత్నం చేసిన బృందం తర్వాత ఆ ప్రయత్నాన్ని విరమించుకొని పై నుంచే తాడు ద్వారా ఓ ఉచ్చును లోపలికి పంపించారు. బాలుడి చేతికి తగిలించుకోవాలని చెప్పగా, రోషన్ వారు చెప్పినట్టే చేశాడు. దీంతో తాడుతోనే బాలుడిని ఆదివారం రాత్రి 10.45 గంటలకు పైకి లాగారు. వెంటనే సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.



కార్మిక నేత ప్రకాష్‌రావు మృతి

విశాలాంధ్ర- అనంతపురం : ఏఐటీయూసీ సీనియర్ నాయకులు డీబీ ప్రకాష్‌రావు (83) ఆదివారం రాత్రి అనంతపురంలోని స్వగృహంలో మరణించారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. నీటిపారుదల శాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేసిన ప్రకాష్‌రావు 1992లో పదవీ విరమణ పొందారు. అనంతరం ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాలకు నాయకత్వం వహించారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కొనసాగిన పోరాటాలకు నేతృత్వం వహించారు. ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులుగా, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా పనిచేశారు. ప్రకాష్‌రావు భౌతికకాయానికి సోమవారం సీపీఐ జిల్లా కార్యదర్శి డి.జగదీష్, సహాయ కార్యదర్శులు సి.జాఫర్, పి.నారాయణస్వామి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జె.రాజారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆమీనమ్మ, సి.లింగమయ్య, నగర కార్యదర్శి ఎన్. శ్రీరాములు, సహాయ కార్యదర్శులు కె.అల్లీపీరా, బి.రమణ, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎ.పద్మావతి, ఏఐటీయూసీ నాయకులు రాజేష్‌గౌడ్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల్లో కార్మిక నాయకులు, సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



అంతర్ రాష్ట్ర బదిలీలకు అవకాశమివ్వండి

విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : తెలంగాణలో ఆంధ్రప్రదేశ్ స్థానికత కలిగిన ఉపాధ్యాయులను రాష్ట్ర విభజన తర్వాత స్వంత రాష్ట్రాలకు బదిలీ చేయమంటూ నాలుగేళ్లుగా ప్రభుత్వాలను అభ్యర్థిస్తున్నా స్పందించడంలేదని నాన్ లోకల్ టీచర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (ఎన్‌ఎల్‌టిఎ) నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. నాన్ లోకల్ టీచర్స్ ఆఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం విజయవాడ ధర్నా చౌక్ వద్ద దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర అధ్యక్షులు ఎం.మోహనరావు మాట్లాడుతూ రాష్ట్ర విభజన నేపథ్యంలో స్థానికేతరులుగా మారిన ఉపాధ్యాయులను మానవతా దృక్పథంతో తమ స్వరాష్ట్రంలోని స్వంత జిల్లాలకు వెళ్లడానికి అంతర్ రాష్ట్ర బదిలీలకు అవకాశం ఇవ్వాలని ప్రభుత్వాలను కోరుతున్నామన్నారు. 2014 జూన్ 2వ తేదీన అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన డీఎస్సీలలో టాప్ 20 (అన్ రిజర్వ్ పోస్టులలో మొదటి 20 శాతం) కోటాలో వివిధ స్థానికేతర జిల్లాలలో తాము ఉపాధ్యాయులుగా ఎంపిక కాబడ్డామన్నారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో తిరిగి స్వరాష్ట్రానికి రావడానికి అవకాశం కల్పించాలని ప్రభుత్వాలను కోరుతున్నా స్పందించలేదన్నారు. అంతర్ రాష్ట్ర బదిలీలు రాష్ట్రస్థాయి ఉద్యోగులకే తప్పా మిగిలిన జిల్లా, జోనల్, మల్టీ జోనల్ వాళ్లకు అమలు చేయకపోవడంతో తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల ఉద్యోగులను ఒక పర్యాయం అంతర్ రాష్ట్ర బదిలీలకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం వైస్ ప్రెసిడెంట్ ఎస్.రామానాయుడు, జనరల్ సెక్రటరీ వి.సూర్యనారాయణ, సెక్రటరీ బి.రామకృష్ణ, ట్రెజరర్ ఎస్.ఉమామహేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ ఎ.సూర్యనారాయణ, జి.మాధవరావు, పి.ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
కలక్టరు వారి కార్యాలయం, శ్రీకాకుళం

రేఖా నెం. 2608/2017 జి.3 | ఫారం-VII | తేది: 04-03-2018

రూఢీ ప్రకటన

పెడ్యూలు

గ్రామము: నరదాం | మండలం: ఎల్.ఎన్.పేట | జిల్లా: శ్రీకాకుళం

క్రమ సంఖ్య	సర్వే నెం	వర్గీకరణ	మొత్తం విస్తీర్ణం ఎకరాలు	భూసేకరణ కొరకు తీసుకొన్న విస్తీర్ణం	సంబంధిత ఆసామీ పేరు మరియు చిరునామా	సరిహద్దులు: ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు మరియు ఇతరములు
1	2	3	4	5	6	7	8	9	10	11
1	27-1B	పల్లం	0.52	0.20	[illegible]	Sy.No.79	2A2	Bottadasingi (V)	1A	కొబ్బరి-12, టేకు-10, [illegible]-1
2	27-2A2	పల్లం	0.79	0.43	[illegible]	1B, Bottadasingi (V)	3A2	2B	2A1	టేకు-1, కొబ్బరి-1
3	27-2C1	పల్లం	0.84	0.07	[illegible]	Bottadasingi (V)	3C1	2C2	2B	కొబ్బరి-4, టేకు-1
4	27-3A2	పల్లం	0.94	0.28	[illegible]	2A2	Sy.No.28	2B	3A1	
5	27-3C1	పల్లం	0.46	0.12	[illegible]	2C1	Sy.No.28	3C2	2B	
6	28-1A2	పల్లం	0.97	0.28	[illegible]	Sy.No.27	2A2	1B	1A1	
7	28-1C1	పల్లం	0.43	0.20	[illegible]	Sy.No.27	2C1	1C2	1B	
8	28-2A2	పల్లం	1.03	0.24	[illegible]	1A2	Sy.No.29	1B	2A1	
9	28-2C1	పల్లం	0.32	0.23	[illegible]	1C1	Sy.No.29 & Bottadasingi (V)	2C2, Bottadasingi	1B	
10	29-1A2	పల్లం	1.26	0.27	[illegible]	Sy.No.28	2A2	1B	2A1	
11	29-1C	పల్లం	0.09	0.09	[illegible]	Sy.No.28	Bottadasingi (V)	Bottadasingi (V)	1B	
12	29-2A2	పల్లం	1.82	0.24	[illegible]	1A2	Sy.No.30	1B	2A1	
13	30-2	పల్లం	2.62	0.22	[illegible]	Sy.No.29	Sy.No.31	Bottadasingi (V)	1	
14	31-1A2	పల్లం	4.48	0.29	[illegible]	Sy.No.30, Bottadasingi	2B	Bottadasingi	1A1	
15	31-1A3	పల్లం		0.12	[illegible]	2B	Sy.No.37	Bottadasingi	1A1	
16	31-2B	పల్లం	0.24	0.14	[illegible]	1A2	1A3	Bottadasingi	2A	
17	37-1A2	పల్లం	1.54	0.49	[illegible]	Sy.No.31	2A2	1B	1A1	
18	37-2A2	పల్లం	0.56	0.48	[illegible]	1A2	36	1B	2A1, Sy.No.36	
19	37-2H	పల్లం	0.21	0.21	[illegible]	2E	Grama No.135 Chorlangi	GramaNo.30 Jadupeta	1B	
20	37-2E	పల్లం	0.01	0.01	[illegible]	1B	2H	GramaNo. Jadupeta	1B	
21	36-6A2	పల్లం	0.74	0.40	[illegible]	Sy.No.37	Grama No.135 Chorlangi	6B&Sy.No.37	6A1	
	మొత్తం :			5.01						

సం. శ్రీ కె.ధనంజయరెడ్డి,
కలెక్టర్, శ్రీకాకుళం

అవనిగడ్డ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుపై ఏసీబీ దాడి



విశాలాంధ్ర -అవనిగడ్డ : కృష్ణాజిల్లా అవనిగడ్డ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై సోమవారం ఏసీబీ అధికారులు పంజా విసిరింది. కార్యాలయంలో లెక్కకు అందని రూ. 1,29,480 నగదు స్వాధీనం చేసుకొన్నారు. ఈ దాడిలో అవనిగడ్డలోని ప్రభుత్వ కార్యాలయాల అధికారులు, సిబ్బంది ఉలిక్కిపడ్డారు. అవనిగడ్డ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి, అక్రమాలపై ఏసీబీ అధికారులకు ఫిర్యాదులు రావటంతో నిఘా పెట్టి దాడులు చేశారు. ఏసీబీ డీఎస్పీలు ఎస్‌వీవీ ప్రసాద్, కృష్ణా, సీఐలు కె వెంకటేశ్వర్లు, ఎస్ వెంకటేశ్వరరావు, హ్యపీ కృపావందనం, రమేష్‌బాబు పాల్గొన్నారు.

బాలాజీ ఆరోగ్యవరప్రసాదిని పథకానికి రూ.కోటి విరాళం



విశాలాంధ్ర - తిరుమల : బాలాజీ ఆరోగ్యవరప్రసాదిని పథకానికి బెంగుళూరుకు చెందిన జి.ప్రశాంత్‌నారాయణ రూ.కోటి విరాళంగా అందించారు. తిరుమలలోని జెఈవో బంగ్లాలో సోమవారం ఈ విరాళం చెక్కును జి.ప్రశాంత్ నారాయణ తరపున ఇండియా సిమెంట్స్ పీఆర్‌వో ప్రసన్నకుమార్ తిరుమల జెఈవో కె.ఎస్.శ్రీనివాస రాజుకు అందజేశారు.

కబ్జా కోరల్లో చెరువు గర్భాలు

- మెట్టలో చెరువు భూముల స్వాహా
- నాలుగు మండలాల్లో సరిహద్దుల అడ్రస్ గల్లంతు





విశాలాంధ్ర - లింగపాలెం : పశ్చిమగోదావరి జిల్లాలోని మెట్ట ప్రాంత సాగునీటి చెరువుల పరిరక్షణ ప్రశ్నార్థకంగా మారింది. అధికారుల అజమాయిషీ లేకపోవడంతో కోట్ల విలువైన భూముల హద్దులు అడ్రస్ లేకుండా పోతున్నాయి. చెరువుల ఆధారంతో పంటలు సాగుచేస్తున్న రైతులు చిక్కుల్లో పడ్డారు. చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోవడం, భూగర్భ జలాలు అడుగంటడంతో ఆయకట్టు భూములకు నీరు అందక అష్టకష్టాలు పడుతున్నారు. వ్యవసాయానికే కాకుండా తాగునీరు దొరకని పరిస్థితులు తలెత్తడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఒకప్పుడు వర్షాకాలం చెరువుల్లోకి చేరిన నీరు సాగు భూములకు ఆధారం కావడంతోపాటు మరో సీజన్ వచ్చే వరకు ఉండేది. నేడు జూన్ నెలలో వర్షపునీటితో చెరువులు నిండినా డిసెంబరు నాటికి ఎండిపోయి బీటలు వారుతున్నాయి. చెరువుల గర్భాలు ఆక్రమణలకు గురికావడం, పూడికలు తీయకపోవడంతో వీటి పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. వీటి మరమ్మతుల కోసం ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నప్పటికీ కాంట్రాక్టర్లే లాభపడుతున్నారని రైతులు విమర్శిస్తున్నారు.

ఆక్రమణల చెరలో వందల ఎకరాలు

జిల్లాలోని చింతలపూడి మండలంలోని 150 చెరువుల ద్వారా 25 వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. లింగపాలెం మండలంలో 87 చెరువుల ద్వారా 8 వేల ఎకరాలు, కె.కోట మండలంలో 164 చెరువుల నుంచి 4 వేల ఎకరాలు, టి నరసాపురం మండలంలో 88 చెరువుల నుంచి 6 వేల ఎకరాల ఆయకట్టు భూములకు నీరు అందాల్సి ఉంది. ఈ నాలుగు మండలాల్లోని చెరువు గర్భాలు సుమారు 1300 ఎకరాల నుంచి 1500 ఎకరాల మేర ఆక్రమణలకు గురైనట్లు తెలుస్తున్నది. కొన్ని చెరువుల్లో ఏకంగా 50 ఎకరాలు అన్యాక్రాంతమైనట్టు సమాచారం. ఆక్రమించుకున్న రైతులు చెరువు స్థలాలను మెరక చేసుకుని సాగుచేసుకుంటున్నారు. ఆక్రమించుకున్న ఎకరం చెరువు భూమి ధర దాదాపు రూ.5 లక్షల వరకు పలుకుతుంది. వీటికి రికార్డులు లేకపోయినా క్రయవిక్రయాలు సాగుతున్నాయి. సుమారు రూ.10 కోట్ల విలువైన చెరువు భూములు పరులచేతుల్లో ఉన్నాయి. ఆక్రమణదారులు ఆ భూముల్లో వేసిన పంటలు ముంపునకు గురికాకుండా తూముల ద్వారా నీరు వదిలివేయడం, చెరువు కట్టలకు గండ్లు పెట్టడం పరిపాటిగా మారింది.

కొన్నిటికి పట్టాలు ఇచ్చేశారు

కొన్ని చెరువుల్లో ఆక్రమణ భూములకు ప్రభుత్వ అధికారులు పట్టాలు ఇచ్చిన ఘటనలపై వివాదాలు కొనసాగుతున్నాయి. కొణిజర్లలోని ఒక చెరువు గర్భంలో 25 ఎకరాలకు రెవెన్యూశాఖ పట్టాలు జారీ చేసింది. కె.గోకవరం, అయ్యపురాజు గూడెం, బోగోలు, ధర్మాజీగూడెం, కాలరాయణగూడెం గ్రామాల్లోనూ ఇటువంటి వివాదాలను పరిష్కరించక పోవడం ప్రజల్లో అనేక అనుమానాలకు దారితీస్తున్నాయి.

చెరువుల నీటి సామర్థ్యం ఇలా..

ఒక చెరువులో క్యూసెక్కు నీరు చేరితే ఎనిమిది ఎకరాల్లో సాగుకు అందించవచ్చు ఎకరం విస్తీర్ణంలో మూడు క్యూసెక్కుల నీరు నిల్వ ఉంటుంది. 50 ఎకరాల విస్తీర్ణం ఉంటే దాదాపు 1000 ఎకరాలకు సరిపడా నీరు అందించవచ్చనేది ఇరిగేషన్ అధికారుల లెక్క. వీటిలో నాలుగు ఎకరాలు ఆక్రమణలకు గురైతే 26 ఎకరాలకు నీరు దొరకని పరిస్థితి. ఈ లెక్కన అన్యాక్రాంతమైన చెరువుల ఆయకట్టులో వేల ఎకరాలకు సాగునీరు దూరమైందనేది అధికారుల సర్వేలో తేలిన నిజం. ప్రభుత్వశాఖల అధికారులు సమన్వయంతో పక్కా కార్యాచరణతో ముందుకు సాగితే చెరువులు నిలబడతాయి. జలాలు సమృద్ధిగా ఉంటాయి. ఆయకట్టు భూములు కళకళలాడతాయి. ఆక్రమణల తొలగింపును ఒక యజ్ఞంగా చేపట్టాలని జనం కోరుతున్నారు.



అగ్నిమాపక ఉద్యోగులు నిరంతర సేవకులు : రాష్ట్ర డీజీఎఫ్‌ఓ

విశాలాంధ్ర - కర్నూలు క్రైం : ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ ఉంటుందని, అగ్నిమాపకదళ సిబ్బందికి మాత్రం వృత్తిపరంగా పదవీ విరమణ చేసినా ఏదైనా అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు సహాయ చర్యల్లో ముందుంటారని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఫైర్ ఆఫీసర్ సత్యనారాయణ అన్నారు. కర్నూలులోని ఎస్‌ఏపీ క్యాంపు ఆడిటోరియంలో శిక్షణ పొందుతున్న అగ్నిమాపక దళ సిబ్బంది నిరంతర సేవకులుగా పనిచేయాలన్నారు. మూడు నెలల శిక్షణలో రోడ్డు ప్రమాదాలు, వరదలు, రైలు ప్రమాదాల సమయంలో ప్రజలను ఎలా రక్షించాలో అనే అంశంపై శిక్షణ కల్పిస్తున్నామన్నారు. అగ్నిప్రమాదం సమయంలో నీరు చల్లకూడదని, మంటలను ఆర్పేందుకు ఎలాంటివి ఉపయోగించాలో పాఠశాలల్లో విద్యార్థులకు, కాలనీలోని ప్రధాన వీధుల్లో మహిళలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలోని 35 నియోజకవర్గాల్లో అగ్నిమాపక కేంద్రాలు లేవన్నారు. కార్యక్రమంలో రాయలసీమ రీజినల్ ఫైర్ ఆఫీసర్ మురళీమోహన్, కర్నూలు, కడప, అనంతపురం డీఎఫ్‌ఓలు భూపాల్‌రెడ్డి, శ్రీనివాసరావు, సత్యనారాయణ, కర్నూలు ఏడీఎఫ్‌ఓ జయన్న పాల్గొన్నారు.

ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

చప్పిడి కృష్ణమోహన్ ముదిరాజ్ డిమాండ్



విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ముదిరాజ్‌లకు నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి ముది రాజ్‌ల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందని ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చప్పిడి కృష్ణమోహన్ ముదిరాజ్ తెలిపారు. ముదిరాజ్ కులస్తులకు రూ.1000 కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్‌తో సోమవారం విజయవాడ అలంకార్ ధర్నా చౌక్ వద్ద నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రవర్ణాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించిన ప్రభుత్వం దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్న ముదిరాజ్‌లకు నిధులు కేటాయించక పోవడం దారుణమన్నారు. అసెంబ్లీ సమావేశల్లో ముదిరాజ్ కార్పొరే షన్‌ను ఏర్పాటు చేయకపోతే తమ ఆగ్రహాన్ని చవిచూడాల్సి ఉంటుందని హెచ్చరించారు. టిడిపి అవిర్భావం నుండి పార్టీ జెండాలను మోస్తున్న తమను విస్మరించడం శోచనీయమ న్నారు. తెలంగాణలో ముదిరాజ్ లకు ప్రభుత్వం రాజకీయంగా గుర్తింపునిస్తుంటే ఇక్కడి ప్రభుత్వం తమ ఉనికిని ప్రశ్నార్థకం చేస్తోందని అవేదన వ్యక్తం చేశారు. ఇకనైన ప్రభుత్వం తక్షణం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని లేని పక్షంలో తగిన మూల్యం చేల్లించుకోవలసి వస్తుందని హెచ్చరించారు. వైసిపీ నాయ కులు జోగి రమేష్, మల్లాది విష్ణు, సిపిఎం రాష్ట్ర నాయకులు సి. హెచ్.బాబురావు, జర్నలిస్టు యూనియన్ నాయకురాలు శాంతి, షేక్ ఖాజావలి, నాధన్, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ జి.గంగాధర్, బిసీ నాయకులు జోగి నాగేశ్వరరావు, బాయన శేఖర్‌బాబు సంఘీ భావం తెలిపారు. దీక్షలో సంఘం ఉపాధ్య క్షులు డాక్టర్ ఎన్.మారేష్, ఉద్యోగుల విభాగం ప్రధాన కార్యదర్శి పులి శ్రీనివాస్, కృష్ణా జిల్లా అధ్యక్షులు కె.లక్ష్మీపతి, చుక్కా నాని, అధికార ప్రతినిధి టి.రమేష్, రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటరాజు, ఎవి.చలం, కె.మణి, దుర్గారావు,ఆనం శ్రీను, కె.సుధాకర్. జోగారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సీకేబాబుపై హత్యాయత్నం కేసులో తీర్పు వెల్లడి

- కఠారిమోహన్, చింటూ ముద్దాయిలే
- 16 మంది నిర్దోషులుగా విడుదల



విశాలాంధ్ర - చిత్తూరు: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన చిత్తూరు మాజీ ఎంఎల్‌ఎ సీకేబాబుపై హత్యాయత్నం కేసులో సోమవారం స్థానిక 9వ జిల్లా అదనపు న్యాయమూర్తి కపర్థి తుది తీర్పు వెలువరించారు. పదేళ్ల పాటు సుదీర్ఘ విచారణ తర్వాత కఠారిమోహన్, చింటూ అలియాస్ చంద్రశేఖర్‌లను ప్రధాన ముద్దాయిలుగా కోర్టు ప్రకటించింది. కఠారిమోహన్ మృతి చెందడంతో చంద్రశేఖర్‌కు కోర్టు జీవిత ఖైదు విధించింది. మరో 16 మందిని నిర్దోషులుగా పేర్కొంటూ తీర్పు వెలువరించింది. 2007 డిసెంబరు 31వ తేదీన కట్టమంచిలోని తన నివాసం నుంచి కారులో బయలుదేరిన సీకేబాబుపై కట్టమంచి సాయిబాబు గుడి వద్ద కల్వర్టు కింద బాంబుపెట్టి పేల్చివేశారు. ఈ ఘటనలో సీకేబాబు గన్‌మెన్ సురేంద్ర మరణించారు. సీకేతో సహా తొమ్మిది మంది తీవ్రంగా గాయపడ్డారు. అప్పట్లో సీకేబాబు ఫిర్యాదుతో చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు 17 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో మేయర్ హేమలత భర్త ప్రవీణ్, ఎమ్మెల్యే సత్యప్రభ కుమారుడు డీఏ శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశారు. ఆరోపణలు ఎదు ర్కొన్న 17 మందిలో కఠారిమోహన్, గిరిధర్‌రెడ్డి, వెంకటస్వామి మరణించారు. 81 మందిని సాక్షులుగా పేర్కొంటూ కోర్టుకు పోలీసులు చార్జ్‌షీటు అందించారు. 51 మంది సాక్షులను పరిగణలోకి తీసుకున్న కోర్టు సుదీర్ఘ కాలంపాటు విచారణ తర్వాత తుది తీర్పు వెలువరించింది. ఐపీసీ 324, 326, 307, 302, 12 బీ సెక్షన్ల ప్రకారం చింటూకు జీవిత ఖైదు విధిస్తూ ఆరోపణలు ఎదుర్కొన్న మరో 16 మందిని నిర్ధోషులుగా కోర్టు విడుదల చేసింది. సోమవారం తుది తీర్పు నేపథ్యంలో జిల్లా కోర్టు వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. 144 సెక్షన్ విధించారు. చింటూ ఇప్పటికే కఠారిమోహన్, కఠారి అనురాధ హత్య కేసులో జైలుశిక్ష అనుభవిస్తున్నాడు. తాజా తీర్పుతో చింటూ జీవితఖైదు అనుభవించాల్సి వుంది.

చరిత్ర కీర్తి కిరీటంలో అమరావతి



విశాలాంధ్ర- ఏఎన్‌యూ : చరిత్ర కీర్తి కిరీటంలో అమరావతి విశిష్ట గుర్తింపు సాధించిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ డైక్‌మన్ ఆడిటోరియంలో రాష్ట్ర పురావస్తు శాఖ, పూణేకు చెందిన డెక్కన్ కాలేజ్, డీమ్డ్ వర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ' పురావస్తు సంరక్షణ- దక్షిణాసియాలో పురశిలాయుగపు సంస్కృతి' అంశంపై మూడు రోజుల అంతరా ్జతీయ సదస్సు సోమవారం రాష్ట్ర పురావస్తు శాఖ కమిషనర్ డా. జి వాణీమోహన్ అధ్యక్షతన ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా మంత్రి పుల్లారావు మాట్లాడుతూ ప్రపంచ రాష్ట్ర చరిత్ర, పురావస్తుశాఖను పర్యాటకులకు కేంద్ర నిలయంగా తీర్చిద్దాలన్నారు. సదస్సు ద్వారా చరిత్ర పరిశోధకులు తమ పరిశోధనా ఫలాలను ప్రభుత్వానికి భావితరాల వారికి రాష్ట్ర చరిత్ర, వారసత్వ సంపదను అందించాలన్నారు. అమరావతి చరిత్ర ఆధారాలు నేటికీ లండన్ మ్యూజియంలో ఉండటం విశేషమన్నారు. రాష్ట్ర శాసన సభ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ మాట్లా డుతూ చరిత్రకు ఆధారంగా నిలిచిన ఎన్నో సాక్ష్యాలు ఆధునీకరణలో కాలగర్భంలో కలిసిపోతున్నాయన్నారు. తెలుగుజాతికున్న వేల సంవత్సరాల చరిత్రపై జరిగిన, జరుగుతున్న పరిశోధనా ఫలాలు ప్రతి గ్రామీణునికి అర్థమయ్యేలా తెలుగులోనే ఉండాలన్నారు. పూణే డెక్కన్ కాలేజ్, డీమ్డ్ వర్సిటీ ప్రొఫెసర్ వసంత్‌షిండే మాట్లాడుతూ ప్రపంచ దేశాలు చరిత్ర అన్వేషణలో ముందుంటున్నాయన్నారు. కమిషనర్ డాక్టర్ జి వాణీమోహన్ మాట్లాడుతూ పోలవరం ముంపు గ్రామాలైన రాయన్నపేట, రుద్రకోటలో పరిశో ధనలు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య ఎ.రాజేంద్రప్రసాద్, ఆర్కియాలజీ మాజీ డైరెక్టర్ ప్రద్మశ్రీ ప్రొఫెసర్ కె.పెద్దయ్య, ఇంటర్నేషనల్ హెరిటేజ్ అడ్వయిజర్ ప్రొఫెసర్ అమరేశ్వర్ గల్లా(ఏపీ), ఆంధ్రప్రదేశ్ ఇన్‌టాక్ చాప్టర్ కన్వీనర్, విశ్రాంత ఐఏఎస్ ఎమ్. గోపాలకృష్ణ, ఆంధ్రావర్సిటీ ప్రొఫెసర్ కె.తిమ్మారెడ్డి తదితరులు ప్రసంగించారు. ఫోటో ఎగ్జిబిషన్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది.

9 మంది మిలీషియా సభ్యుల లొంగుబాటు



విశాలాంధ్ర-నర్సీపట్నం : విశాఖ జిల్లా నర్సీపట్నం మండలంలో సోమవారం తొమ్మిది మంది మిలీషియా సభ్యులు ఏఎస్పీ అరిఫ్ హఫీజ్ ఎదుట లొంగిపోయారు. జర్త వెంకటరావు(25), కొర్రా దాసు(27), కొర్రా లింగరాజు(22), కొర్రా జగ్గారావు(24), పాలిక రమేష్(23), పాలిక సర్సు(20), కొర్రా బంధు(21), కొర్రా బంగారాజు(22) వీరంతా కొయ్యూరు మండలం యు.చీడిపాలెం పంచాయతీ జెర్రిగొంది ప్రాంతానికి చెందిన వారని ఏఎస్పీ వెల్లడించారు. మూడేళ్ల క్రితం మావోయిస్టులైన కుడుముల వెంకటరావు అలియాస్ రవి, వీఆర్ఎల్ గోపాల్ అలియాజ్ ఆజాద్‌లు భయపెట్టి బలవంతంగా మిలీషియా సభ్యులుగా నియమించుకున్నట్టు తెలిపారు. మావోయిస్టులకు భోజనాలు సమకూర్చడం, గ్రామాలు మారుతున్న సమయంలో దారి చూపడం, మావోయిస్టు సమావేశాలకు ప్రజలు తరలిస్తున్నారన్నారు. పోలీసుల కదకలిలను ఎప్పటికప్పుడు మావోయిస్టులకు చేరవేశేవారన్నారు. స్వేచ్ఛయుత జీవనం కోసం వీరు లొంగిపోయినట్లు చెప్పారు. కార్యక్రమంలో కొయ్యూరు సీఐ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వాలే కష్టాలపాల్జేస్తున్నాయి

రాష్ట్ర మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు



విశాలాంధ్ర- విజయవాడ (గాంధీనగర్) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం రైతాంగాన్ని అష్టకష్టాలు పెడుతున్నాయని రాష్ట్ర మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలో 9 కోట్ల రైతు కుటుంబాలు గిట్టుబాటు ధరల కోసం రోడ్డెక్కినా పాలకులు స్పందించకపోవడం దారుణమన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు లభించక వడ్డీ దళారుల కబంధ హస్తాలలో నలిగిపోతూ ఆత్మహత్యలు చేసుకుంటు న్నారన్నారు. అవసరమున్నా లేకపోయినా రైతుల నుంచి లాక్కుని పారిశ్రామిక క్యాడర్ పేరుతో కార్పొరేట్‌శక్తులకు వేలాది ఎకరాలను కట్టబెడుతోందన్నారు. గత ఎన్నికల్లో బీజేపీ, టీడీపీలు స్వామినాధన్ కమిషన్ నివేదిక అమలుతో పాటు ఉత్పత్తి వ్యయానికి అదనంగా 50 శాతం కలిపి గిట్టుబాటు ధర ఇస్తామన్న హామీ ఇంతవరకు అమలు కాలేదన్నారు. ఒకపక్క ఆర్థిక పరిస్థితి బాగోలేదని, కేంద్రం ఆదుకోవడంలేదని చెబుతున్న చంద్రబాబు పనితీరు ఉట్టికి ఎక్కలేనమ్మ స్వర్గానికి నిచ్చెన వేసినట్లు ఉందన్నారు. అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్డు కోసం 3500 ఎకరాలు భూమి అవసరమని, దీనికి ఇరువైపుల 500 మీటర్ల వెడల్పుతో క్యారిడార్లను ఏర్పాటు చేస్తున్నందున 16,556 ఎకరాలను భూసేకరణ విధానంలో తీసుకోవాలని సంకల్పించడం అన్యాయమన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం బహుళ పంటలు పండే భూమి తీసుకోకూడదని, అవసరమైతే అత్యంత తక్కువ విస్తీర్ణానికే అత్యధిక ధర రైతులకు చెల్లించాల్సి ఉందన్నారు. ఇన్నర్ రింగ్‌రోడ్డు కన్నా ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో ప్రభుత్వానికి ఒక్క నయాపైసా ఖర్చు లేకుండా కేంద్ర ప్రభుత్వమే భరించేలా ఎన్‌ఆర్‌ఐ మెడికల్ కాలేజ్ వెనక నుండి వెంకటపాలెం- సూరయపాలెం మధ్య కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మించి గొల్లపూడి-ఇబ్రహీంపట్నం మధ్యలో నుంచి జాతీయ రహదారి-5లో పెదవుటపల్లి సమీపంలోని రోడ్డుకు కేంద్రం భూసేకరణ దాదాపు పూర్తి చేసిందన్నారు. దానిని తిరిగి ప్రారంభిస్తే ఎంతో మంచిదన్నారు.

రాజ్యసభకు టీడీపీ అభ్యర్థుల నామినేషన్



విశాలాంధ్ర - అమరావతి : తెలుగుదేశం పార్టీ రాజ్యసభ సభ్యులుగా సీఎం రమేష్ ,కనకమేడల రవీంద్ర కుమార్‌లు సోమవారం వెలగపూడి అసెంబ్లీ భవనంలో నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి సత్యనారాయణకు సమర్పించారు. ఈ సందర్భంగా సీఎం రమేష్ మాట్లాడుతూ, రెండవ సారి రాజ్యసభకు అవకాశం ఇచ్చినందుకు చంద్రబాబుకి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రజలకు న్యాయం జరిగేంతవరకు నిరంతరం పోరాటం చేస్తానని తెలిపారు. విభజన హామీల కోసం రాజ్యసభలో పోరాడతానని చెప్పారు. ప్రత్యేక హోదా సాధన కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో కేంద్రాన్ని గట్టిగా ప్రశ్నిస్తానని అన్నారు. అనంతరం మరో అభ్యర్థి కనకమేడల రవీంద్రకుమార్ మాట్లాడుతూ, ఇన్ని రోజులుగా పార్టీకి చేసిన సేవలను గుర్తించి రాజ్యసభకు అవకాశం ఇచ్చినందుకు సీఎంకు రుణపడి ఉంటానన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని స్పష్టంచేశారు.పార్టీలోని ప్రతి ఒక్కరి సహకారంతో గత రెండు దశాబ్దాలుగా పార్టీకి న్యాయ విభాగం తరుపున సేవలు అందించానని, పార్టీని బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.రాజ్యసభ ద్వారా రాష్ట్ర ప్రయోజనాల కోసం సీఎం నేతృత్వంలో కృషి చేస్తానని చెప్పారు. కాగా టీడీపీ అభ్యర్థులు ఇద్దరితో పాటు వైసీపీ రాజ్యసభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఎన్నిక లాంఛనం కానున్నది. ఏకగ్రీవం కానున్న అధికార, ప్రతిపక్ష రాజ్యసభ అభ్యర్థుల ఎన్నిక విషయంలో ఎన్నికల అధికారి ప్రకటన చేయాల్సి ఉంది. టీడీపీ నేతల నామినేషన్ కార్యక్రమంలో సీనియర్ మంత్రులు, ఎమ్మెల్యేలు పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో ఆసక్తికరంగా

మారిన రాజ్యసభ ఎన్నికలు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: తెలంగాణలో రాజ్యసభ ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. మూడు స్థానాలకు నలుగురు అభ్యర్థులు పోటీ పడుతుండటంతో ఎన్నిక అనివార్యమైంది. టీఆర్ ఎస్ నుంచి జోగినపల్లి సంతోష్‌కుమార్, బడుగుల లింగయ్య యాదవ్, బండ ప్రకాశ్ సోమవారం నామినేషన్లు దాఖలు చేశారు. కాం గ్రెస్ అభ్యర్థిగా బలరాం నాయక్ బరిలోకి దిగారు. ఎన్నిక అని వార్యం కావడంతో ఈ నెల 23న పోలింగ్ జరగ నుంది. అదే రోజు సాయం త్రం కౌంటింగ్ ఉంటు ంది. ఇప్పటి వరకు ముగ్గురు అభ్యర్థులు బరిలో ఉంటారు, ఏకగ్రీవంగా ఎన్నిక జరుగుతుందని భావించినప్పటికీ వ్యూహాత్మకంగా కాంగ్రెస్ తన పార్టీ అభ్యర్థిని రంగంలోకి దింపటంతో ఎన్నికలు ఉత్కంఠతగా మారాయి. బరిలో ఉన్న అభ్యర్థుల్లో కొంత భయాందోళనలు నెలకొన్నాయి. క్రాస్ ఓటి ంగ్ జరిగే తమ కొంపమునుగుతుందని అధికార పక్ష సభ్యులు మధన పడుతున్నారు.

అభివృద్ధి ఆగదు-హక్కులపై రాజీలేదు

టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు స్పష్టీకరణ



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్రంలో అభివృద్ధి ఆగడానికి వీల్లేదు, అదే సమయంలో మన హక్కులపై రాజీలేదు. కేంద్రం నుంచి సహకారం లేకున్నా స్వయం కృషితో ముందుకుపోదాం. మీ అందరి సహకారంతో రెండంకెల వృద్ధి మూడేళ్లుగా సాధిస్తున్నాం.ఇదే స్ఫూర్తితో మరింత వృద్ధి సాధించాలని సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. సోమవారం తన నివాసం నుంచి నీరు-ప్రగతి, వ్యవసాయం పురోగతిపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఒకవైపు రాష్ట్ర హక్కుల కోసం పోరాటం చేస్తూనే, మరోవైపు రాష్ట్రాభివృద్ధి, పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మన కష్టంతో మనం ముందుకు పోవాలని, ఎప్పటికైనా అదే అక్కరకు వస్తుందన్నారు.వర్షపాతం లోటు ఉన్నప్పటికీ సమర్థనీటి నిర్వహణ ద్వారా వ్యవసాయం అనుబంధ రంగాల్లో దిగుబడులు తగ్గకుండా చేస్తున్న కృషి ఫలించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.శ్రీశైలం రిజర్వాయర్‌లో ప్రస్తుత నీటిమట్టం 834అడుగులకు చేరుకుందని, హంద్రీ-నీవా ద్వారా ఈ ఏడాది 170రోజులు సాగునీటిని ఇవ్వగలగడంపై రాయలసీమ రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోందన్నారు.ఈ నెలాఖరుకల్లా నరేగా లక్ష్యాలను చేరుకోవాలని, కూలీలకు వేతనాలు సక్రమంగా చెల్లించాలని ఆదేశించారు. సూక్ష్మ సేద్యం లక్ష్యంలో 70%మాత్రమే చేరామని, మిగిలిన లక్షా 40వేల ఎకరాల్లో కూడా పూర్తిచేయాలన్నారు. అలాగే ఉద్యాన పంటల సాగు కోటి ఎకరాలకు చేరాలన్నదే తన ఆకాంక్షగా పేర్కొన్నారు. జీబా వినియోగంపై రైతులను చైతన్యపరచాలని కోరారు. ప్రతిగ్రామంలో పోషకాహార ఉద్యానవనాలను (న్యూట్రీటీ గార్డెన్స్) పెంచాలని సూచించారు. తల్లులకు, చిన్నారులకు పోషకాహారం వీటినుండే పొందేలా శ్రద్ధ చూపాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగియగానే జిల్లాల పర్యటనలు చేపట్టనున్నట్లు సీఎం తెలిపారు.ఈ టెలికాన్ఫరెన్స్‌లో గ్రామీణాభివ ృద్ధి,వ్యవసాయ శాఖల కమిషనర్లు రామాంజనేయులు, హరి జవహర్ లాల్, రియల్ టైం గవర్నెన్స్ ఎండి అహ్మద్ బాబు, జలవనరుల శాఖ, ఉద్యాన శాఖ, పట్టణాభివృద్ధి శాఖల ఉన్నతాధి కారులు శశిభూషణ్, చిరంజీవి చౌదరి,కరికాల వలవన్, వివిధ జిల్లాల కలెక్టర్లు,ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతు, వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారానికి

అనంతపురం కలెక్టరేట్ వద్ద ధర్నా

ఏపి వ్యవసాయ, రైతు సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జల్లివిల్సన్, కెవివి ప్రసాద్



అనంతపురంలో కలెక్టరేట్ ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న జల్లి విల్సన్, పక్కన కెవివి ప్రసాద్ తదితరులు

విశాలాంధ్ర- అనంతపురంఅర్బన్ : రైతు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని డిమాండుచేస్తూ ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా శాఖల ఆధ్వర్యాన సోమవారం అనంతపురం జిల్లా కలెక్టర్ ఎదుట ధర్నా నిర్వహించారు. రైతు, వ్యవసాయ కార్మికులు ఈ ధర్నాలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు లేని నిరుపేద రైతు, వ్యవసాయ కార్మికులకు జన్మభూమి కమిటిలతో నిమిత్తం లేకుండా ఇంటి స్థలాలు ఇచ్చి పక్కా గృహం నిర్మించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను విరివిగా మంజూరు చేయాలనీ, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలనీ, పెండింగ్‌లో ఉన్న పంట నష్టపరిహారం సొమ్మును, రుణమాఫీ సొమ్మును రైతులకు వెంటనే చెల్లించాలనీ, హంద్రీనీవా నుండి పీఏబి ఆర్‌కు అధికారికంగా 5 టీఎంసీల నీరు కేటాయించి కుడి కాలువ ఆయకట్టును స్థిరీకరించి రైతులను ఆదుకోవాలని తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు రైతు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మల్లికార్జున, టి.రంగయ్య అధ్యక్షత వహించగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి జల్లి విల్సన్, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ధర్నా చేస్తున్న వారినుద్దేశించి విల్సన్ మాట్లాడుతూ, పంటలు పండక, ఉపాధి లేక చితికిపోయిన రైతు, వ్యవసాయ కూలీల సమస్యలను ప్రభుత్వాలు తక్షణమే పరిష్కరించాలని డిమాండు చేశారు. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించాలన్న మంచి ఉద్దేశంతో ప్రారంభించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం గ్రామీణ పేదలకు గొప్పవరమన్నారు. ఈ పథకం కారణంగా గత 12 సంవత్సరాలల్లో కరవులు, వరదలు వచ్చినా పనులు కల్పించారనీ, ధరలు అనేక రెట్లు పెరిగినా పేదలు ఉపశమనం పొందారన్నారు. వలసలు కొంత మేరకు తగ్గాయన్నారు. రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలేక చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని విల్సన్ ఆందోళన వ్యక్తం చేశారు. కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ, గత ఆర్థిక సంవత్సరం జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేక లక్షలాది మంది ఇతర రాష్ట్రాలకు వలసవెళ్లారని, ఈ ఆర్థిక సంవత్సరంలో అలా వలసలు వెళ్లకుండా నివారించి ఉన్న గ్రామాల్లో పనులు కల్పించాలని కోరారు. ఉపాధి హామీ మేట్లకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు. 60 సంవత్సరాలు నిండిన రైతులకు నెలకు రూ. 6 వేలు పెన్షన్ ఇవ్వాలని, అన్ని రకాల పెన్షన్లు రూ. 3వేలు పెంచాలని డిమాండు చేశారు. జిల్లాలో తాగు, సాగునీటి సమస్య పరిష్కారం కోసం హంద్రీనీవా నుండి జిల్లాకు 100 టీఎంసీల నీరు కేటాయించి 3లక్షల 50 వేల ఎకరాలకు నీరందించాలని డిమాండు చేశారు. అనంతరం కలెక్టర్ జి.వీరపాండియన్‌ను కలసి రైతు, వ్యవసాయ కార్మికులసమస్యలను వివరించి వినతి పత్రం అందచేశారు. ఈ ధర్నాకు రైతు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎ.కాటమయ్య, బి.కేశవరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి.నారాయణస్వామి, జిల్లా నాయకులు చెన్నప్ప యాదవ్, శ్రీకాంత్, భాస్కర్, రమణ, వెంకట రాముడు, రైతు సంఘం జిల్లా నాయకులు టి.నారాయణస్వామి, పి.రామకృష్ణ, సంగప్ప, రామకృష్ణ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



వ్యాయామ నిరుద్యోగుల

సమస్యలు వెంటనే పరిష్కరించాలి

ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్ డిమాండు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వ్యాయమ నిరుద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రావులపల్లి రవీంద్రనాథ్ డిమాండు చేశారు. రాష్ట్ర నలుమూలల నుండి వచ్చిన వ్యాయామ నిరుద్యోగులు సోమవారం విజయవాడ రైల్వేస్టేషన్ నుంచి ధర్నా చౌక్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రనాద్ మాట్లాడుతూ 2018 లో జరగబోయే డీఎస్సీలో ఖాళీగా ఉన్న పీఈటీ పోస్టులన్నింటిని పూర్తి స్థాయిలో భర్తీ చేసి, జీఓ నెంబరు 29ని అమలు చేయా లన్నారు. అదేవిధంగా 'ఫిజికల్ లిటరిసి'ని అభివృద్ధిచేసి అప్‌గ్రేడ్ అయిన మాధ్యమిక పాఠశాలలో ఒక్కొక్క పీఈటీ ని నియమించాలని కోరారు. ప్రతి ఆదర్శ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో కూడా వ్యాయామ ఉపాధ్యా యులను నియమించాల న్నారు. ఇంజినీర్ కళాశాలల్లో, వ్యవ సాయ కళాశాలలో బీఈడీ, డీఎడ్, ఇంటర్మీడియట్‌తోపాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులను నియమించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు లేకపోవడం వల్లే విద్యార్థులు శారీరక అనారోగాలకు గురై చిన్న చిన్న విషయాలకే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మహత్యలను నివారించేందుకు వ్యాయామ ఉపాధ్యా యులను పూర్తి స్థాయి లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉండేవిధంగా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వ్యాయామ నిరుద్యోగుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఏఐటీయూసీ రాష్ట్ర సమితి వారికి అండగా ఉంటుందని రవీంద్ర నాథ్ హామీ ఇచ్చారు. ధర్నాకు వ్యాయామ విద్య పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఇ మోహన్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శి దేవేంద్రగౌడ్, కార్యవర్గసభ్యులు రమేష్, గంగాధర్, మంజునాథ్, వాసు తదితరులు నాయకత్వం వహించారు.



రైతులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలి

చింతలపూడి ఎత్తిపోతల పోరాట సమితి సదస్సులో రావుల, దేగా డిమాండు

విశాలాంధ్ర చింతలపూడి : చింతలపూడి ఎత్తిపోతల పథకంతో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకి రూ.30 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని ఏఐకేఎస్ ఉపాధ్యక్షులు రావుల వెంకయ్య కోరారు. చింతలపూడి ఎత్తిపోతల భూనిర్వాసితుల పోరాట సమితి ఆధ్వర్యాన సోమవారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ చింతలపూడి ఎత్తిపోతల పథకంలో, పోలవరం ప్రాజెక్టులో భూములు కోల్పోయిన వారికి ఆ నీటి వల్ల ఎలాంటి ఉపయోగం లేదన్నారు. భూమినే నమ్ముకున్న రైతులకు ఆ భూమిని కోల్పోతే ఉపాధి కరవుతుందన్నారు. భూమిని కోల్పోయే వారికి ఒకోచోట ఒకో రకంగా పరిహారం ఇవ్వడం సరికాదన్నారు. రాష్ట్రంలో ఎక్కడ ప్రభుత్వం భూమి సేకరించినా ఒకే రకంగా నష్టపరిహారం ఇస్తూ ఆ కుటుంబాలకు ఉపాధి కల్పించాలన్నారు. రైతులకు న్యాయమైన పరిహారం చెల్లించని పక్షంలో పోరాటాన్ని ఉధృతం చేయాలని వెంకయ్య పిలుపునిచ్చారు. సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి దేగా ప్రభాకర్ మాట్లాడుతూ రైతుల్లో ఐకమత్యం ఉంటే సమస్యలపై పోరాడి సాధించుకోవచ్చునన్నారు. పోలవరం రైతులు పోరాటం చేసి నష్ట పరిహారాన్ని ఐదు రెట్లు ఎక్కువ సాధించుకున్నారు. పోరాటం చేస్తేనే తప్ప ఏ సమస్య పరిష్కారం కాదన్నారు. ఆందోళనల ఉధృతి అమరావతికి తాకిన రోజునే ఈ సమస్య పరిష్కారంమవుతుందన్నారు. భూ నిర్వాసితుల సమస్య పరిష్కారమయ్యే వరకు సీపీఐ వారి వెన్నంటే ఉంటుందన్నారు. ఏపీఎస్ఐడీసీ మాజీ ఛైర్మన్ ఘంటా మురళీరామకృష్ణ మాట్లాడుతూ చింతలపూడి ఎత్తిపోతల వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయనీ, రెండు జిల్లాల్లో మెట్ట ప్రాంతం మొత్తం సాగవుతుందన్నారు. అలాంటి కాలువకు భూములు ఇచే రైతులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రఫీ యుల్లా బేగ్, బీజేపీ నాయకులు బీవీ నాగచంద్రారెడ్డి, టీడీపీ నాయకులు సిహెచ్ సీతారామయ్య, సీపీఎం నాయకులు వెంకటేశ్వర్లు, సిహెచ్ బాబూరావు, బీజేపీ నుండి అంజిబాబు, కాంగ్రెస్ నాయ కులు ఎం థామస్, జనసేన నాయకులు జె హరికృష్ణ, తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వైట్ల విద్యాధర్, సీపీఐ చింతలపూడి మండల కార్యదర్శి కె గురవయ్య, రైతు సంఘం డివిజన్ కార్యదర్శి దొంతా కృష్ణ, టీడీపీ నాయకులు బి ఆశీర్వాదం, నిర్వాసితుల పోరాట సమితి అధ్యక్షులు ఎ ఖాదర్‌బాబు రెడ్డి, కార్యదర్శి సిహెచ్ అంజిబాబు, తదితరులు పాల్గొన్నారు.

15న ఎఐటీయూసీ రాష్ట్ర సమితి సమావేశం

విశాలాంధ్ర బ్యూరో- విజయవాడ : ఎఐటీయూసీ రాష్ట్ర సమితి సమావేశం ఈ నెల 15వ తేదీ గురువారం గొల్లపూడిలోని రాష్ట్ర కార్యాలయం జోశ్యభట్ల సత్యనారాయణ భవన్‌లో ఉదయం 11 గం॥లకు జరుగుతుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు ఒక ప్రకటనలో తెలిపారు. ఎఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు చలసాని వెంకట రామారావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మాజీ శాసన మండలి సభ్యులు,రాష్ట్ర గౌరవాధ్యక్షులు పీజే.చంద్రశేఖరరావు తదితరులు పాల్గొంటారని తెలిపారు. జిల్లా, రాష్ట్ర మహాసభల షెడ్యూల్స్ నిర్ణయం, వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణ, వివిధ రంగాల మహాసభల నిర్వహణ కార్యక్రమం, సెంట్రల్ వెరిఫికేషన్ తదితర అంశాలను చర్చించనున్నందున సభ్యులందరూ సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు. 14వ తేదీ ఉదయం విజయవాడలోని అలంకార్ సెంటర్‌లోని ధర్నాచౌక్‌లో అంగన్‌వాడీ కార్మికుల సామూహిక ధర్నా కార్యక్రమం, అదే రోజు సాయంత్రం 4.30 ని॥లకు గొల్లపూడిలోని రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ఆఫీసు బేరర్స్ సమావేశం జరుగుతుందని ఆయన తెలిపారు. జిల్లా కార్యదర్శులు, రాష్ట్ర ఆఫీసు బేరర్స్ దీనిని దృష్టిలో ఉంచుకుని పై కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. 15వ తేదీ ఉదయం 9.30గం॥లకు విజయవాడ లెనిన్ సెంటర్‌లో కేంద్ర ట్రేడ్ యూనియన్ల పిలుపుమేరకు మానవహారం నిర్వహించనున్నామని ఈ కార్యక్రమానికి రాష్ట్ర సమితి సభ్యులందరూ విధిగా హాజరై, అనంతరం రాష్ట్ర సమితి సమావేశాల్లో పాల్గొనాలని ఆయన కోరారు.



ప్రముఖ సినీనటుడు వంకాయల కన్నుమూత

- విశాఖలో కళారంగ అభివృద్ధికి విశేష కృషి
- ఆయన మృతికి పలువురు ప్రముఖుల సంతాపం

విశాలాంధ్ర- విశాఖపట్నం : విశాఖ నగరానికి చెందిన ప్రముఖ రంగస్థల, సినీనటులు వంకాయల సత్యనారాయణమూర్తి (78) సోమవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. గత కొద్ది రోజులుగా శ్వాసకోశ వ్యాధితో ఇబ్బందిపడుతున్న ఆయన నాలుగు రోజుల క్రితం ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స కోసం చేరారు. సోమవారం ఉదయం చికిత్స పొందుతూ 7గంటల సమయంలో ఆయన కన్నుమూసారు. సర్క్యూట్ హౌస్ సమీపంలో టీచర్స్ అపార్టుమెంటులోని ఆయన నివాసానికి పార్థివదేహాన్ని తరలించారు. ఆయన మృతిచెందడంతో నగరానికి చెందిన పలువురు ప్రముఖులు, కళాకారులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయనను కడసారిగా చూసి కుటుంబసభ్యులకు తమ ప్రగాడ సానుభూతిని తెలియజేశారు. వంకాయలకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు మనుమళ్లు, మనమరాళ్లు, ఒక మునిమనుమడు ఉన్నారు. విశాఖలో రంగస్థల కళాకారుడిగా మంచి గుర్తింపుతెచ్చిన ఆయనకు సినీరంగంలో ప్రవేశించే అవకాశం కలిగింది. అప్పటి మద్రాసులో కొన్నేళ్లపాటు ఉన్నారు. 184 సినిమాల్లో ఆయన పోషించిన పాత్ర ప్రేక్షకుల ఆదరణ పొందింది. ఆయన ఆఖరి సినిమా నీడలేని ఆడది, సీతామహాలక్ష్మి సినిమాలో మావిచిగురు పాట ఇప్పటికి ప్రేక్షకుల మదిలో నిలిచిపోయింది. ఎందరో సినీరంగానికి చెందిన వారు మద్రాసులో స్థిరపడిపోయినప్పటికి వంకాయల మాత్రం తమ స్వస్థలమైన విశాఖ పట్ల మక్కువతో ఇక్కడే స్థిరపడ్డారు. మొదటి నుంచి కళాకారులను ప్రోత్సహిస్తూ పలు ప్రదర్శనలు ఇవ్వడం ద్వారా వారిలో నూతన ఉత్తేజాన్ని కలిగించారు. ఎంతో మంది కళాకారులకు సినీ రంగంలో అవకాశం కల్పించిన ఘనత వంకాయలకే దక్కుతుంది. గుణనిధి పేరిట కళాభారతిలో గొప్పకార్యక్రమాన్ని నిర్వహించారు. వంకాయల సత్యనారాయణమూర్తి మృతితో విశాఖ కళారంగం శోకసంద్రంలో మునిగిపోయింది. గొప్ప నటుడిని, కళాహృదయం గల వ్యక్తిని కోల్పోయామని పలువురు కళాకారులు, ప్రముఖులు ఆవేదన వ్యక్తం చేశారు.

గాంధీ విగ్రహం వద్ద ఆంధ్ర ఎంపీల ధర్నా

నాదస్వరంతో పార్లమెంటులో అడుగుపెట్టిన చిత్తూరు ఎంపీ శివ ప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో - న్యూఢిల్లీ : పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్ ఎంపీల ఆందోళన సోమవారం ఆరో రోజు కూడా కొనసాగింది. ప్రధాన ద్వారం ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వద్ద టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ ఎంపీలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేసే వరకు పార్లమెంటును కూడా జరగనివ్వబోమని ఎంపీలు స్పష్టం చేశారు. చిత్తూరు ఎంపీ శివ ప్రసాద్ నాదస్వరం పట్టుకుని విచిత్ర వేషధారణతో పార్లమెంటులో అడుగు పెట్టారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలన్న నినాదంతో పార్లమెంట్ ఉభయ సభలు దద్దరిల్లిపోయాయి. సోమవారం ఉదయం సభా సమావేశాలు ప్రారంభమైన కాసేపటికే ప్రతిపక్షాలు నినాదాలతో నిరసన వ్యక్తం చేశాయి. దీంతో ప్రారంభమైన నిమిషాల వ్యవధిలోనే సభలు మధ్యాహ్నానికి వాయిదా పడ్డాయి. ప్రత్యేక హోదాపై టీడీపీ, వైసీపీ సభ్యులు వాయిదా తీర్మానాన్ని స్పీకర్‌కు అందజేశారు. ప్రత్యేక హోదాపై స్పందించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ విజయసాయి రెడ్డి సావదాన తీర్మానం నోటీసు ఇచ్చారు. సభ ప్రారంభం కాగానే సభ్యులు ప్రత్యేక హోదా నినాదాలతో హోరెత్తించారు. ప్రత్యేక హోదా.. ఆంధ్రుల హక్కు అంటూ వెల్‌లోకి దూసుకెళ్లారు. దీంతో రాజ్యసభను మధ్యాహ్నం 2గంటల వరకు వాయిదా వేస్తున్నట్లు ఛైర్మన్ ప్రకటించారు. ఇక లోక్‌సభలోనూ ఇదే తరహా సన్నివేశం చోటు చేసుకున్నది. నినాదాలు చేస్తూ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లటంతో సభను మధ్యాహ్నానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ సుమిత్రా మహాజన్ తెలిపారు. అనంతరం కూడా ఇదే పరిస్థితి తలెత్తడంతో మంగళవారానికి వాయిదా వేశారు.

పార్లమెంటు స్ట్రీట్‌లో వాల్మీకి సంఘం ఆందోళన : ఏపికి ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వాల్మీకి సంఘాలు పార్లమెంటు స్ట్రీట్‌లో ఆందోళన నిర్వహించాయి. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏపికి ప్రత్యేక హోదా ఇవ్వకపోతే బీజేపీ ఎంపీలను నియోజక వర్గాల్లో తిరగనివ్వమని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇచ్చే వరకు దేశరాజధాని ఢిల్లీలో ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు.

ఒక ఓటుకు రెండు రాష్ట్రాలు

మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



విశాలాంధ్ర అమరావతి: ఒక ఓటుకు రెండు రాష్ట్రాలంటూ బీజేపీ మరోసారి ఏపీని విడగొట్టడానికి కుట్ర పన్నుతోందని మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మండిపడ్డారు. సచివాలయంలోని సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమకు అన్యాయం జరిగిదంటూ బీజేపీ నేతలు మొసలి కన్నీరుకారుస్తున్నారన్నారు. రాయలసీమ వాదాన్ని వినిపిస్తున్న బీజేపీని వైసీపీ నేతలు నిలదీయకుండా తప్పుకు తిరు గుతున్నారన్నారు. ఇలా రెండు పార్టీ నేతల ఒకరి తప్పులను మరొకరు పట్టించుకోకుండా రాజకీయాలను భ్రష్టుపట్టిస్తున్నార న్నారు. తెలంగాణాలో మూడేళ్ల కిందటే టీడీపీతో తెగదెంపులు చేసుకుంటున్నట్లు అక్కడి బీజేపీ నేతలు ప్రకటించారన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా కావాలని ప్రధాని నరేంద్రమోడి నిలదీయలేని చేతకాని, దద్దమ్మ పార్టీ వైఎస్ఆర్ సిపి అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విరుచుకుపడ్డారు. జగన్ కు కేసులు, తన కుటుంబం తప్ప ప్రజా సంక్షేమం పట్టదన్నారు. ప్రతిపక్ష పార్టీ రాజకీయాలను నవ్వులపాలైస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వేర్పాటువాదంతో బీజేపీ మరోసారి నవ్యాంధ్రను విడగొట్టడానికి కుట్రపన్నుతోందని మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిణామాలు చూస్తుంటే సిగ్గేస్తోందన్నారు. ప్రతిపక్ష పార్టీ తీరుతో రాజకీయాల నవ్వుల పాలవ్వుతున్నాయన్నారు. తమ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎప్పుడూ రాష్ట్రాభివ ృద్ధికి తపనపడుతుంటారన్నారు. తాను, తన కేసులు, ఆస్తులు అంటూ జగన్ రాజకీయం సాగుతోందన్నారు. ఢిల్లీ పైరవీలు, లాబీయింగ్ చేసే బాధ్యత ఎంపి విజయసాయిరెడ్డికి జగన్ అప్పగించారని మంత్రి దుయ్యబట్టారు. ఒకవైపు ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చేదిలేదని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్ల స్పష్టం చేస్తున్నారన్నారు.

వైసీపీది రెండు నాల్కల ధోరణి : పల్లె రఘునాథ్

విశాలాంధ్ర- అమరావతి : అధికారమే లక్ష్యంగా వైసీపీ అవినీతి రాజకీయాలు చేస్తుందని ప్రభుత్వ చీఫ్‌విప్ పల్లె రఘునాథ్‌రెడ్డి విమర్శించారు. అసెంబ్లీ మీడియా పోయింట్లో సోమవారం ఆయన మాట్లాడుతూ, జగన్ మోహన్ రెడ్డి , బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి, విజయ్ సాయిరెడ్డిలు రెండు నాల్కల ధోరణితో ద్వంద్వవైఖరి ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. పాదయాత్రలో జగన్ ఆచరణకు వీలుకానీ హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. జగన్ తండ్రి రాజశేఖర్ రెడ్డి కూడా ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పినవి అమలపరచలేదని విమర్శించారు. వైసీపీ హయాంలో 14 వేల మంది రైతులు చనిపోయారని, అదేవిధంగా కాపు రిజర్వేషన్లు ఇస్తామని వైఎస్సార్ అమలు చేయలేదని అన్నారు. చంద్రబాబు నేతృత్వంలో టీడీపీ మ్యానిఫెస్టోలో హామీలన్నీ అమలు చేస్తుందన్నారు. వైసీపీ అవినీతితో పాటు అబద్ధాల పార్టీగా తయారు అయ్యిందని నిప్పులు చెరిగారు. రాజీనామా చేస్తాము అనేది నాటకమని, రాజీనామాల డ్రామా వెనుక బీజేపీ హస్తం ఉందని ఆరోపించారు.

సీఎం ఏనాడూ హోదాకోసం ప్రయత్నించలేదు

వైసీపీ అధినేత జగన్



విశాలాంధ్రబ్యూరో-గుంటూరు: రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలని సీఎం చంద్రబాబు ఏనాడు ప్రయత్నించలేదని వైసీపీ అధినేత జగన్ విమర్శించారు. బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు కోన రఘుపతి తన కార్యకర్తలతో కలసి వైసీపీ అధినేత జగన్‌కు స్వాగతం పలికారు. స్టువర్టుపురం నుంచి బాపట్ల అంబేద్కర్ సర్కిల్ వరకు 15 కిలోమీటర్ల ప్రయాణంను పాదయాత్రలో కొనసాగిస్తూ అశేష జనవాహినిని పలుకరిస్తూ జగన్ పాదయాత్ర కొనసాగించారు. వెదుళ్ళపల్లి సెంటర్‌లో చుట్టు ఉన్న గ్రామాల మహిళలు, పూల వ్యాపారులు తమ పూలతో ప్రతిపక్షనేతకు ఘనస్వాగతం పలికారు. తమ వ్యాపారులకు తగిన మద్దతు ధరను అందించాల్సినదిగా ప్రతిపక్షనేతకు విజ్ఞప్తి చేశారు.మహిళలు చూపిస్తున్న ఆదరణను మరువలేమని ఆయన తెలియజేశారు. శాసనసభ్యులు కోన రఘుపతి, మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ, జిల్లా వైసీపీ ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు వెదుళ్ళపల్లి నుంచి తమ అధినేతతో కలసి పాదయాత్రలో పాల్గొన్నారు. వెదుళ్ళపల్లి గ్రామంలోని పలువురు పూల వ్యాపారులు, లైన్ ఆకు రైతులు, మిర్చి రైతులు ప్రతిపక్షనేత జగన్‌ను కలుసుకొని తమ పంటలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కలిపిస్తే కొంత ఇబ్బందులు నుంచి బయటపడతామని జగన్‌ను కోరారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల ప్రాంతానికి చేరుకోగానే కళాశాల విద్యార్థులు ఫీజురీయంబర్స్‌మెంట్‌లో ప్రభుత్వం అలసత్వాన్ని వివరించారు.

మధ్యాహ్న విరామమునకు కమ్మ కళ్యాణ మండపంలో కార్యకర్తలుకు, నాయకులకు ఎమ్మెల్యే కోన రఘుపతి ఆధ్వర్యంలో భోజన సదుపాయాలను కల్పించడంతో పాదయాత్రకు విరామం దొరికింది. అనంతరం దరివాదకొత్తపాలెం ప్రాంతంలోని కార్యకర్తలను అదుపు చేయడం కోసం డీఎస్పీ గంగాధరం నేతృత్వంలో టౌన్, రూరల్ సీఐలు పోలీస్ సిబ్బందిని ఉపయోగించారు.

క్రీడలు

ఐపీఎల్‌కు కొత్త స్పాన్సర్ ..!



ముంబై : ఇండియన్ ప్రీమియర్ లీగ్ 11వ సీజన్ టైటిల్ కొత్త స్పాన్సర్‌ని బీసీసీఐ ప్రకటించింది. ఈ ఏడాది ఏప్రిల్ 4 నుంచి ఐపీఎల్ 11వ సీజన్ ప్రారంభంకానుంది. అయితే వచ్చే ఐదేళు టైటిల్ స్పాన్సర్‌గా పేటీఎం వ్యవహరించనున్నట్లు ఐపీఎల్ చైర్మన్ రాజీవ్ శుక్లా ప్రకటించారు. "పేటీఎం ఇండియన్ క్రికెట్‌కు టైటిల్ స్పాన్సర్‌గా ఉండనుంది. ఈ సంబంధాలు ఈ ఏడాది ఐపీఎల్‌కు కొనసాగుతున్నాయి. పేటీఎం, బీసీసీఐ రెండు సత్సంబంధాలు కొనసాగుతాయి. పేటీఎంకు బీసీసీఐ గొప్ప విలువ ఇస్తుంది" అని రాజీవ్ తెలిపారు. అనంతరం పేటీఎం వ్యవస్థాపకుడు, చైర్మన్ విజయ్ శేఖర్ శర్మ మాట్లాడుతూ.. "ఐపీఎల్‌కు పార్ట్‌నర్‌గా ఉండటం ఎంతో సంతోషంగా ఉంది. పేటీఎం ఎదుగుదలలో క్రికెట్ ఓ కీలక పాత్ర పోషించింది. మాకు బీసీసీఐతో మంచి సంబంధాలు ఉన్నాయి. ఈ ఏడాది ఐపీఎల్‌లో మా పెట్టుబడులు మా నిబద్ధతను మరింత బలపరుస్తుంది అని భావిస్తున్నా" అని అన్నారు. గత సీజన్ కోసం వివో సంస్థ రూ.100 కోట్లతో టైటిల్ స్పాన్సర్‌షిప్‌ను దక్కించుకుంది. గతంలో డీఎల్‌ఎఫ్, పెప్సీకో ఐపీఎల్ టైటిల్ స్పాన్సర్లుగా వ్యవహరించాయి. కాగా 2018 సీజన్ నుంచి 2022 వరకూ పేటీఎం సంస్థ ఐపీఎల్ టైటిల్ స్పాన్సర్‌షిప్‌ని రూ.439.8 కోట్ల వెచ్చించి దక్కించుకున్నట్లు సమాచారం.

నవజోత్ కౌర్‌కు రెండో ర్యాంకు



న్యూఢిల్లీ: భారత స్టార్ రెజ్లర్, ఇటీవల ఆసియా చాంపియన్‌షిప్‌లో స్వర్ణం గెలిచి చరిత్ర సృష్టించిన నవజోత్‌కౌర్ ప్రపంచ ర్యాంకిం గ్స్‌లో అదరగొట్టింది. మహిళల 65 కిలోల విభాగంలో నవజోత్ కెరీర్‌లోనే అత్యుత్తమంగా రెండో ర్యాంకుకు చేరుకుంది. ఫిన్లాండ్‌కు చెందిన పెట్రా ఒల్లి టాప్‌ర్యాంక్‌లో నిలిచింది. 50 కిలోల విభాగంలో భారత్‌కు చెందిన వినేష్ ఫోగట్ 22 పాయింట్లతో రెండో ర్యాంక్‌లో నిలవగా, చైనా రెజ్లర్ లీ చున్ 24 పాయింట్లతో నంబర్‌వన్ ర్యాంక్‌ను దక్కించు కుంది. 59 కిలోల విభాగంలో సంగీత ఫోగట్ 5వ ర్యాంకు, 62 కిలోల విభాగంలో ఒలింపిక్ కాంస్య పతక విజేత సాక్షి మాలిక్ 18 పాయింట్లతో 4వ ర్యాంక్‌లో కొనసాగుతు న్నారు. పురుషుల ఫ్రీస్టయిల్ కేటగిరి 61 కిలోల విభాగంలో శ్రావణ్ 8వ ర్యాంకు, 65 కిలోల విభాగంలో భజరంగ్ పూనియా 4వ ర్యాంకు అందుకున్నారు.

16న మేరీకామ్ అకాడమీ ప్రారంభం



హాజరుకానున్న ప్రధాని మోడీ

ఇంఫాల్ : బాక్సర్ మేరీకోమ్ బాక్సింగ్ అకాడమీని స్థాపించనున్నది. ఈ అకాడమీని ప్రధాని నరేంద్ర మోడీ మార్చి 16న ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో ఒలింపిక్ పతక విజేత, బాక్సర్ విజేందర్ సింగ్, రెజ్లర్ సుశీల్ కుమార్ హాజరవుతారు. మణిపూర్‌లోని ఇంఫాల్‌లో ఉన్న ఈ అకాడమీ దాదాపు 3.3 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇంఫాల్‌కు 10 కిలోమీటర్ల దూరంలో ఉంది. ప్రస్తుతం మేరీకోమ్ వద్ద 20 మంది బాలికలతో సహా 45మంది శిక్షణ పొందుతున్నారు. 2013లో మేరీకోమ్‌కు ఈ స్థలాన్ని మణిపూర్ ప్రభుత్వం కేటాయించింది. జాతీయ క్రీడాభివృద్ధి సంస్థ సహకారంతో అకాడమీ నిర్మాణం జరిగింది. '2006లో అకాడమీ స్థాపించలనుకున్నా. సుదీర్ఘ పోరాటం తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇందుకు సమ్మతించి, అకాడమీ నిర్మాణం చేపట్టడం ముదావహం. నా పోరాటం ఇప్పటికి ఫలించింది' అని మేరీకోమ్ పేర్కొంది.

చండిమాల్ స్థానంలో పెరీరా



కొలంబో: ముక్కోణపు టీ20 సిరీస్‌లో శ్రీలంకకు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. టోర్నీలో భాగంగా లంక ఆడే చివరి రెండు లీగ్ మ్యాచ్‌లకు కెప్టెన్ దినేశ్ చండీమాల్ దూరమైన సంగతి తెలిసిందే. అతని స్థానంలో సహచర ఆటగాడు థిసారా పెరీరాకు నాయకత్వ బాధ్యతలు అప్పగించినట్లు లంక క్రికెట్ బోర్డు తెలిపింది. శనివారం బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక నిర్ణీత సమయానికి నాలుగు ఓవర్లు తక్కువగా వేసింది. ఆ తర్వాత నాలుగు ఓవర్లు వేసేందుకు 20నిమిషాల దాకా అదనపు సమయం తీసుకుంది. దీన్ని తీవ్ర నేరంగా పరిగణించిన రిఫరీ లంక జట్టు సారథి దినేశ్ చండీమాల్‌పై రెండు మ్యాచ్‌ల నిషేధం విధించాడు. అంతేగాక ఆటగాళ్లందరి మ్యాచ్ ఫీజులో 60 శాతం కోత విధించిన సంగతి తెలిసిందే. టోర్నీలో భాగంగా ఈ రోజు భారత్ ఆతిథ్య శ్రీలంకతో తలపడనుంది. మార్చి 6న ఇరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో భారత్‌పై లంక విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఇప్పటి వరకు జరిగిన మ్యాచ్‌ల్లో మూడు జట్లు తలో మ్యాచ్ గెలవడంతో ఇక టోర్నీలో జరిగే ప్రతి మ్యాచ్ ఆసక్తిగా మారింది.



తొలి వన్డే.. ఆసిస్ ఘనవిజయం

వదోదర : సఫారీ గడ్డపై విరుచుకుపడిన భారత మహిళల జట్టు సొంతగడ్డపై బోల్తా పడింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఆతిథ్య భారత్‌తో జరిగిన వన్డేలో ఆస్ట్రేలియా విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేపట్టిన భారత్.. బౌలర్లు జోనసెన్, వెల్లింగ్టన్ ధాటికి కుప్పకూలింది. దీంతో నిర్ణీత 50 ఓవర్లలో భారత్ 200 పరుగులకే ఆలౌటైంది. 201 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆసీస్ దీటుగా ఇన్నింగ్స్ ప్రారంభించింది. ఓపెనర్ బోల్టన్ 100(101 బంతుల్లో) పరుగులతో భారత బౌలర్లపై విరుచుకుపడింది. దీంతో 32.1ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి ఆసీస్ లక్ష్యాన్ని అందుకుంది. 8వికెట్ల తేడాతో విజయం సాధించిన ఆసీస్ మూడు వన్డేల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. టోర్నీలో భాగంగా ఇరు జట్ల మధ్య రెండో మ్యాచ్ గురువారం జరగనుంది.



షమీ వివరాలివ్వండి

బీసీసీఐకి కోల్‌కతా పోలీసులు లేఖ

కోల్‌కతా : టీమిండియా పేసర్ మహమ్మద్ షమి దక్షిణాఫ్రికా పర్యటనకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని కోల్‌కతా పోలీసులు బీసీసీఐకి లేఖ రాశారు. షమి దక్షిణాఫ్రికా పర్యటన ముగించుకుని నేరుగా భారత్ రాకుండా దుబాయ్ వెళ్లాడని.. అక్కడ ఓ పాకిస్థాన్ అమ్మాయి నుంచి డబ్బు తీసుకున్నాడని గత వారం అతని భార్య హసీన్ జహాన్ ఆరోపించిన సంగతి తెలిసిందే. తన భర్తకు ఇతర మహిళలతో సంబంధాలు ఉన్నాయని, తనపై హత్యాయత్నానికి పాల్పడ్డాడని కోల్‌కతా పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. దీంతో షమిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలోనే వారు బీసీసీఐకు లేఖ రాశారు. దక్షిణాఫ్రికా పర్యటన ముగించుకుని షమి సహచర ఆటగాళ్లతో కలిసి అదే విమానంలో నేరుగా భారత్ వచ్చాడా? లేక మరో విమానంలో వచ్చాడా? ఒకవేళ షమి దుబాయ్ వెళ్లి ఉండే జట్టుతో కలిసే వెళ్లాడా? వెళ్తే అక్కడ ఎన్ని రోజులు ఉన్నాడు? అది బీసీసీఐ అధికారిక పర్యటనేనా? అంటూ పోలీసులు లేఖలో పేర్కొన్నారు. బీసీసీఐ ఇచ్చే సమాధానాల కోసం పోలీసులు వేచి చూస్తున్నారు. హసీన్ తన భర్త షమిపై రోజుకో సంచలన ఆరోపణ చేస్తూనే ఉంది. మరో పక్క షమి చర్చల ద్వారా తన భార్యతో సమస్యల్ని పరిష్కరించుకోవాలని భావిస్తున్నాడు.

'శార్దూల్' పంజా





- నాలుగు వికెట్లతో దుమ్ములేపిన ఠాకూర్
- రాణించిన కుశాల్ మెండీస్
- భారత లక్ష్యం 153
- ప్రస్తుతం 35/2

కొలొంబో: నిదహాస్ ముక్కోణపు సిరీస్‌లో భాగంగా సోమవారం ఆర్.ప్రేమదాస స్టేడియంలో భారత్-శ్రీలంక మధ్య జరుగుతున్న నాలుగో టీ-20 మ్యాచ్‌లో శ్రీలంక 9 వికెట్లు కోల్పోయి 152 పరుగులు చేసింది. కుశాల్ మెండీస్ 55 పరుగులు చేశాడు. మిడిలార్డర్ విఫలమవడంతో శ్రీలంక భారీ స్కోరు సాధించలేకపోయింది. భారత్ బౌలింగ్‌లో శార్దూల్ ఠాకూర్ 4 వికెట్లు, వాషింగ్టన్ సుందర్ 2, ఉనాద్కట్, యజ్వేంద్ర చాహల్, విజయశంకర్ తలో వికెట్ పడగొట్టారు. అయితే వర్షం కారణంగా 6.45 గంటలకు జరగాల్సిన టాస్ 8.05 గంటలకు జరిగింది. ఆలస్యంగా ప్రారంభమైన కారణంగా మ్యాచ్‌ను 19 ఓవర్లకు కుదించారు. దీనివల్ల ముగ్గురు బౌలర్లు తలో 4 ఓవర్లు, మరొక బౌలర్ 3 ఓవర్లు బౌలింగ్ చేశారు. గుణతిలక, కుశాల్ మెండీస్‌లు ఇన్నింగ్స్‌ను ధాటిగా మొదలుపెట్టారు. మొదటి ఓవర్‌లోనే భారీషాట్‌లతో రన్‌రేట్ 15 దాకా వెళ్లింది. వీరిద్దరూ అడపాదడపా షాట్లు కొడుతున్న క్రమంలో ఠాకూర్ వేసిన ఓ చక్కటి బంతికి గుణతిలక (17 పరుగులు, 8 బంతులు, 1×6) రైనాకు దొరికిపోయాడు. గుణతిలక స్థానంలో కుశాల్ పెరీరా బ్యాటింగ్ రాగా, అతడి సాయంతో కుశాల్ మెండీస్ వీరవిహారం చేశాడు. ఇదే క్రమంలో పెరీరా(3)ను వాషింగ్టన్ సుందర్ బోల్తా కొట్టించాడు. అద్భుతమైన బంతితో బౌల్డ్ చేశాడు. అనంతరం క్రీజ్‌లోకి వచ్చిన ఉపుల్ తరంగ భారత్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంతో కొంత తడబడ్డాడు. ఈ క్రమంలో కుశాల్ మెండీస్ తన హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇద్దరూ స్కోరు బోర్డును పరుగులెత్తిస్తున్న క్రమంలో ఉపుల్ తరంగ(22 పరుగులు, 24 బంతులు, 1×4, 1×6)ను విజయశంకర్ బౌల్డ్ చేశాడు. తరువాత వచ్చిన ఆటగాళ్లల్లో తిశారా పెరీరా (15), దాసన్ షనక (19) తప్పక చెప్పుకోదగ్గగా ఎవరూ ఆడలేదు. మిడిల్డార్ వైఫల్యంతో శ్రీలంక భారీ స్కోరు సాధించలేక పోయింది. ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన తీరును చూస్తే భారీగా స్కోరు సాధిస్తుందనుకున్న శ్రీలంకను భారత బౌలర్లు ఎట్టకేలకు కట్టడి చేశారు. దీంతో భారత్ ముందు శ్రీలంక 153 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. టీమిండియా ఇన్నింగ్స్‌ను ఓపెనర్లు రోహిత్ శర్మ, శిఖర్ ధావన్‌లు ప్రారంభించారు. రోహిత్ శర్మ (11 పరుగులు, 7 బంతులు, 1×4, 1×6 ఓ చక్కటి సిక్స్‌తో స్కోరు బోర్డులు ప్రారంభించాడు. ఈ క్రమంలో ధాటిగా ఆడుతూ ధనంజయ బౌలింగ్‌లో కుశాల్ మెండీస్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. కొద్దిసేపటికి శిఖర్ ధావన్(8 పరుగులు, 10 బంతులు 1×4)ను ధనంజయానే ఔట్ చేశాడు. అప్పటికి భారత్ స్కోరు 22.



రైనా... గాయకుడి అవతారం

కొలంబో: భారత క్రికెటర్ సురేశ్ రైనా పాటలు ఎంత చక్కగా పాడతాడో అభిమానులకు తెలిసిందే. ఇప్పుడు ఈ విషయం ఎందుకు గుర్తు చేసుకోవాల్సి వచ్చిందంటే.. తాజాగా రైనా మరోసారి పాట పాడి అభిమానులను అలరించాడు. ముక్కోణపు టోర్నీ కోసం ప్రస్తుతం రైనా శ్రీలంకలో పర్యటిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రైనా బస చేస్తున్న హోటల్‌లో లైవ్ మ్యూజిక్ కొనసాగుతోంది. సహచర ఆటగాళ్లతో కలిసి అక్కడికి చేరుకున్నాడు రైనా. అప్పటికే అక్కడ బాలీవుడ్ సింగర్ కిషోర్ కుమార్ పాడిన 'యే షామ్ మస్తానీ... మదోష్ కియ జాయ్' అనే పాటను ఆలపిస్తున్నారు. రైనాకు ఈ పాట అంటే చాలా ఇష్టం. వెంటనే వారి వద్దకు వెళ్లి తానూ గొంతు కలిపాడు. దీనికి సంబంధించిన వీడియోను బీసీసీఐ సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకుంది. ఇంతకీ ఇది ఏ సినిమాలో పాటో తెలుసా.. 1971లో శక్తి సామంత్ దర్శకత్వంలో వచ్చిన 'కటీ పతంగ్' లోనిది. రాజేశ్ ఖన్నా, ఆషా పరేఖ్ ప్రధాన పాత్రల్లో నటించారు. సుదీర్ఘ విరామం తర్వాత జట్టులో చోటు దక్కించుకున్న రైనా.. దక్షిణాఫ్రికా పర్యటనలో ఆకట్టుకున్న సంగతి తెలిసిందే.



కెరీర్‌లో మరిచిపోలేని విజయం..

కాలిఫోర్నియా : ప్రముఖ భారత టెన్నిస్ క్రీడాకారుడు యూకీ బాంబ్రీ తన కెరీర్‌లోనే మరిచిపోలేని అరుదైన విజయాన్ని సొంతం చేసుకున్నాడు. టెన్నిస్‌లో ప్రపంచ నంబర్ 12 ఫ్రెంచ్ క్రీడాకారుడు లూకాస్ పౌల్లెను ఓడించి చరిత్ర సృష్టించాడు. 110వ ర్యాంక్‌లో ఉన్న యూకీ ఈ విజయంతో టెన్నిస్ లోకాన్ని ఆశ్చర్యంలో ముంచేశాడు. సోమవారం జరిగిన ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సెకండ్ రౌండ్‌లో 6-4, 6-4 తేడాతో లూకాస్ పౌల్లెపై విజయ దుందుభి మోగించాడు.

ముంబైలో ఎర్ర సునామీ...!



విశాలాంధ్ర - ముంబై : సంపూర్ణ రుణమాఫీ, ఆదివాసీల గ్రామాల మీదుగా నదుల అనుసంధానం, ఉత్పత్తి వ్యయానికి ఒకటిన్నర రెట్లు గిట్టుబాటు ధర చెల్లించాలనే స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలనే డిమాండ్లతో... 'అఖిల భారత కిసాన్ సభ' ఆధ్వర్యంలో మార్చి 6న నాసిక్‌లోని సీబీఎస్ చౌక్ నుంచి బయలుదేరిన రైతులు సోమవారం ముంబై నడివీధుల్లో కదం తొక్కారు. సుమారు 50 వేల మంది రైతులు ముంబై ఆజాద్ మైదానానికి చేరుకున్నారు. తొలుత విధాన్ సభను ముట్టడించాలని నిర్ణయం తీసుకున్నారు. అయితే, రైతుల డిమాండ్లన్నింటిని తీరుస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో నిరసనను ఉపసంహరించుకున్నారు. "భూ టైటిల్ బదిలీతో సహా రైతుల నూరుశాతం డిమాండ్లను ప్రభుత్వం అంగీకరిస్తోంది" అని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి గిరీష్ మహాజన్ తెలిపారు. తమ నిరసనను విరమించేందుకు రైతులు అంగీకరించారు. వారు స్వస్థలాలకు తిరిగి వెళ్లేందుకు వీలుగా ప్రత్యేక రైలును ఏర్పాటు చేస్తున్నాం అని మంత్రి చెప్పారు.

ఆరురోజులు 180 కిలోమీటర్ల నడిచిన రైతులు ముంబైకి చేరుకున్న తరుణంలో... సీపీఐ సహా కాంగ్రెస్, శివసేన, ఆప్, ఎన్సీపీ...మహారాష్ట్ర నవ్ నిర్మాణ సేన తదితర రాజకీయ పార్టీలన్నీ రైతులకు సంపూర్ణమద్దతు తెలిపాయి. 180 కిలోమీటర్లు సాగిన యాత్రలో ఎక్కడా ఆవేశకావేషాలకు అవకాశం ఇవ్వకుండా క్రమశిక్షణ పాటించిన రైతులు ముంబై నగరానికి వచ్చిన తర్వాత కూడా ప్రభుత్వ ప్రతిపాదనకు సమన్వయంతో అంగీకరించటం విశేషం. రైతుల సమస్యలపై స్పందించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. పట్టుదలకు పోకుండా రైతుల డిమాండులను నెరవేర్చాలని కోరారు. ఈ సందర్భంగా రైతుల చేతిలో ఎర్ర జెండాలు తనకు కనిపించటం లేదని, వాళ్లలో మరుగుతున్న రక్తం కనిపిస్తోందని యువసేన అధ్యక్షుడు ఆదిత్య ఠాకరే ట్వీట్ చేశారు. రైతుల గుండెకోత, మనోవ్యథ సర్కారును కూల్చి వేస్తుందని శివసేన వ్యాఖ్యానించింది. దూలేకి చెందిన రైతు ధర్మపాటిల్ మంత్రాలయంలో ఆత్మహత్య చేసుకున్నాడని, ఇప్పుడు వేలాది మంది ధర్మపాటిళ్లు జైకిసాన్ నినాదంతో మంత్రాలయం వైపు కదం తొక్కుతున్నారని శివసేన అధికార పత్రిక సామ్నా స్పష్టం చేసింది.

చర్చలకు సిద్ధం : సర్కారు

రైతులతో అన్ని సమస్యలపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నట్టు సీఎం ఫడ్నవీస్ స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం రైతుల ప్రతినిధులతో చర్చలు జరిపేందుకు సీనియర్ మంత్రి గిరీష్ మహాజన్‌కు బాధ్యతలు అప్పగించారు. దీంతో అఖిల భారత కిసాన్ సభ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ గుజార్ నేతృత్వంలో రైతుల ప్రతినిధి బృందం విధాన సభకు చేరుకుంది. చర్చలు ఫలించాయి. రైతుల అన్ని డిమాండ్లను అంగీకరిస్తున్నామని మంత్రి తెలిపారు.

అక్కున చేర్చుకున్న ముంబై...

ముంబై నగరానికి చేరుకున్న 'అఖిల భారత కిసాన్ సభ' రైతులను ముంబై వాసులు గుండెకు హత్తుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి వరకు తండోపతండాలుగా వస్తున్న రైతులకు నీళ్ల బాటిళ్లు, బిస్కట్ ప్యాకెట్లు, పండ్లు, ఫలహారాలు, పొంగలి పొట్లాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో సంఘాలు, మతాలు, రాజకీయ పార్టీలు పాల్గొన్నాయి. డబ్బావాలాలు ఇతోధిక సేవల్లో పాల్గొన్నారు. ఓ చోట ఒక సంస్థకు చెందిన కార్యకర్తలు రైతులకు చెప్పుల జోళ్లను కూడా పంచి పెట్టారని 'ముంబై మిర్రర్' తెలియజేసింది. నగరంలోని ఆజాద్ మైదాన్‌కు చేరుకున్న దాదాపు 35 వేల మంది రైతులుకు సోమవారం ఉదయం పలు ఎన్జీవో సంఘాలు అల్పాహారాన్ని పంచిపెట్టాయి. రైతుల పట్ల ముంబై వాసులు చూపిన ఆదరణను తామెన్నటికీ మరువలేమని అఖిల భారత కిసాన్ సభ రాష్ట్ర



సోలార్ చార్జింగ్

న్యూఢిల్లీ : నాసిక్ నుంచి ముంబైకి 35 వేల మంది తరలి రావడం ఎంత కష్టమో అంతమందికి వారం రోజులపాటు అన్న పానీయాలు ఏర్పాటు చేయడం కూడా అంత కష్టమే. ఇక ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన నేటి సమాజంలో సెల్‌ఫోన్లు వాడకుండా ఉండాలంటే కూడా ఎంతో కష్టం. వ్యవసాయానికి సంబంధించిన సమాచా రాన్ని ఇచ్చి పుచ్చుకోవడంలో నేడు రైతులకు కూడా మొబైల్ ఫోన్ల వాడకం తప్పనిసరైందని తెల్సిందే. మరి ఇలాంటి పరిస్థితుల్లో రైతుల ఫోన్లను చార్జింగ్ చేసుకోవడ ఎలా? దీనికి కూడా రైతులే పరిష్కారం కనుగొన్నారు. స్థానికంగా లభించే పలకలాంటి సోలార్ ప్యానెళ్లను వారు సెల్‌ఫోన్ ఛార్జింగ్‌కు ఉపయోగించారు. ఆ సోలార్ ప్యానెల్ ద్వారా ఒకేసారి నాలుగైదు సెల్‌ఫోన్లను చార్జింగ్ చేయవచ్చుట. ఒక్కసారి చార్జి చేస్తే రెండు, మూడు గంటల వరకు ఫోన్ పనిచేస్తుందట. చాలా మంది రైతులు ఇలాంటి సోలార్ ప్యానెళ్లను తమ వెంట తెచ్చుకున్నారు. మండు టెండలో కాలినడకను వారం రోజులపాటు నడిచిన రైతులకు ఇంటివారితో మాట్లాడేందుకు ఫోన్లు అందుబాటులో ఉండడం ఎంతో ఉపశమనం కలిగించి ఉంటుంది. రైతుల ర్యాలీలో తలలపై చార్జింగ్ సోలార్ ప్యానెళ్లను పెట్టుకొని కొంత మంది రైతులు ప్రత్యేకంగా కనిపించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.